RNI.No.TELTEL/2000/00272

ASHISH MEDIA SERVICES (AMS)
You can download news from our 'AMS News Agency'
Logon to our website and registar.
News from the Unreached
AMS NEWS
www.ashishmediaservices.blogspot.com
Contant No. : 9247698676

Estd.: 2000
www.voodayam.com /voodayam /Voodayam

# వుదయం

Simultaneously published from Hyderabad, Adilabad, Khammam, Karimnagar, Guntur & Warangal

**రిపోర్టర్లు కావలెను...**
తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో వుదయం తెలుగు దిన పత్రికకు రిపోర్టర్లుగా పని చేయుటకు ఆసక్తిగల, అనుభవజ్ఞులైన అభ్యర్థులు కావలెను.
- సిరికొండ అగస్టిన్
BA. L.L.B., M.C.J.
వుదయం ఎడిటర్
సెల్: 9247698676

సంపుటి : 28 | సంచిక :65 | హైదరాబాద్ | శుక్రవారం, మార్చి 21, 2025 | VOODAYAM Telugu Daily | వెల : రూ. 3.00 | పేజీలు : 12



# కేడర్‌లో ఉత్సాహం



- కేంద్ర పెద్దలతో తెలంగాణ బీజేపీ నేతల సమావేశం.. టార్గెట్ ఏంటంటే..
- కష్టపడితే తెలంగాణలో అధికారం సాధించవచ్చు
- స్థానిక ఎన్నికల్లో విజయం కోసం పాటించాల్సిన వ్యూహాలపై చర్చలు
- వరుస విజయాలు సాధిస్తుండడంతో బీజేపీ కేడర్ పూర్తి జోష్‌లో ఉంది
- ఇదే స్ఫూర్తితో పని చేస్తే తెలంగాణలో అధికారం కూడా సొంతమవుతుందనే భావనతో కేడర్ ఉత్సాహంగా..

హైదరాబాద్

ఇటీవల తెలంగాణ రాష్ట్రంలో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాల్లో ఊహించని విజయాలు అందుకున్న బీజేపీ రాష్ట్ర నేతలు బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాను, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాను కలుసుకున్నారు. ముందుగా నడ్డాతో అరగంట పాటు తెలంగాణ బీజేపీ నేతలు సమావేశమయ్యారు. తెలంగాణలో మంచి ఫలితాలు సాధించిన నేతలను నడ్డా అభినందించారు. ఇలాగే కష్టపడితే తెలంగాణలో అధికారం సాధించవచ్చని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం పార్లమెంట్ భవనంలో అమిత్‌షాను కేంద్రమంత్రి కిషన్ రెడ్డి నేతృత్వంలో తెలంగాణ ఎంపీలు, నాయకులు కలిశారు ఇటీవల తెలంగాణ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ తరపున విజయం సాధించిన మల్క కొమురయ్య, అంజిరెడ్డిని అమిత్ షా అభినందించారు. స్థానిక ఎన్నికల్లో విజయం కోసం పాటించాల్సిన వ్యూహాలపై చర్చలు జరిపారు. అలాగే రాష్ట్రంలో ప్రస్తుతం హాట్ టాపిక్‌గా మారిన సర్వే గురించి కూడా అమిత్ షా మాట్లాడారు. మనం బీసీ రిజర్వేషన్ వ్యతిరేకం కాదని, కానీ ఆ పేరుతో ముస్లింలకు రిజర్వేషన్లు కల్పించడాన్ని మాత్రం అడ్డుకోవాలని టీ-బీజేపీ నేతలకు అమిత్ షా సూచించారు. కష్టపడి పని చేసి రాబోయే ఎన్నికల్లో అధికారం సాధించాలని సూచించారు. వరుస విజయాలు సాధిస్తుండడంతో బీజేపీ కేడర్ పూర్తి జోష్‌లో ఉంది. ఇదే స్ఫూర్తితో పని చేస్తే తెలంగాణలో అధికారం కూడా సొంతమవుతుందనే భావనతో కేడర్ ఉత్సాహంగా పని చేస్తోంది. ఈ ఉత్సాహానికి తాజాగా ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు మరింత జోష్‌ను ఇచ్చాయి. కరీంనగర్‌లో వచ్చిన -

# అదంతా దుష్ప్రచారం



- నా మీద ప్రజలకు కోపమా?
- కొలువుల పండగ కార్యక్రమంలో సీఎం రేవంత్
- గత పాలకులు పదేళ్లుగా ఈ నియామకాలు చేపట్టలేదు
- కానీ తమ ప్రభుత్వం కారుణ్య నియామకాల్ని చేపట్టింది
- నామీద వ్యతిరేకత వచ్చిందని కొందరు దుష్ప్రచారం చేస్తున్నారు.
- ముఖ్యమంత్రి పదవి కంటే జెడ్పీటీసీగా గెలిచినప్పుడే ఆనందం కలిగింది: రేవంత్ రెడ్డి
- మొదటిసారి వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్న ముఖ్యమంత్రి
- తెలంగాణ ఉద్యమంలో నిరుద్యోగుల పాత్ర మరువలేనిదన్న రేవంత్ రెడ్డి
- నిరుద్యోగులను నిర్లక్ష్యం చేయడం వల్లే బీఆర్ఎస్ ఓడిపోయిందని వ్యాఖ్య

హైదరాబాద్

నా మీద వ్యతిరేకత వచ్చిందని కొందరు దుష్ప్రచారం చేస్తున్నారని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. అభివృద్ధి చేసినందుకే నాపై ప్రజలు కోపంగా ఉన్నారా? అని ప్రశ్నించారు. తెలంగాణ ప్రభుత్వం గురువారం హైదరాబాద్ రవీంద్రభారతిలో కొలువుల పండగ కార్యక్రమం నిర్వహించింది. పంచాయితీరాజ్, గ్రామీణభివృద్ధి శాఖలో కార్యుణ నియామకాల్ని చేపట్టింది. ఎంపికైన 922 మందికి కారుణ్య నియామక పత్రాలు అందించింది. ఈ సందర్భంగా రేవంత్ మాట్లాడుతూ.. గత పాలకులు పదేళ్లుగా ఈ నియామకాలు చేపట్టలేదు. కానీ తమ ప్రభుత్వం కారుణ్య నియామకాల్ని చేపట్టింది. నామీద వ్యతిరేకత వచ్చిందని కొందరు దుష్ప్రచారం చేస్తున్నారు. ప్రజలు నాపై కోపంగా ఎందుకు ఉంటారు? మహిళలకు ఉచిత బస్సు కల్పించినందుకా? నాపై కోపం..? ఉద్యోగాలు ఇచ్చినందుకా



## మావోలకు గట్టి ఎదురుదెబ్బ

- ఎన్‌కౌంటర్‌లో 22 మంది మావోయిస్టులు మృతి
- మావోయిస్టులు, భద్రతా దళాల మధ్య నిరంతర కాల్పులు
- ఆయుధాలు, మందుగుండు సామగ్రితో పాటు పద్దెనిమిది మంది నక్సలైట్ల మృతదేహాల స్వాధీనం

## ప్రపంచ పర్యాటకులను ఆకర్షించేలా..

- తెలంగాణ గురించి ప్రపంచానికి చాటి చెప్పేలా మిస్ వరల్డ్ పోటీలు
- మిస్ వరల్డ్ పోటీలకు 140 దేశాల నుంచి అందాల భామలు వస్తారు
- తెలంగాణ గురించి ప్రపంచానికి చాటి చెప్పేందుకు ఇది మంచి అవకాశం
- ఈ పోటీల్లో పాల్గొనే వారితో పాటు వేలాది మంది దేశ విదేశాలకు చెందిన వారు తెలంగాణకు వస్తారు
- మహిళల అంతః సౌందర్యాన్ని సెలబ్రేట్ చేయడం మిస్ వరల్డ్ పోటీల ఉద్దేశం
- మంత్రి జూపల్లి కృష్ణారావు



హైదరాబాద్

హైదరాబాద్ వేదికగా 72వ అంతర్జాతీయ మిస్ వరల్డ్ పోటీలు జరుగనున్నాయి. మే 7వ తేదీ నుంచి మే 31వ తేదీ వరకు నిర్వహించనున్న ఈ అందాల పోటీల్లో సుమారు 140 దేశాలకు సంబంధించిన అందాల భామలు పాల్గొనను న్నారు. ఈక్రమంలో బేగంపేట్ టూరిజం ప్లాజాలో గురువారం మిస్ వరల్డ్ పోటీలకు చెం దిన ప్రీ ఈవెంట్ ప్రెస్ కాన్ఫరెన్స్ నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణా రావు, టీజీటీడీసీ చైర్మన్ పటేల్ రమేశ్ రెడ్డి, టూరిజం సెక్రటరీ స్మితా సబర్వాల్, మిస్ వరల్డ్



## ఎయిర్ లైన్స్‌లో ఇండిగో హవా

- 5 లక్షల చేరువలో ఎయిర్ ట్రాఫిక్
- మధ్య తరగతి ప్రజలను ఆకర్షించేందుకు ఎయిర్ లైన్స్ కంపెనీలు ప్రయత్నిస్తూనే ఉంటాయి.
- చాలా కంపెనీలు పలు రకాల వ్యూహాలను రచిస్తూనే ఉన్నాయి
- సంపన్న దేశాల మాదరి భారత్ లో ఎయిర్ లైన్స్ సేవలను విస్తరించేందుకు ప్రభుత్వం ప్రయత్నాలు

## ప్రతి తెలంగాణ బిడ్డకు గుండె ధైర్యం ఈ గులాబీ జెండానే

- శూన్యం నుంచి సునామీ సృష్టించి తెలంగాణ సాధించిన మహా నాయకుడు కేసీఆర్
- వానపాములు కూడా నాగుపాముల్లా బుస కొడుతున్నాయి.. సీఎం రేవంత్‌పై కేటీఆర్ సెటైర్లు
- అసూయ, ద్వేషం, ఆశ.. పార్టీ ఓటమిపై కేటీఆర్ కీలక వ్యాఖ్యలు
- ఏపీ కలిపి చూస్తే మన చరిత్ర సుదీర్ఘమైనది
- ఈ దేశంలో చాలా కాలం దశాబ్దాల పాటు తెలుగువారిని మద్రాసీలు



సూర్యాపేట

బీఆర్ఎస్ పార్టీ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు.. 2001లో గులాబీ జెండా ఎగురవేసి ఒక్కడిగా బయల్దేరి శూన్యం నుంచి సునామీ సృష్టించి తెలంగాణ సాధించిన మహా నాయకుడు కేసీఆర్ అని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. సూర్యాపేటలో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ బహిరంగ సభలో కేటీఆర్ పాల్గొని ప్రసంగించారు. బీఆర్ఎస్ పార్టీ కోసం రక్తం ధారపోస్తున్న అన్నదమ్ముళ్లకు, అక్కాచెల్లెల్లకు హృదయపూర్వక వందనాలు. ఇది అరుదైన సందర్భం. తెలుగు రాజకీయాలు.. తెలంగాణ, ఏపీ కలిపి చూస్తే మన చరిత్ర సుదీర్ఘమైనది. ఈ దేశంలో చాలా కాలం దశాబ్దాల పాటు తెలుగువారిని మద్రాసీలు అని పిలిచేవారు. కానీ నందమూరి తారకరామారావు టీడీపీ స్థాపించి తెలుగువారి గొప్పతనాన్ని ఎలుగెత్తి చాటారు. ఆ తర్వాత ఈ దేశంలో తెలంగాణ కంటూ ప్రత్యేక అస్తిత్ ఉందని, పౌరుషాల గడ్డ ఉన్నది అని ఎలుగెత్తి చాటిన నాయకుడు కేసీఆర్.



## నక్సల్స్‌కు అమిత్‌షా వార్నింగ్

- లొంగిపోయేందుకు మావోయిస్టులకు కేంద్రం అవకాశం ఇస్తుంది
- కాదు కూడదు అంటే వారి పట్ల కేంద్రం కఠినంగా వ్యవహరిస్తోంది
- వచ్చేదాది మార్చి నెల లోపు నక్సలిజాన్ని అంతచేస్తాం

## సంపాదకీయం

# తెలుగు తనానికి నిర్వచనం

అచ్చ తెలుగు మాటలతో అందమైన పద్యాలు అల్లగలిగిన ఆధునిక కవుల్లో ఆయనను మించిన వారు లేరంటె అతిశయోక్తి కాదు. కవిగా, పండితుడిగా, తనకు తానే తీర్చిదిద్దుకొన్న ప్రతిభాశాలి ఆయన. భాషాపరంగా ఆయన సంప్రదాయ బద్ధుడైనా భావనా పరంగా ఆధునికులు. అచ్చమైన గాంధేయవాది. తెలుగుదనం మూర్తీభవించిన, తెలుగు భాషానురక్తి కలిగిన జాతీయోద్యమ కవి. ఆయనే అభినవ తిక్కన బిరుదాంకితుడు తుమ్మల సీతారామ మూర్తి. సౌమ్యశీలి, నిరాడంబరుడు, గాంధేయ వాది, తెలుగు రైతుబిడ్డ, ఆధునిక పద్య కవుల్లో అన్నింటా ముందుండి తెలుగు భాషానురక్తి కలిగిన మహాకవి. తుమ్మల సీతారామమూర్తి 1901 డిసెంబర్ 25 న గుంటూరు జిల్లా చెరుకుపల్లి మండలంలోని కావూరు గ్రామంలో జన్మించారు. ఆయన తల్లిదండ్రులు చెంచమాంబ, నారయ్య. తాడేపల్లి వెంకటప్పయ్య శాస్త్రి, దువ్వూరి వెంకటరమణ శాస్త్రి వంటి ప్రముఖుల వద్ద విద్యనభ్యసించారు. “మహాత్ముని ఆస్థానకవి” అని కట్టమంచి రామలింగారెడ్డితో పలికించుకున్న తుమ్మల, ఆత్మకథ, మహాత్మ కథ వంటి ఆదర్శ ప్రౌఢ కావ్యాలు, ఆత్మార్పణము, రాష్ట్ర గానము, ఉదయ గానము, పఱిగ పంట, పైర పంట, శబల, సమదర్శి, నా కథలు వంటి సామాజిక కవిత్వాన్ని అందించారు. 1930లో ఆయన ఆంధ్ర విశ్వ విద్యాలయము నుండి ప్రథమ శ్రేణిలో ఉభయ భాషా ప్రవీణ పట్టాను అందుకున్నారు. చదువు పూర్తయ్యాక, తన స్వగ్రామం కావూరు లోని తిలక్ జాతీయ పాఠశాలలో 1924 నుండి 1929 వరకు ఉపాధ్యాయుడిగా పని చేసారు. 1930 నుండి 1957 వరకు గుంటూరు జిల్లా బోర్డులోని దుగ్గిరాల, బాపట్ల, నిడుబ్రోలు, అప్పికట్ల ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయుడిగా పనిచేసారు. 1920 – 1930 మధ్య కాలంలో కాంగ్రెసులో చేరి స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్నారు. 1922లో జైలుశిక్ష అనుభవించారు. 1928లో తుమ్మల ‘ఆత్మార్పణము’ అనే కావ్యాన్ని రచించారు. 1938 లో ‘సోదరా లెమ్ము, నీ హక్కులందు కొమ్ము’ అని ఆంధ్ర రాష్ట్ర సిద్ధి కోసం తన ‘రాష్ట్ర గానం’ ద్వారా తెలుగువారిని వెన్ను తట్టి లేపారు. తెలుగువారి పూర్వవైభవాన్ని ఎలుగెత్తి చాటి ప్రత్యేక రాష్ట్ర సాధనకు ప్రబోధించారు. 1840లో ధర్మజ్యోతి అనే ఒక గాథను,1943లో ‘పఱిగి పంట’, 1950లో గాంధీజీ ఆత్మకథకు పద్య అనువాదమైన ‘ఆత్మకథ’ను రచించారు. 1953లో ‘ఉదయగానం’ గావించారు. 1955లో ‘శబిల’ అనే ఖండ కావ్యాల సంపుటిని వెలువ రించారు. తెలుగు సాహిత్య సరస్వతికి శిరోభూషణమైన ‘సంక్రాంతి తలపులు’ ఈ సంపుటి లోనివే. 1957లో ‘గీతాధర్మము’ పేరుతో భగవద్గీతకు అనువాదం చేశారు. భర్తృహరి నీతి శతకాన్ని ‘తెలుగు నీతి’ పేరుతో తెనిగించారు. ‘సర్వోదయ’ సిద్ధాంతాన్ని విశదీకరిస్తూ 1960లో ‘సర్వోదయ గానం’ చేశారు. 1963లో తన అభిరుచులు, ఆదర్శాలు, అనుభవాలు వెల్లడి చేస్తూ ‘నేను’ అనే కావ్యాన్ని,1964లో ‘పైరపంట’, 1967లో ఆదర్శ ప్రాయులైన కొందరు త్యాగ ధనుల గుణగణాలను విశదీకరిస్తూ ‘సమదర్శి’ రచించారు. తుమ్మల కవిత్వంలో గ్రామీణ జీవిత, ఆంధ్రత్వ, భారతీయత్వ, విశ్వమానవత్వ లక్షణాలుంటాయి. ఆయనది ప్రధానంగా ధర్మ ప్రబోధనాత్మక కవిత్వం. తాను తెలుగు వాడననే అభిమానం ఆయనలో ఎక్కువ. తెలుగు జాతి, తెలుగు భాష, తెలుగు చరిత్ర, తెలుగు సంస్కృతి అంటే పులకించి పోయేవారాయన. కాల్పనిక వాదం, మానవీయత, దేశభక్తి అనే మూడు ప్రధాన అంశాలతో సీతారామ మూర్తి గారు తన రచనలను కొనసాగించారు. అనేక నాటకాలు, హరికథలు కూడా రచించారు. తెలుగు భాషా సాహిత్యాలకు ఆయన చేసిన సేవలను కీర్తిస్తూ, ఘన సన్మానం చేసి ‘అభినవ తిక్కన’ అనే బిరుదును ఇస్తే, వినయ పూర్వకంగా, తాను తిక్కన అంత ఘనుణ్ణి కాదని, ‘తెలుగు భాషకు సేవకుడను’ అనే అర్థం వచ్చేలా ‘తెనుగు లెంక’ అని పేరు పెట్టుకున్న మహాకవి తుమ్మల సీతారామమూర్తి చౌదరి. రైతు జీవితానికి కావ్య గౌరవం కల్పించి, తెలుగు నుడికారానికి ప్రాణంపోసి, తెనుగు దనానికి నిర్వచనంగా నిలిచిన తుమ్మలను కొంగర జగ్గయ్య ‘కళా తపస్వి’గా సంభావించారు. ఒకనాడు వెండి తెర నాయకుడైన చిత్తూరు నాగయ్యకు తుమ్మల అభిమాన కవి. 1949 నిడుబ్రోలులో – గజారోహణము, గండ పెండేరము, కనకాభిషేకము, సువర్ణ కంకణము. 1960లో అఖిల భారత తెలుగు రచయితల మహాసభ సత్కారముబీ 1967లో ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ విశిష్ట సభ్యత్వ ప్రదానముబీ 1969లో కేంద్ర సాహిత్య అకాడమీ బహుమానముబీ 1969లో ఆంధ్ర విశ్వ విద్యాలయము “కళాప్రపూర్ణ” బిరుదుతో సత్కారముబీ 1984 మద్రాసులో శ్రీ ఎల్. వి. రామయ్య చారిటీస్ జాతీయకవి అవార్డుబీ 1985 లో నాగార్జున విశ్వ విద్యాలయం నాగార్జున విశ్వ విద్యాలయము “డాక్టర్ ఆఫ్ లెటర్స్” (డి.లిట్) బిరుదుతో సత్కారము పొందారు. నాటి యువ కవులను ఉద్దేశించి...వచనము గేయము ఆధారముగా చేసుకొని యువ కవులు వ్యవహారిక భాషలో కవిత్వము వ్రాయుచున్నారు. వీరిలో శ్రీశ్రీ వంటి సిద్ధహస్తులు కొందరున్నారు. భాషా మార్గము ఏదైనను రచయిత లోతుగా సాహిత్య కృషి చేసినపుడే పది కాలాల పాటు అది చరిత్రలో నిలుచును. మా తరం వారు చదివినంత గట్టిగా నేటి యువతరం కావ్య పఠనం చేయడం లేదు. పత్రికల నిండా ఏదో రాస్తున్నారు.’ అని తుమ్మల వ్యక్త పరిచిన అభిప్రాయం నేటికీ అక్షరాలా వాస్తవమని అనిపించక మానదు.

1990 మార్చి 21 న గుంటూరు జిల్లా బాపట్ల మండలంలోని అప్పికట్ల గ్రామాలో తుమ్మల సీతారామమూర్తి మరణించారు. ఇరవై నాలుగు వేల పద్యాలు వ్రాసినా, ఆయన సాహిత్యం నిరాదరణకు గురవడం శోచనీయం. విద్యార్థులకు పాఠ్యాంశంగా ఆయన రచనలు ఉండక పోవడం తెలుగు సాహిత్యాభిమానులకు బాధాకరం.

# అటవీ సంరక్షణ సామాజిక బాధ్యత

ప్రపంచ అటవీ దినోత్సవం ప్రతి సంవత్సరం మార్చి 21 న నిర్వహించ బడుతుంది. 2012 లో ఐక్యరాజ్య సమితి సర్వసభ్య సమావేశం ప్రకటించినప్పటి నుండి, ప్రపంచ దేశాలు అన్ని రకాల చెట్లు అడవుల ప్రాముఖ్యతపై అవగాహన పెంచడం లక్ష్యంగా పెట్టుకున్నాయి. 2012, నవంబరు 28న యునెస్కో వారిచే తీర్మానించబడిన ప్రపంచ అటవీ దినోత్సవం, 2013 మార్చి 21న తొలిసారిగా నిర్వహించ బడింది. మానవుల ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక మరియు పర్యావరణ అభివృద్ధికి అడవులు ఎంతో అవసరమని తెల్పడం ప్రపంచ అటవీ దినోత్సవ ముఖ్య ఉద్దేశ్యం. ప్రస్తుత, ముందు తరాల వారికి అడవుల ప్రాముఖ్యత, ప్రయోజనాలను తెలియ జేయడం కోసం ఈ దినోత్సవం రోజున వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తారు.మానవాళి మనుగడకు అడవులు సోపానాలు. మన జీవావరణ సంపదలు. ఇవి అనేక జీవరాసులకు ఆవాసాలు. పర్యావరణ సమతుల్యానికి పట్టు కొమ్మలు. నదీనదాలకు వర్షాధారాలు. అడవులు మూలికా ఔషధాలకు నిలయాలు. జీవకోటికి ప్రాణ వాయువును అందించడం లోనూ, భూమి కోతను నివారించి భూసారాన్ని పరిరక్షించడం లోనూ ఇవి కీలకపాత్ర పోషిస్తాయి. అందుకే వృక్షో రక్షిత రక్షితః అన్నారు. వృక్షాలను మనం రక్షిస్తే, అవి మనల్ని రక్షిస్తాయి.అడవులలో పలు రకాలు ఉన్నాయి...రిజర్వు అడవులు: ఇవి ప్రభుత్వం పరిరక్షణలో వుంటాయి. మానవుల, పశువుల సంచారానికి మరియు కలప కొరకు చెట్లును నరకడం ఈ అడవులలో నిషేధం. భారత దేశంలో ఈ అడవులు 40.1 మిలియన్ హెక్టార్లు అనగా 53% వరకు విస్తరించి వున్నాయి.రక్షిత అడవులు: ఇవి ప్రభుత్వం పరిరక్షణలో వున్నప్పటికీ మానవులు, పశువులు సంచారానికి అనుమతి వుంది. అయితే ఈ అడవులకు ఎటువంటి నష్టాన్ని కలుగ చేయకూడదు. భారత దేశంలో ఈ అడవులు 21.5 మిలియన్ హెక్టార్లు అనగా 29% వరకు విస్తరించి వున్నాయి.కేటాయించని అడవులు: ఇవి చెట్లు నరకడానికి, మరియు పశువుల సంచారానికి ఎటువంటి నియమ నిర్బంధాలు లేవు. భారత దేశంలో ఈ అడవులు 13.1 మిలియన్ హెక్టార్లు అనగా 18% మేరకు విస్తరించి వున్నాయి. అడవులు ప్రపంచంలో 4.057 మిలియన్ హెక్టార్ల భూభాగంలో విస్తరించి వున్నాయి. ప్రపంచ అటవీ విస్తీర్ణత లో భారత దేశంలో అటవీ విస్తీర్ణత 1.85% వుంది.



అంటే 2% కూడా లేదు. తలసరి అటవీ విస్తీర్ణత 0.05 హెక్టార్లు మాత్రమే వుంది.2003 ఇండియన్ సెట్ ఫారెస్టు రిపోర్టు ప్రకారం 69.79 మిలియన్ హెక్టార్ల అడవులు భారత దేశ భూభాగంలో విస్తరించి వున్నాయి. ఇది దేశ భౌగోళిక విస్తరణలో 21.23%గా వుంది. ఈ నివేదిక 2013 ప్రకారం అవిభక్త ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో 34.572 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో అడవులు విస్తరించి ఉన్నాయి. రాష్ట్ర భూభాగంలో 22.64% కలిగి వున్నాయి. దేశ అటవీ విస్తీర్ణత ప్రకారం ఆంధ్ర రాష్ట్రం 9వ స్థానాన్ని కలిగి వుంది.ఇక తెలంగాణ రాష్ట్రంలో 29.242 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో అడవులు విస్తరించి ఉండేవి. రాష్ట్ర భూభాగంలో 25.46% మేరకు విస్తరించి ఉండేవి. కానీ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత ఖమ్మం జిల్లాలోని 327 ముంపు గ్రామాలను ఆంధ్రప్రదేశ్‌లో కలపడం వల్ల రాష్ట్ర అడవుల విస్తీర్ణం 26,903.70 చ.కి.మీ.కు తగ్గింది. ఇది రాష్ట్ర వైశాల్యంలో 23.99 శాతం.దేశ అటవీ విస్తీర్ణతలో 4.22% వరకు విస్తరించి, తెలంగాణ 12వ స్థానాన్ని కలిగి వుంది. ఈ సర్వే ప్రకారం భారత దేశంలో అడవులు ఎక్కువగా వున్న రాష్ట్రలలో మధ్య ప్రదేశ్ మొదటి స్థానాన్ని రెండవ స్థానాన్ని అరుణాచల ప్రదేశ్ మూడవ స్థానాన్ని ఛత్తీస్ గడ్ రాష్ట్రాలు వరుస స్థానాల్లో వున్నాయి. అత్యధిక అడవులు కలిగిన కేంద్ర పాలిత ప్రాంతాల్లో మొదటి స్థానంలో నికోబార్ రెండవ స్థానంలో దాద్రా నగర్ హవేలి వున్నాయి. భారత దేశంలో అత్యధిక శాతం అడవులు కలిగిన రాష్ట్రాలు మిజోరం మొదటి స్థానంలో అరుణాచల ప్రదేశ్ రెండవ స్థానంలో వున్నాయి. దేశంలో అత్య అల్ప శాతం అడవులు కలిగిన రాష్ట్రలు వరుసగా హర్యానా మొదటి స్థానంలో పంజాబ్ రెండో స్థానంలో బీహార్ మూడో స్థానంలో వున్నాయి. అత్యఅల్ప శాతం అడవులు కలిగిన కేంద్ర పాలిత ప్రాంతాలు వరుసగా పుదుచ్చేరి మొదటి స్థానంలో ఢిల్లీ రెండవ స్థానంలో వున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా ఏటా లక్షా డబ్బై వేల ఎకరాల అడవులు అంతరిస్తున్నట్లు శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. చెట్లును నరికివేసి వాటి నుంచి వచ్చే కలపను ఇంధనంగా వాడటం, పశువుల పచ్చిక బయళ్ళగా మార్చడం, వంట చెరకు, గృహ నిర్మాణాలు, గృహోపకరణాలకు ఉపయో గించడం, పెరుగుతున్న ప్రపంచ జనాభా అవసరాలను తీర్చడానికి జనావాసాలుగా మార్చడం వంటి చర్యలను అటవీ నిర్మూలనకు కారణాలు. అలాగే అడవుల్లో సంభవిస్తున్న అగ్ని ప్రమాదాలతో విలువైన జాతుల అటవీ సంపదకు నష్టం వాటిల్లుతోంది. భారీ వృక్షాలు, అడవి జంతువులతో పాటు ఆయుర్వేద గుణాలున్న విలువైన మూలికా వృక్షాలు, మొక్కలకు చేటు కలుగుతోంది. సమస్త జీవకోటికి ప్రత్యక్షంగా, పరోక్షంగా అడవులే ఆధారం. అయితే, ప్రస్తుతం అంతరించి పోతున్న అడవులు జీవ వైవిధ్యానికి గొడ్డలి పెట్టుగా మారాయి. ఒకవైపు అక్రమార్కుల చేతిలో పడి అడవులు చిక్కిపోతుంటే, మరోవైపు మానవ తప్పిదాలు అటవీ సంపదకు చేటు చేస్తున్నాయి. వేసవిలో ఏటా అగ్ని ప్రమాదాలకు వృక్ష సంపద ఆహుతవుతోంది. పెరుగుతున్న జనాభా తమ అవ సరాలకు మించి అడవులను నరికివేస్తున్న వైనం.

దీంతో ఉష్ణోగ్రతలు పెరిగి జల, వాయు కాలుష్యాలు అధికమై సమస్త జీవరాసుల మనుగడకు ముప్పు వాటిల్లే ప్రమాదముంది. అటవీ నిర్మూలన జరిగిన ప్రదేశాల్లో భూమి కోతకు గురవుతుంది.

బంజరు భూమిగా రూపాంతరం చెందుతుంది. వైల్డ్ లైఫ్ యాక్ట్ ప్రకారం భూభాగంలో 33 శాతం అడవులు ఉండాలి. ప్రస్తుతం 24.12 శాతం మాత్రమే ఉన్నాయి. ఇది చాలా విచారించదగ్గ విషయం. అంతరించి పోతున్న వాటిని కాపాడు కోవలసిన బాధ్యత అందరిపైనా ఉంది. అడవుల రక్షణ బాధ్యత అందరిది.

# పెట్టుబడిదారీ వ్యవస్థకు ట్రంప్ చికిత్స!


ట్రంప్ రెండవసారి అమెరికా అధ్యక్ష పదవి చేపట్టాక, అమెరికా నాయకత్వంలో నడుస్తున్న ప్రపంచ పెట్టుబడిదారీ విధానం మొత్తంగా వ్యవస్థీకృత మార్పులకు లోనవుతోంది. దీనికి చోదకశక్తి అంతర్గతంగానే పని చేస్తోంది. గతంలో రెండవ ప్రపంచ యుద్ధానికి ముందు ‘మహా మాంద్యం’ ఏర్పడినప్పుడు ‘న్యూ డీల్’ను ప్రకటించారు. 1970 దశకంలో ద్రవ్యోల్బణం అదుపు తప్పినప్పుడు నయా ఉదారవాద విధానాలను ప్రకటించారు. ఇప్పుడు మళ్ళీ పెట్టుబడిదారీ వ్యవస్థ మరో తీవ్ర సంక్షోభంలో చిక్కుకుంది. దానికి స్పందనగా ట్రంప్ నాయకత్వంలో ఈ మార్పులు జరుగుతున్నాయి. ఆర్థిక రంగంలో ట్రంప్ ప్రభుత్వం ప్రధానంగా ప్రవేశ పెడుతున్న మార్పులు అయిదు విధాలుగా ఉన్నాయి. వాటిలో మొదటిది: అధిక దిగుమతి సుంకాలను విధించడం. బైటకు తరలిపోయిన పరిశ్రమలను తిరిగి అమెరికాకు రప్పించడానికి, తద్వారా అక్కడ ఉత్పత్తిని, ఉపాధి అవకాశాలను పెంచడానికి ఈ సుంకాల పెంపు చేపట్టినట్టు చెప్పి సమర్థించుకుంటున్నారు. దేశ భద్రతకు సైతం ఈ విధానం అవసరం అంటూ చెప్తున్నారు. అయితే, ఈ విషయంలో లోతుగా, ముందుచూపుతో వ్యవహరిస్తున్నట్టు తోచదు. ఈ విధానం అమలు విషయంలో ఊగిసలాటలు కూడా కనిపిస్తున్నాయి. చౌకగా కార్మికుల శ్రమను కొల్లగొట్టగల దేశాలకు తరలిపోయిన సరుకుల ఉత్పత్తి పరిశ్రమలు ఏ మేరకు వెనక్కి వస్తాయన్నది ప్రశ్నార్థకమే. కెనడా, మెక్సికో దేశాలపై 25 శాతం దిగుమతి సుంకం విధించారు. తర్వాత వెనక్కి తగ్గారు. కొంత జాగు తర్వాత తిరిగి సుంకం విధించారు. చైనాపై విధించే సుంకాలను పెంచారు. కార్లు, ఇతర వాహనాలు, స్టీల్, అల్యూమినియం తదితర ఉత్పత్తుల మీద కూడా సుంకాలను ప్రకటించారు. దానికి ప్రతిస్పందనగా అమెరికాతో వాణిజ్యం నడిపే దేశాలు కూడా అమెరికా దిగుమతులపై సుంకాలను ప్రకటిస్తున్నాయి.రెండవ మార్పు: బడా పెట్టుబడిదారులు అమెరికన్ రాజ్య వ్యవస్థను స్వాధీనం చేసుకోవడం. ఇంతవరకూ సెక్యూరిటీస్ ఎక్స్‌ఛేంజ్ కమిషన్, ఫెడరల్ ట్రేడ్ కమిషన్ వంటి నియంత్రణ సంస్థలు స్వతంత్ర సంస్థలుగా ఉన్నాయి. గతంలో ఎస్ఇసి క్రిప్టో కరెన్సీ లావాదేవీలకు పగ్గాలు వేయడానికి ప్రయత్నించింది. అమెజాన్, మెటా వంటి గుత్త సోషల్ మీడియా ప్లాట్‌ఫాం సంస్థలను అదుపు చేయడానికి ఎఫ్‌టిసి ప్రయత్నించింది. ఇప్పుడు ఈ స్వతంత్ర సంస్థలను అమెరికన్ అధ్యక్షుడి శ్వేతసౌధానికి జవాబుదారీగా వ్యవహరించేలా వాటి ప్రతిపత్తిని మార్చివేశారు. బడా పెట్టుబడులు యథేచ్ఛగా దోచుకోడానికి అవకాశం కల్పించారు. ఇప్పుడు అమెరికా లోని అగ్రశ్రేణి బడా వ్యాపారవేత్తలందరూ ట్రంప్ వెనుక మోహరించి వున్నారు. ట్రంప్ కు చెందిన విధాన రూపకల్పన వేదికలలో సైతం వారు ప్రవేశించారు. వారందరిలోకీ చెప్పుకోదగ్గవాడు ఎలన్ మస్క్. ఎక్స్ అనే సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌కు, టెస్లా అనే వాహన తయారీ సంస్థకు అతడు అధిపతి. ఇప్పుడు ఎలన్ మస్క్ నేతృత్వంలో ప్రభుత్వ సామర్థ్యాన్ని పెంచే ఒక శాఖను ఏర్పరిచాడు ట్రంప్. అదే డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫిషియన్సీ. దీనికి 50 బిలియన్ల డాలర్లు కేటాయించాడు. ప్రభుత్వానికి చెందిన ఏ విభాగమైనా ఈ డిఒజిఇ కి జవాబుదారీగా ఉండాలని ఆదేశించారు. మూడవ మార్పు: అమెరికాతో వాణిజ్య పరంగా, దౌత్య పరంగా సంబంధాలు నెరపే దేశాల నుండి తమకు కావలసిన వ్యూహాత్మకమైన భూభాగాలను, సహజ వనరులను, ఇతర సదుపాయాలను ట్రంప్ డిమాండ్ చేస్తున్నాడు. గ్రీన్‌లాండ్, పనామా కాలువ, గాజా భూభాగం తనకే స్వంతం అని ప్రకటించాడు. అదే సమయంలో ఆ యా మిత్ర దేశాలకు అందిస్తూ వచ్చిన ఆర్థిక, సైనిక సహాయాలకు కోత పెడుతున్నాడు. నాలుగవది: ఉక్రెయిన్‌లో గాని, గ్రీన్‌లాండ్‌లో గాని, ఇతర దేశాలలో గాని ఉన్న కీలకమైన ఖనిజాలను తమకు కేటాయించాలని బెదిరిస్తున్నాడు. తర్వాత అవసరమైతే బలప్రయోగానికి కూడా వెనుకాడేలా లేడు. ఐదవది: ప్రపంచ రాజకీయాలన్నీ అమెరికా చుట్టూ మాత్రమే తిరిగేలా చేయడానికి రష్యాతో మళ్ళీ సత్సంబంధాలను నెలకొల్పుకోడానికి ప్రయత్నిస్తున్నాడు. యూరప్ దేశాలతో సంబంధాలలో కూడా మార్పులు చేస్తున్నాడు. రష్యాతో సంబంధాలు మెరుగుపడితే ఆ దేశంలో లభించే ముడిసరుకులను అమెరికా పొందగలుగుతుంది. అమెరికాతో యూరప్ దేశాలు వ్యాపార సంబంధాలను కొనసాగిస్తాయి కాని వాటి రక్షణ బాధ్యత నుండి అమెరికా వైదొలగుతుంది. ట్రంప్‌ను పెద్ద మెజారిటీతో గెలిపించిన శ్వేత కార్మికులకు ఏదో ఒరగబోతోందన్న అభిప్రాయాన్ని కలిగించడం. అమెరికాకు మళ్ళీ పరిశ్రమలు తిరిగి వచ్చేస్తే వాటిలో తమకు ఉపాధి లభిస్తుందన్న ఆశలు వారిలో కలిగించడం. ముఖ్యంగా అత్యంత సంపన్నుల ప్రయోజనాల కన్నా ట్రంప్ తమ ప్రయోజనాలను కాపాడేందుకే అధిక ప్రాధాన్యతనిస్తున్నాడన్న భ్రమలు వారిలో కలిగించడం ఒక లక్ష్యం. బలహీనపడుతున్న అమెరికన్ ఆధిపత్యాన్ని తిరిగి బలంగా నెలకొల్పాలన్నది మరో లక్ష్యం. 1970 దశకం తర్వాత అమలు చేసిన నయా ఉదారవాద విధానాలు ద్రవ్య పెట్టుబడిపై నియంత్రణలను ఎత్తివేశాయి. రుణాల మీద ఆధారపడిన ఆర్థిక వృద్ధి వైపు అడుగులు పడ్డాయి. ఈ క్రమంలో ప్రభుత్వం పాత్ర మారిపోయింది. అట్టడుగు తరగతుల సంక్షేమం కోసం నిలబడి, అందుకోసం సంపన్నులను నియంత్రించే విధానాలకు బదులు దానికి రివర్స్‌గా దిగువ తరగతుల నుండి సంపదను కొల్లగొట్టి సంపన్నుల వద్ద సంపద మరింతగా కేంద్రీకరించబడేలా ప్రభుత్వం వ్యవహరిస్తోంది. అయితే ఈ విధంగా సంపదను నిరవధికంగా కేంద్రీకరించడం అనేది ఎంతోకాలం పాటు కొనసాగించడం అసాధ్యం. ఈ విషయాన్ని 2008లో బద్దలైన సంక్షోభం తేటతెల్లం చేసింది. 1960 దశకం నుండి రెండు దశాబ్దాలపాటు పెట్టుబడిదారీ విధానానికి ‘స్వర్ణయుగం’ నడిచింది. ఆర్థిక వృద్ధి, కనీస స్థాయిలో ద్రవ్యోల్బణం, ఎక్కువ మోతాదులో ఉపాధి కల్పన, సంక్షేమ రాజ్యం అన్నీ ఆ కాలంలో సాధ్యపడ్డాయి. కాని నయా ఉదారవాద విధానాల అమలు ఫలితంగా అవన్నీ అదృశ్యమయ్యాయి. అందుచేత పెట్టుబడిదారీ దోపిడీ విధానాలను సమర్థించుకోవడం రాజకీయంగా పాత పద్ధతులలో సాధ్యపడదం లేదు.

‘అమెరికాను మళ్ళీ గొప్ప దేశంగా చేద్దాం’ (మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్) అని ట్రంప్ ఇచ్చిన నినాదం అతగాడి వెనుక ఉన్న అమెరికన్ పెట్టుబడిదారుల కోసమే. తక్కిన వారందరినీ, తన మిత్ర దేశాలతో సహా బలిచేసి, అమెరికాను మాత్రమే అగ్రస్థానంలో నిలపాలన్నదే ఆ నినాదం లక్ష్యం. అందుకోసమే ట్రంప్, అతని సహచరులు అమెరికన్ రాజ్య వ్యవస్థను చేజిక్కించుకుని అతి కొద్దిగా ఉన్న ‘సూపర్ రిచ’కి మరింత సంపదను కట్టబెట్టే పనిలో ఉన్నారు. తక్కిన ప్రపంచం నుండి వనరులను చేజిక్కించుకుని తద్వారా అతి కొద్దిమంది సూపర్ రిచ్ వద్ద సంపదలను మరింతగా కేంద్రీకరించి, ఈ క్రమంలో అమెరికాలో ఉన్న కార్మిక వర్గానికి కొంత వరకూ విదిలిస్తే సరిపోతుందన్న దృష్టితో వాళ్ళు ఉన్నారు. ఈ పరిస్థితి సామ్రాజ్యవాద దేశాల మధ్య నెలకొన్న సంబంధాలలో మార్పుకు దారితీస్తోంది. గతంలో రెండు సార్లు ప్రపంచయుద్ధాలకు దారి తీసిన విధంగా సామ్రాజ్యవాదుల మధ్య వైరుధ్యాలు ఈ సారి పరిణమించకపోవచ్చు. ఆ సామ్రాజ్యవాద దేశాలలో ఒక ఆధిపత్య దేశం తన స్వార్థం కోసం తక్కిన సామ్రాజ్యవాద మిత్రులను సైతం తొక్కిపెట్టడానికి తయారౌతోంది. అందుకోసం తన మాజీ శత్రువులతో సైతం చేతులు కలిపేందుకు సిద్ధపడుతోంది. తక్కిన ప్రపంచాన్ని మొత్తంగా తన వలసగా మార్చుకుని తద్వారా తన దేశంలో పెట్టుబడిదారీ వ్యవస్థను కాపాడుకోవచ్చునని అమెరికన్ పాలకవర్గం భావిస్తున్నట్టు ఉంది. కాని ఇది ఒక వికృతమైన ప్రయత్నంగా తయారై విఫలం కాక తప్పదు. ఒక దురహంకారి నాయకత్వంలో అమెరికన్ శత కోటీశ్వరుల గుంపు సాగించే దోపిడీ ఎల్లకాలమూ కొనసాగిపోతుందనే భ్రమలో ఉన్నారు. కాని ఈ భ్రమ పటాపంచలు కాక తప్పదు.

# కవిత్వంతో కరచాలనం




కవిత్వం అనేది మనిషి ఆలోచనలకు, భావాలకు, అనుభూతులకు ప్రతిబింబం. ప్రపంచంలోని వివిధ సంస్కృతులు, భాషలు, సమాజాలు అన్నింటినీ కలిపి ఒక సమిష్టి సాహిత్యాన్ని నిర్మిస్తే అది కవిత్వమవుతుంది. కవిత్వం జ్ఞానానికి, ప్రేమకు, తాత్వికతకు, పోరాటాలకు వేదిక. ప్రపంచంలో రకరకాల దినోత్సవాలు ఉన్నట్లుగానే కవిత్వానికీ ఒక దినోత్సవం ఉంది. ప్రపంచ వ్యాప్తంగా మార్చి 21 న దీన్ని జరుపుకుంటారు. ఈ దినోత్సవంయొక్క అసలు ఉద్దేశ్యం కవిత్వమనే కళను ప్రోత్సహించటం, కవిత్వం పట్ల మక్కువను పెంచడం, దాన్ని ప్రాచుర్యం లోకి తేవడం, ప్రపంచంలోని వివిధ భాషా, సంస్కృతుల్లోని కవిత్వ ప్రక్రియల్ని, సంప్రదాయాల్ని గుర్తించి, విస్తృతంగా ప్రాచుర్యంలోకి తేవడం. కవిత్వ సాహిత్యం గొప్పదనాన్ని, ప్రాముఖ్యతను ప్రపంచానికి చాటి చెప్పడం కోసం1999లో యునెస్కో ప్రపంచ కవితా దినోత్సవాన్ని ప్రకటించింది. అప్పటి నుంచి ఇది ప్రతి సంవత్సరం ప్రపంచవ్యాప్తంగా ఒక ముఖ్యమైన కార్యక్రమంగా జరుపుకుంటున్నారు.కవిత్వం మనసు లోతుల్లోని భావాలను, ఆలోచనలను, అనుభూతులను ప్రామాణికమైన, అనుభవపూర్వకమైన శైలిలో వ్యక్తం చేసే ఒక గొప్ప అపురూపమైన కళ. కవిత్వం ప్రకృతి, ప్రేమ, విరహం, దుఖం, నైతికత, సామాజికత, రాజకీయ, ఆర్థిక, ఇతర అనేక అంశాలను స్పృశిస్తూ, వివరిస్తూ ప్రపంచంలోని విభిన్నతలను అంగీకరించి, అవి మన జీవితంపై ఎలా ప్రభావం చూపిస్తాయో సంక్షిప్త పదాల్లో సమగ్రంగా తెలియజేస్తుంది. కవిత్వం మనకో రసవత్తర దృష్టిని కలిగిస్తుంది. కవులు మన మనస్సుల్లోకి ప్రవేశించి మన ఊహలు, ఆశలు, కలల ద్వారా ప్రయాణిస్తూ, అనిర్వచనీయమైన అద్భుతలోకంలో విహరింపజేస్తారు. వయోభేధ, సమయ, కాల, స్థానాలను మించిన ఒక సౌందర్యమైన అనుభూతిని పంచుతారు. అందులో భావుకత, ఉద్వేగం, సృజనాత్మకత, జ్ఞానం లాంటి మిశ్రమాలు మిళితం కావడంతో కవిత్వంతో కరచాలనం చేసిన ప్రతిసారీ మనం అనేక కోణాల్లో వినూత్న అనుభూతులను ఆస్వాదిస్తాం, అనుభూతిస్తాం.కవిత్వానికి భాషాబేధం లేదు. ప్రపంచంలోని అన్ని భాషల్లోనూ, అనేక ప్రక్రియల్లో కవిత్వం రాయబడుతోంది. ప్రతి భాషకు, ప్రతి సంస్కృతికి కవిత్వ పద్ధతులు, భావనలు, అభిప్రాయాలు, ప్రయోజనాలు మారిపోతాయి. ఒక కవి తన భాషలో, తన సంస్కృతిలో మాత్రమే కాకుండా పరాయి భాషలోకూడా తన భావాలను, అనుభూతిని వ్యక్తం చేయగలడు. కాని మాతృభాషలో మాత్రం కవిత్వాన్ని మరింతగా రంజింపచేయగలడు. ప్రపంచ కవితా దినోత్సవం విశ్వవ్యాప్తంగా వున్న కవితా సంపదను గుర్తించి, దాన్ని ప్రేరణగా తీసుకోడానికి అత్యుత్తమంగా తోడ్పడుతుంది.కవిత్వం ప్రజలలో మానవతా విలువలను ప్రోదిచేస్తుంది. కవిత్వం ద్వారా, మానవ హక్కులు, సమానత్వం, ప్రేమ, శాంతి, సోదరభావం, సహానుభూతి వంటి అంశాలను కవులు ప్రపంచం ముందుకు తీసుకువస్తారు. సాంఘిక, రాజకీయ, ఆర్థిక సవాళ్ళను అధిగమించగల ప్రభావశీల ఆలోచనా విధానాన్ని మంచి కవిత్వం అందించగలుగుతుంది. కవిత్వం సమ సమాజాన్ని కాంక్షిస్తుంది. పీడన, అణచివేత, అసమానత్వాలను నిరసిస్తుంది. కవిత్వం ద్వారా సమాజం ఎదుర్కొంటున్న కష్టాలు, సంతోషాలు, సవాళ్ళను గమనించవచ్చు. ఇది ప్రగతికి దారితీస్తుంది, అర్థవంతమైన సంభాషణలకు మూలమవుతుంది. శీల సంరక్షణకు, వ్యక్తిత్వ ఆవిష్కరణకు దోహదం చేస్తుంది. కనుక పిల్లలకు, యువతకు విద్యార్థి దశనుండే మంచి కవిత్వం పట్ల ఆసక్తిని కలగజేస్తే భవిష్యత్తులో వారు మంచి భావుకులుగా, కార్యశీలురుగా తయారయ్యే అవకాశాలు మెరుగుపడతాయి. సమాజం పట్ల మంచి అవగాహన ఏర్పడుతుంది. మానవ స్వభావం, ప్రపంచ పోకడల పట్ల దృష్టికోణం విస్తృతమవుతుంది. అందుకని సమాజాన్ని మంచి మార్పు దిశగా మార్గదర్శకం చేసే కవిత్వానికి గౌరవాన్ని అందించే ఒక చక్కని కార్యక్రమంగా మనమీ రోజును జరుపుకోవాలి. కవిత్వాన్ని ఒక సామూహిక భావనగా చూస్తూ ప్రపంచవ్యాప్తంగా ఉన్న కవులను ఒకచోట చేర్చడం, వారి రచనలకు ప్రాధాన్యతనివ్వడం, భిన్న ప్రక్రియల్లో ఉన్న కవిత్వాన్ని ప్రజలకు పరిచయం చేయడం చేయాలి.


యండి. ఉస్మాన్ ఖాన్

ఈ దినోత్సవం ద్వారా, కవులు వారి ఆలోచనలను, అనుభవాలను, రచనలను ప్రపంచంతో పంచుకోడానికి, పరస్పర పరిచయాలకు ఇదొక మంచి అవకాశంగా కూడా ఉపకరిస్తుంది. మంరెందుకు ఆలస్యం కరచాలనమేకాదు, కవిత్వాన్ని ఆబగా ఆలింగనం చేసుకోడానికి సిద్ధంకండి.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరండి...!



హైదరాబాద్,మార్చి20(వుదయం ప్రతినిధి): తండ్రి లాంటి రక్షణ తల్లి లాంటి శిక్షణ కలిగిన ఏకైక కళాశాలప్రభుత్వ డిగ్రీకళాశాల అడ్మిషన్స్ కోసం గురువారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల రామన్నపేట కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రహత్ ఖానం ఆధ్వర్యంలో కళాశాల అధ్యాపకులు కరపత్రాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక రామన్నపేట పట్టణంలోని ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాల వద్ద ప్రభుత్వ కళాశాలలోని సౌకర్యాలను వివరిస్తూ విద్యార్థులకు కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు డి.కిషన్, డాక్టర్.ఆర్.శ్రీనివాస్ , డాక్టర్.బ్రహ్మం ,అమర్ ,టి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి నూతన భవన నిర్మాణ పనుల పరిశీలన



నారాయణపేట టౌన్ మార్చ్ 20( వుదయం ప్రతినిధి) నారాయణపేట జిల్లా కేంద్రంలో నిర్మాణం పూర్తి అవుతున్న భారతీయ జనతా పార్టీ జిల్లా కార్యాలయాన్ని ఆ పార్టీ నాయకులు గురువారం పరిశీలించారు. కార్యాలయాన్ని పరిశీలించిన వారిలో జిల్లా బీజేపీ అధ్యక్షులు సత్య యాదవ్, పట్టణ అధ్యక్షుడు పోషల్ వినోద్ ఉన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో బిజెపికి పుట్టినిల్లుగా నారాయణపేట విరజిల్లుతుందని రాబోయే రోజులలో మరింత బలోపేతం చేయడానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని వారు పిలుపునిచ్చారు. అంతేకాక గడిచిన ఎంపీ ఎన్నికల్లో నారాయణపేట అత్యధిక మెజారిటీ ఇచ్చిందని వారు గుర్తు చేశారు. బిజెపికి పట్టుకొమ్మ అయినా నారాయణ పేటను రాబోయే రోజులలో మరింత బలోపేతం చేయడానికి ప్రణాళికలు తయారు చేస్తున్నామని వారు అన్నారు.

ఈ కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షులు సాయిబన్న, బీజేవైఎం జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ కమలాపూర్ ,దళిత మోర్చా జిల్లా అధ్యక్షులు, మాజీ కో ఆప్షన్ సభ్యులు కృష్ణ, బీజేవైఎం పట్టణ అధ్యక్షుడు జాజాపూర్ మణిశంకర్, కార్యదర్శులు మోహన్, చేతన్ లతోపాటు తదితరులు.

# రాహుల్ గాంధీ,రేవంత్ రెడ్డి లకు సహచర మంత్రి వర్గానికి ప్రత్యేక ధన్యవాదాలు.

### దేశంలో ఏ రాష్ట్రం చేపట్టని కులగణన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేసి చూపెట్టింది . మండల కాంగ్రెస్ పార్టీ తరుపున సంబరాలు నిర్వహించి హర్షం వ్యక్తం. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు. కోటగిరి సతీష్ గౌడ్.



భూపాలపల్లి మార్చి20(వుదయం ప్రతినిధి): జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండల కేంద్రంలో రాహుల్ గాంధీ,రేవంత్ రెడ్డి,గండ్ర సత్యనారాయణ రావు చిత్రపటాలకు పాలభిషేకం చేశారు. అనంతరం ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాహుల్ గాంధీ ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం దేశంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే దేశవ్యాప్తంగా కులగనన చేస్తానని హామీ ఇచ్చి దేశంలో అధికారం రానప్పటికీ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి రాష్ట్ర ప్రజలు అధికారాన్ని ఇచ్చారని తెలంగాణ రాష్ట్రంలో కులగణన ప్రారంభించి దేశంలోనే ఆదర్శమైన రాష్ట్రంగా తెలంగాణ రాష్ట్రాన్ని ముందు ఉంచాలని ఇచ్చిన మాటకు కట్టుబడి,బీసీ రిజర్వేషన్ 21 శాతం నుండి 42 పెంచటం.మరియు ఎస్సీ వర్గీకరణకు అసెంబ్లీ లో తీర్మానం చేసిన సందర్భంగా రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం కు మండల కాంగ్రెస్ పార్టీ తరుపున ధన్యవాదాలు తెలుపుతూ నాయకుల చిత్రపటాలకు పాలాభిషేకం చేసి బానసంచా కాల్చి సంబరాలు నిర్వహించినట్లు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కోటగిరి సతీష్ గౌడ్ .అన్నారు. మరియు,తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత గత ప్రభుత్వం చెయ్యలేని పనులు కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డ తర్వాత అన్ని హామీలను నెరవేర్చుతూ ముందుకు సాగుతున్న ప్రభుత్వం మన ప్రజా ప్రభుత్వం అని అన్నారు.ఇది బడుగు బలహీనవర్గాల పేదల ప్రభుత్వం అని నిరూపితమైంది. అదేవిధంగా ప్రభుత్వం చేపట్టే ప్రతి ఒక్క పథకాన్ని చివర ప్రజలకు అందే వరకు అందరూ కృషి చేయాలని రాజీవ్ యువ వికాసం పథకాన్ని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.కాంగ్రెస్ ప్రభుత్వం మొదటి నుంచి దళితులకు అండగా ఉంటుందని మరోసారి రుజువైందని తెలిపారు.అప్పట్లో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ను రాజ్యాంగ సృష్టికర్తగా ఎన్నుకున్నది కూడా కాంగ్రెస్ ప్రభుత్వమే అని గుర్తు చేశారు.అదేవిధంగా ఇప్పుడున్న దళితుడు మల్లికార్జున్ ఖర్గే ను ఏఐసీసీ అధ్యక్షున్ని చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనని ఆయన అన్నారు.గత ప్రభుత్వం చేసిన తప్పిదాల వల్ల కొన్ని పథకాలు ఆలస్యం అయినా ప్రభుత్వం అమలు చేసి తీరుతుందని ఇచ్చిన మాటకి కట్టుబడి ఉండేదే కాంగ్రెస్ పార్టీ అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి వైనాల రవీందర్ తిప్పిరెడ్డి కృష్ణారెడ్డి.యువజన కాంగ్రెస్ మాజీ జిల్లా అధ్యక్షుడు బండ శ్రీకాంత్.వివర్స్ సెల్ జిల్లా అధ్యక్షులు ఆదేపు సంపత్ మండల ఉపాధ్యక్షులు మాదం కొమురయ్య.ప్రధాన కార్యదర్శులు దాసారపు సదానందం.బండి రవీందర్.మోతే రాజమౌళి.జిల్లా నాయకులు కత్తి సంపత్.తోట గట్టయ్య.దోంతుల శ్రీనివాస్. టేకుమట్ల టౌన్ అధ్యక్షులు పెరుమాండ్ల క్రాంతి. బో%శీ%డ్ల మహేష్.మహిళా కాంగ్రెస్ మండల అధ్యక్షురాలు కుమ్మరి శ్రీదేవి.మండల నాయకులు సంగీ రవి,పొలాల సరోత్తం రెడ్డి కోయల చిరంజీవి. వంగ నరేష్ కోరే చందు. పోలు దాసరి రాజేశం,నామని రాజేందర్ తిప్పనవేణ బాలయ్య,దాసరి అనిల్,అంబాల ఆనందం మారపెల్లి సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## సీఎం రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేసిన మండల కాంగ్రెస్ నాయకులు



ఊర్కొండ మార్చి20(వుదయం ప్రతినిధి): ఉర్కొండ: ఊరుకొండ మండల కేంద్రంలో మండల కాంగ్రెస్ నాయకులు , యూత్ కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో రాష్ట్ర అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణ బిల్లును, బీసీ వర్గాలకు 42 శాతం బిల్లును అసెంబ్లీలో ఆమోదించిన సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు ఎనుముల రేవంత్ రెడ్డి , జడ్చర్ల శాసనసభ్యులు జనంపల్లి అనిరుద్ రెడ్డి ధన్యవాదాలు తెలియజేస్తూ ఊరుకొండ మండల కేంద్రంలో పాలాభిషేకం నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో ఉరుకొండ మండలం కాంగ్రెస్ సీనియర్ నాయకులు, యువజన విభాగం నాయకులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మౌనికను సన్మానించిన బీసీ సంఘం నాయకులు



నల్లబెల్లి, మార్చి 20 (వూదయం ప్రతినిధి)
టిఎస్పిఎస్సి బుధవారం విడుదల చేసిన ఐసీడీఎస్‌లో సూపర్ వైజర్ ఉద్యోగ ఫలితాలలో భద్రాద్రి జోన్ లో ఓపెన్ కేటగిరిలో 9 వ ర్యాంక్ సాధించిన మండల కేంద్రానికి చెందిన ఉడుత మౌనికను బీసీ నాయకులు గురువారం సన్మానించారు. మండల కేంద్రానికి చెందిన ఉడుత రాజన్న, రమణి దంపతుల రెండవ కూతురు మౌనికను తల్లిదండ్రులు ఎంతో కష్టపడి చదివించగా తను ప్రభుత్వ ఉద్యోగం సాధించడంతో బీసీ హక్కుల సాధన సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి చింతకింది కుమారస్వామి,ఆధ్వర్యంలో బీసి నేతలు మౌనిక తో పాటు తల్లితండ్రులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో భోగ భద్రయ్య, డాక్టర్ దేవులపల్లి శ్రీనివాస్, సామల వీరన్న, శ్రీహరి, కడియాల క్రాంతి, వేముల రాజు, సామల లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# బీసీ రిజర్వేషన్ బిల్లు ఆమోదంపై బీసీ సంఘాల సంబురాలు



జయశంకర్ భూపాలపల్లి మార్చి 20(వుదయం ప్రతినిధి) బీసీ రిజర్వేషన్ బిల్లు ఆమోదంపై బీసీ సంఘాల నాయకులు సంబురాలు నిర్వహిస్తూ బీసీ కులాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు మహాదేవపూర్ మండల కేంద్రంలో కూరగాయల మార్కెట్ ఆవరణలోని మహాత్మా జ్యోతి రావు పూలే విగ్రహం వద్ద బీసీ కులాల ఐక్య వేదిక అధ్యక్షులు సముద్రాల తిరుపతి ఆధ్వర్యంలో బీసీ రిజర్వేషన్ బిల్లు ఆమోదాన్ని హర్షిస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం కార్యక్రమాన్ని నిర్వహించారు.కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు అక్బర్ ఖాన్ ఈ కార్యక్రమానికి అధితిగా హాజరై మహనీయుని విగ్రహానికి పూల మాల వేసి ఘన నివాళులు అర్పించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు బీసీ రిజర్వేషన్ బిల్లు 42% మరియు ఎస్సీ వర్గీకరణ బిల్లు ఆమోదించిన రేవంత్ రెడ్డిని,తెలంగాణ ప్రభుత్వాన్ని కృతజ్ఞత పూర్వకంగా అభినందిస్తున్నామని సముద్రాల తిరుపతి అన్నారు. బీసీ కులాల ఐక్య వేదిక రాష్ట్ర నాయకులు ఆర్ రామకృష్ణయ్య,పాలురి రామకృష్ణయ్య నాయకత్వంలో బీసీ రిజర్వేషన్ బిల్లు సాధించుకోవడం చాలా సంతోషంగా ఉందని అన్నారు.ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ఐటీ పరిశ్రమలు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు కి,బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తో పాటు తెలంగాణ మంత్రిమండలికి,వివిధరాజకీయ పార్టీల నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో బీసీ కుల సంఘాల నాయకులు బింబిరి దేవరావు, సట్ల మురళీ, గడ్డం స్వామి,తిరుపతి, డా ఆబీబ్, తడకల జగదీష్,రామస్వామి, కేదారి ప్రవీణ్ కుమార్,జాగృతి మహేష్, మైబూబ్ ఖాన్ మరియు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## అదనపు ఇంటి పన్ను సమస్యను పరిష్కరించాలి...

### : మాజీ కార్పొరేటర్ కోలన్ వీరేందర్ రెడ్డి



కుత్బుల్లాపూర్, మార్చి 20,(వుదయం ప్రతినిధి ),నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ 18వ డివిజన్ కాలనీలో ప్రజలకు అదనపు ఇంటి పన్ను రావడం వల్ల మధ్యతరగతి కుటుంబాలు ఆ భారాన్ని కట్టలేక పోతున్నామని కాలనీ వాసులు డివిజన్ మాజీ కార్పొరేటర్ కోలన్ వీరేందర్ రెడ్డికి ఆ సమస్యను వివరించగా సమస్యపై వెంటనే స్పందించి కాలనీ ప్రజలతో కలిసి ఎన్ఎంసి కమిషనర్ యాకుబ్ అలీని కలిసి సమస్యను పరిష్కరించాలని కోరుతూ వినతి పత్రాన్ని అందజేశారు. అందుకు సానుకూలంగా స్పందించిన కమిషనర్ మాట్లాడుతూ అదనపు ఇంటి పన్ను సమస్య పై ఇదివరకే కలెక్టర్ తో చర్చించామని వచ్చే నెల ఏప్రిల్ లోపు ఈ సమస్యను పరిష్కరిస్తామని మాజీ కార్పొరేటర్ కోలన్ వీరేందర్ రెడ్డికి కాలనీ ప్రజలకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎంసి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కోలన్ రాజశేఖర్ రెడ్డి, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## పదవ తరగతి పరీక్షలకు రంగం సిద్ధం

### పరీక్షా కేంద్రల వద్ద 144, 163 బిఎన్ఎస్ఎస్. ఎస్ ఐ వి గోవర్ధన్



నల్లబెల్లి,మార్చి 20 (వుదయం ప్రతినిధి)పదవ తరగతి పరీక్షా కేంద్రాలలో అన్ని ఏర్పాట్లను సిద్ధం చేసినట్లు నల్లబెల్లి మండల విద్యాధికారి అనురాధ పేర్కొన్నారు.ఈ సందర్భంగా గురువారంఆమె మాట్లాడుతూ.. మండలంలోని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల్లోని విద్యను అభ్యసిస్తున్న 354 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు హాజరైతరన్నారు. తెలుగు మీడియంలో ఐదుగురు విద్యార్థులు, ఇంగ్లీష్ మీడియం లో 349 మంది విద్యార్థుల్లో 180 మంది బాలురు169 మంది బాలికలు మొత్తంగా 354 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నట్లు ఆమె తెలిపారు.జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 120 మంది విద్యార్థులకు కారుణ్య జ్యోతి ఇంగ్లీష్ మీడియం హై స్కూల్లో 240 మంది పరీక్షలకు హాజరు కానున్నారన్నారు.విద్యార్థులు ఎలాంటి ఒత్తిళ్లకు భయాందోళనలకు గురికాకుండా స్వేచ్ఛగా పరీక్షల్లో పాల్గొని ఉత్తీర్ణత సాధించాలని ఆమె విద్యార్థులకు సూచించారు..
లిపరీక్షా కేంద్రాల వద్ద 144, & 163 బి ఎన్ ఎస్ ఎస్ సెక్షన్ల అమలు..పదవ తరగతి పరీక్షల నిర్వహణ సందర్భంగా పోలీసు ఉన్నతాధికారులు, విద్యాశాఖ ఉన్నతాధికారుల ఆదేశానుసారము పరీక్షా కేంద్రం సమీపంలోని సుమారు 100 మీటర్ల దూరం వరకు 144 సెక్షన్ తోపాటు 163 బి ఎన్ ఎస్ ఎస్ సెక్షన్ ఏర్పాటు చేసినట్లు స్థానిక ఎస్సై వి గోవర్ధన్ పేర్కొన్నారు.మండల కేంద్రంలోని జరిగే పదవ తరగతి పరీక్ష నిర్వహణ కోసం ఏర్పాటుచేసిన రెండు పరీక్ష కేంద్రాలను ఆయన ఎంఈఓ తో కలిసి పరీక్ష కేంద్రాలను అయన పరిశీలించారు. పరీక్షా కేంద్రాల వద్ద ఎవరైనా గుమిగూడిన పరీక్షలు రాసే విద్యార్థుల తోపాటు పరీక్షలు నిర్వహించే అధికారులకు ఆటంకం కలిగించేలా వ్యవహరించిన వారిపై పోలీసు ఉన్నతాధికారుల ఆదేశానుసారము కఠిన చర్యలు తీసుకుంటామని. ఆయన తెలిపారు.

## గోదావరి జలాలను కొత్తగూడ, గంగారం ప్రాంతాలకు సాగు,తాగునీరు అందించాలి.

### మంత్రి సీతక్కకి విజ్ఞాపన పత్రం అందజేసిన సిపిఐ ఎం.ఎల్ న్యూడెమోక్రసీ నాయకులు



కొత్తగూడ మార్చి 20(వుదయం ప్రతినిధి ):కొత్తగూడ మండల కేంద్రంలో ఫైర్ స్టేషన్ తో పాటు ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలని కోరుతూ సిపిఐ ఎం.ఎల్ న్యూ డెమోక్రసీ పార్టీ ఆధ్వర్యంలో మంత్రి సీతక్కకి విజ్ఞాపన పత్రం సమర్పించారు.గురువారం మండల కేంద్రానికి విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర మంత్రివర్యులు సీతక్క కి గోదావరి జలాలను కొత్తగూడ,గంగారం ప్రాంత ప్రజలకు సాగు, తాగునీరు అందించి కొత్తగూడ మండల కేంద్రంలో ఫైర్ స్టేషన్, ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలని కోరుతూ విజ్ఞాపన పత్రం ఇవ్వడం జరిగింది.ఈ సందర్భంగా సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ కొత్తగూడ సబ్ డివిజన్ కార్యదర్శి ఇడంపాక శ్రీశైలం మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతమైన కొత్తగూడ గంగారం మండల ప్రజలకు ఎక్కువ శాతం వర్షాధారమైన పంటలే తప్ప మరే అవకాశం లేకుండా పోతుంది అందుకు గోదావరి జలాలను గొలుసుకట్టు చెరువుల ద్వారా తాగు,సాగునీరు అందిస్తే రెండు పంటలు వ్యవసాయం చేసుకునే అవకాశం ఉంటుందని తద్వారా రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందే అవకాశం ఉందని వారు అన్నారు. అదేవిధంగా వేసవికాలంలో పంటలు, ఇండ్లు, అడవులు అగ్నికి ఆహుతి అవుతూ అనేక నష్టాలని ఇప్పటికే చవిచూసిన ఘటనలు ఉన్నాయి, ఆ క్రమంలో నర్సంపేట నుండి గాని మహబూబాబాద్ నుండి గాని ఫైర్ ఇంజన్ వచ్చేసరికి పాక్షికంగా ధ్వంసం అయినటువంటి పరిస్థితి ఉంది కాబట్టి దీనిని దృష్టిలో పెట్టుకొని గౌరవ మంత్రివర్యులు వెంటనే కొత్తగూడ మండల కేంద్రంలో ఫైర్ స్టేషన్ మరియు ఏజెన్సీ ప్రాంత విద్యార్థుల అభివృద్ధికై ప్రభుత్వ డిగ్రీ కళాశాలను వెంటనే ఏర్పాటు చేయాలని వారు అన్నారు.

ఈ యొక్క కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు యాదగిరి యుగంధర్, దేవులపల్లి మంగన్న, మద్దెల వెంకటేష్, విజయ, పాల్గొన్నారు.

## పాత ఆత్మీయులను కలిసిన మంత్రి సీతక్క.



బయ్యారం మార్చి20(వుదయం ప్రతినిధి): మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలంలో వివిధ అభివృద్ధి కార్యక్రమలలో పాల్గొన్న శిశు సంక్షేమ,పంచాయతీరాజ్ శాఖ మంత్రి దాసరి సీతక్క ని మర్యాదపూర్వకంగా కలిసిన తుడుం దెబ్బ మండల అధ్యక్షులు అలెన్ కృష్ణ.రాష్ట్రంలో ఎస్టీ వర్గీకరణ చేపట్టాలని అలెం కృష్ణ మంత్రి దానసరి సీతక్క ను కలిసి విజ్ఞప్తి చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ చేసిన విధంగా రాష్ట్రంలో ఎస్టీ వర్గీకరణ కూడా చేపట్టాలని మంత్రి ని కోరారు.వర్గీకరణ చెయ్యని యెడల తుడుం దెబ్బ సంఘం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపడుతామన్నారు.

## విద్యార్థులకు అద్దాలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే



నారాయణపేట టౌన్ మార్చ్ 20( వుదయం ప్రతినిధి) నారాయణపేట కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో వివిధ పాఠశాలల విద్యార్థులకు ఎమ్మెల్యే డాక్టర్ చిట్టెం పర్ణిక రెడ్డి కంటి అద్దాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కంటిచూపు కోల్పోకుండా డాక్టర్ చే తగిన సలహాలు సూచనలు తీసుకోవాలని ఆమె విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కే సౌభాగ్య లక్ష్మి, ప్రోగ్రామ్ ఆఫీసర్ సాయిరాం, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నరసింహారావు సాగిరి, ఆర్ బి ఎస్ కె వైద్య సిబ్బంది,
వ్యవసాయం మార్కెట్ కమిటీ చైర్మన్ సదాశివ రెడ్డి,మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ హరి నారాయణ బట్టాడు ,సీనియర్ కాంగ్రెస్ నాయకులు ,నారాయణపేట కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ,మాజీ కౌన్సిలర్ సలీం లతోపాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు విద్యార్థులు పాల్గొన్నారు.

## డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం

### జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే



జయశంకర్ భూపాలపల్లి మార్చి 20(వుదయం ప్రతినిధి)డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మించేందుకు
యువత, విద్యార్థులు, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి, ఉజ్వల భవిష్యత్ కోసం బాటలు వేసుకోవాలని జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పి కిరణ్ ఖరే గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గంజాయి, డ్రగ్స్ మహమ్మారిని ప్రారంభ దశలోనే గుర్తించి, నివారించాలని, డ్రగ్స్, గంజాయి విక్రయ దారులు యువతనే లక్ష్యంగా చేసుకుని తమ కార్యకలాపాలను కొనసాగిస్తారని, యువత మాదకద్రవ్యాలకు అలవాటు పడడం వలన క్రమేపి ఆరోగ్యం క్షీణించడంతో పాటు అది ఒక వ్యసనంగా మారుతుందని, నేర ప్రవృత్తి వైపు దారితీస్తుందన్న విషయం గమనించాలని పేర్కొన్నారు. తద్వారా కుటుంబ సభ్యులు, బంధువులకు దూరమవుతారని అన్నారు. చెడు అలవాట్లకు బానిసై, యువత చెడిపోవద్దని సూచించారు.
దీనిపై యువత చైతన్యం కలిగి ఉండాలన్నారు.
డ్రగ్స్ వినియోగిస్తే చాల దుష్పరిణామాలు, చూపుతాయని పేర్కొన్నారు.జిల్లాలో డ్రగ్స్, గంజాయి సంబధిత సమాచారం తెలిస్తే 87126 58111 నెంబర్ కు ఫోన్ చేసి ఇన్ఫర్మేషన్ ఇవ్వాలని, డ్రగ్స్, గంజాయి నిర్మూలనలో ప్రజలు భాగస్వాములు కావాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు.డ్రగ్స్, గంజాయి లాంటి మత్తు పదార్థాలు విక్రయిస్తే చట్ట పరంగా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

# అధికారులు సమన్వయంతో సరస్వతి పుష్కరాల ఏర్పాట్లు పూర్తి చేయాలి

## దేవాదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్





జయశంకర్ భూపాలపల్లి మార్చి 20(వుదయం ప్రతినిధి) సరస్వతి పుష్కరాల సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సమగ్ర ప్రణాళికతో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు పూర్తి చేయాలని దేవాదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ అధికారులను ఆదేశించారు కాళేశ్వరంలో మే 15 నుండి 26వ తేదీ వరకు జరగనున్న సరస్వతి పుష్కరాల ఏర్పాట్లను దేవాదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, కమిషనర్ శ్రీధర్, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ కిరణ్ ఖరే తదితర అధికారులు గురువారం కాళేశ్వరం దేవాలయల ఈఓ కార్యాలయంలో సమీక్షించారు పుష్కరాల సందర్భంగా భక్తుల సౌకర్యాలను మెరుగుపరిచేందుకు చేపట్టిన వివిధ అభివృద్ధి పనుల ప్రగతిని పరిశీలించారు. సరస్వతి విగ్రహం ఏర్పాటుకు స్థలం నిర్ణయించడం, విఐపి ఘాట్ నుండి గోదావరి ఘాట్ వరకు రహదారి నిర్మాణం, పురుషులు, మహిళల కోసం శాశ్వత మరుగుదొడ్ల నిర్మాణం వంటి అంశాలపై సమీక్ష నిర్వహించారు గోదావరి హారతికి ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అలాగే, విఐపి ఘాట్ నుండి గోదావరి ఘాట్ వరకు చేపట్టనున్న రహదారి నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. సరస్వతి పుష్కరాల సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సమగ్ర ప్రణాళికతో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పూర్తిచేయాల్సిన శాశ్వత, తాత్కాలిక పనులకు ముందుగానే షెడ్యూల్ తయారు చేసుకోవాలని, సిబ్బందిని పెద్ద సంఖ్యలో ఏర్పాటు చేసి పనుల్లో వేగం పెంచాలని సూచించారు. అంచనాల్లో వ్యత్యాసాలు చేపట్టే పనులపై నివేదికలు రెండు రోజుల్లో అందచేయాలని సూచించారు. పుష్కర సమాచారం తెలిసేలా ప్రత్యేకంగా యాప్ తయారు చేయాలని, విస్తృత ప్రచారానికి అంబాసిడర్ ను నియమించాలని తెలిపారు. పుష్కర 12 రోజుల కార్యక్రమాలకు సంబంధించి షెడ్యూల్ తయారు చేయాలని ఈఓను ఆదేశించారు. వేడి దృష్ట్యా భక్తుల సౌకర్యార్థం గోదావరిలో చలువ పందిళ్లు ఏర్పాటు చేయాలని తెలిపారు. గోదావరిలో నీని నిల్వలను పరిశీలించాలని తెలిపారు. సత్రం పనులను పూర్తి చేసి అందుబాటులోకి తేవాలని సూచించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. ప్రముఖ ప్రాంతాలలో ప్రసాదాల కౌంటర్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. భక్తులకు సురక్షిత మంచినీరు సరఫరా చేయాలని సూచించారు. గోదావరిలోకి భక్తులు వెళ్ళకుండా ప్రమాద హెచ్చరికల బోర్డ్స్ ఏర్పాటు చేయాలని ఇరిగేషన్ అధికారులకు సూచించారు. అంతకు ముందు విఐపి ఘాట్, గోదావరి ఘాటు వద్ద చేపట్టనున్న పనులను, సత్రం పనులను పరిశీలించారు. తదుపరి ఈఓ కార్యాలయంలో జరిగిన సమావేశంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఇంజినీరింగ్ శాఖల ద్వారా చేపట్టనున్న పనుల ప్రగతిని వివరించారు.

ఈ కార్యక్రమంలో దేవదాయ శాఖ కమిషనర్ శ్రీధర్, ఎస్పీ కిరణ్ ఖరే, దేవస్థానం ఆర్జేసీ రామకృష్ణారావు, పంచాయతిరాజ్, ఇరిగేషన్, ఆర్ డబ్ల్యుఎస్, విద్యుత్, దేవస్థానం తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# అక్రమ కేసులతో హరీష్ రావు ని ఆపగలం అనుకోవటం మీ మూర త్వమే

## జహీరాబాద్ పట్టణ బి.ఆర్.ఎస్ పార్టీ నాయకులు



సంగారెడ్డి జిల్లా. /జహీరాబాద్ మార్చి20(వుదయం ప్రతినిధి):

హరీష్ రావు పై రేవంత్ సర్కార్ అక్రమంగా వేసిన ఫోన్ టాపింగ్ కేసును సరియైన ఆధారాలు లేవని హైకోర్టు కొట్టి వేయడంతో జహీరాబాద్ క్యాంపు కార్యాలయంలో బాణసంచా కాల్చి ,స్వీట్లు పంచుకొని సంబరాలు చేసుకున్న పట్టణ బి.ఆర్.ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు.... ఈ సందర్భంగా బీ అర్ ఎస్ సీనియర్ నాయకుడు నామ రవి కిరణ్ మాట్లాడుతూ హైకోర్టు తీర్పు ప్రభుత్వానికి చెంపపెట్టు లాంటిదని అన్నారు..ప్రతిపక్షాలపై కక్ష సాధించడానికి కేసులతో వేధించాలనుకునే కాంగ్రెస్ ప్రభుత్వానికి ఇది ఒక గుణపాఠం అని అన్నారు...కాంగ్రెస్ ప్రభుత్వం పుట్టిన ప్రజల తరపున హరీష్ రావు గారి పోరాటం ఆగదని అన్నారు..

ఈ కార్యక్రమంలో మాజీ హజ్ కమిటీ సభ్యులు మహమ్మద్ యూసుఫ్, పట్టణ మాజీ అధ్యక్షులు మహమ్మద్ యాకుబ్, మోహియుద్దీన్, ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు బండిమోహన్ సీనియర్, మాజీ కౌన్సిలర్ అబ్దుల్లా సీనియర్ నాయకులు ప్రభు యాదవ్, తులసిదాస్ గుప్తా, కలీం, అలీమ్, పట్టణ మహిళా అధ్యక్షురాలు మంజుల నాయకులు పరమేశ్వర్ పాటిల్, వెంకటేశం, ఆశమ్, పద్మజ, నరేష్ రెడ్డి, మహమ్మద్ అలీ, వహీద్, నరేష్ రెడ్డి, సందీప్ రాజ్, అక్షయ దేశ్పాండే, అలీ, నిఖిల్ ముదిరాజ్ విద్యార్థి విభాగం నాయకుడు ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు..

# విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేసిన రేవంత్ రెడ్డి సర్కార్

## పి డి ఎస్ యు జిల్లా అధ్యక్షులు సాయికుమార్



నారాయణపేట టౌన్ మార్చ్ 20( వుదయం ప్రతినిధి) విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేసిన కాంగ్రెస్ రేవంత్ రెడ్డి సర్కార్ , విద్య రంగం పట్ల వాళ్లకున్న చిత్తశుద్ధి నిరూపించుకున్నారని పిడిఎస్ యు జిల్లా అధ్యక్షుడు ఎస్.సాయి కుమార్ అన్నారు. అసెంబ్లీలో విద్యారంగానికి తక్కువ నిధులు కేటాయించడాని నిరసిస్తూ (పిడిఎస్ యు) రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా నారాయణపేట జిల్లా కేంద్రంలోనీ సత్యనారాయణ చౌరస్తాలో బడ్జెట్ పత్రాలను దానం చేశారు. ఈ సందర్భంగా పిడిఎస్ యు జిల్లా అధ్యక్షుడు ఎస్.సాయికుమార్ మాట్లాడుతూ తెలంగాణ అసెంబ్లీ సమావేశాలలో ప్రవేశపెట్టిన బడ్జెట్లో విద్యారంగానికి అంతంత మాత్రమే నిధులు కేటాయించారని ఇది విచారకరమని అన్నారు. కాంగ్రెస్ ప్రతిపక్షంలో ఉండి ఎన్నికల మేనిఫెస్టోలో విద్యారంగానికి కనీసం 15 శాతం నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారని ఆయన గుర్తు చేశారు. తాము ఇచ్చిన హామీని కూడా నెరవేర్చకుండా రెండవసారి ప్రవేశపెట్టిన బడ్జెట్లో విద్య వ్యవస్థను , విద్యార్థులను అత్యంత దారుణంగా కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందన్నారు. ఇతర రాష్ట్రాలతో పోల్చుకుంటే రేవంత్ రెడ్డి సర్కార్ విద్యారంగానికి సగానికి తక్కువ కేటాయింపులు చేశారనీ , పక్కనే ఉన్న ఆంధ్రప్రదేశ్ 12 శాతం నిధులు కేటాయిస్తే రేవంత్ రెడ్డి గతంలో 7.3 శాతం ఇప్పుడు 7.57 శాతం నిధులు కేటాయించి పెంచామని వాళ్లకు వాలే గొప్పలు చెప్పుకుంటున్నారు అన్నారు. స్వయంగా కాంగ్రెస్ ప్రభుత్వమే బడ్జెట్ పత్రాలలో విద్యారంగం అత్యంత దయనీయంగా ఉందని , గురుకులాలలో అరకొర సౌకర్య భవనాలలో వందలాది మంది విద్యార్థులు ఉంటున్నారని ,వారికి కనీసం టాయిలెట్ సౌకర్యాలు కూడా లేవని అంగీకరిస్తూ పేర్కొన్నారు. ఉన్నత విద్యారంగం అభివృద్ధికి ఏ మాత్రం బడ్జెట్ పత్రాలలో కనీసం చర్చ లేకుండానే ముగించారని విద్యారంగం పట్ల కాంగ్రెస్ ప్రభుత్వానికి కనీసం చిత్తశుద్ధి లేదనే భావన అర్థమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్ యు జిల్లా సహాయ కార్యదర్శి వెంకటేష్ , జిల్లా కోశాధికారి మహేష్ ,జిల్లా నాయకులు సాగర్ ,రాజు , నాయకులు గణేష్ , విష్ణు ,లక్ష్మి ,శ్రీను , శ్రావణ్ ,రమాదేవి , వైష్ణవి ,నితీష్ ,శంకర్ తోపాటు విద్యార్థులు

# రాజీవ్ యువ వికాసం ద్వారా యువతకు ఆర్థిక చేయూత

## ఎస్సీ వర్గీకరణ, బిసి రిజర్వేషన్ల ద్వారా వారి దామాషా ప్రకారం ప్రతి ఒక్కరికి ప్రభుత్వం అండగా ఉంటుంది

## రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్క, అనసూయ



మహబూబాబాద్ (వుదయం ప్రతినిధి ):గురువారం మహబూబాబాద్ జిల్లా, బయ్యారం మండలం పరిధిలో లక్ష్మీనరసింహపురం, కోడిపుంజుల తండా, మొట్ల తిమ్మాపురం, కోటగడ్డ, కొత్తగూడ మండలం గాంధీ నగర్ గ్రామాలలో అంతర్గత రోడ్లు, బ్రిడ్జిలు, పాఠశాలలో వివిధ అభివృద్ధి పనులు లిఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్,లతో కలిసి ప్రారంభించారు, ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మండలంలోని లక్ష్మీనరసింహాపురంలో మూడు కోట్లతో నిర్మాణం, కోడిపుంజుల తండా లో కోటి 50 లక్షలతో అభివృద్ధి పనులు రోడ్ల నిర్మాణం, మొట్ల తిమ్మాపురం లో రెండు కోట్ల తో వంతెన నిర్మాణం, కోట గడ్డ లో 4.72 లక్షలతో రోడ్ల విస్తరణ తదితర అభివృద్ధి పనులు శంకుస్థాపనలు ప్రారంభోత్సవాలు చేయడం జరిగిందని, రాష్ట్ర ప్రభుత్వం గ్రామాలు పట్టణాలు అనే తేడాలు లేకుండా అభివృద్దె ధ్యేయంగా పనిచేస్తుందని అందులో గిరిజన గ్రామాల ప్రజలు సౌకర్యార్థం అంతర్గత రోడ్ల నిర్మాణం విద్య, వైద్యం, ఆరోగ్యం, మహిళా సాధికారత కోసం ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న అనేక కార్యక్రమాలను చేపడుతుందని అన్నారు,

ఇండ్లు లేని నిరుపేదలకు చేయూతను అందించడానికి ప్రతి నియోజకవర్గానికి 3500 పైచిలుకు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామని, యువ వికాసం పథకం కింద నిరుద్యోగులైన ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ అన్ని వర్గాల యువతకు నాలుగు లక్షల ఆర్థిక చేయూతను అందించడం జరుగుతుందని, మహిళలకు స్వయం ఉపాధి పథకాల ద్వారా ఆర్థిక భరోసా కల్పిస్తూ, రాష్ట్రవ్యాప్తంగా మహిళలకు ఉచిత బస్సు సర్వీసులను కల్పిస్తూ, అండగా ఉంటున్నామని,

ఐ టి డి ఎ పరిధిలోని గిరిజన గ్రామాలలో సోలార్ పవర్ ప్రాజెక్టుల ద్వారా ప్రజలకు వివిధ సౌకర్యాలు కల్పనకు కృషి చేస్తున్నామని తెలిపారు, రైతు భరోసా, రైతు రుణమాఫీ ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణ, రైతుల సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు చేపడుతున్నామని అన్నారు,కొత్తగూడ మండల కేంద్రంలోని గాంధీ నగర్ లో గిరిజన ఆశ్రమ సంక్షేమ ఉన్నత పాఠశాల కాలేజ్లలో జగతి ఫౌండేషన్ ద్వారా విద్యార్థులకు కంప్యూటర్లను అందజేశారు, ఆసక్తితో విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు,

రైతు వేదికలో ఆడపిల్లలకు ప్రభుత్వం అందిస్తున్నటువంటి కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ పథకాలు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని వాటి ద్వారా ఆడపడుచులు గౌరవప్రదంగా ఉందన్నారు,

కళ్యాణ లక్ష్మి,షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు,ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, మాట్లాడుతూ ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం ముఖ్యమంత్రి, ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారని, జిల్లాలోనీ తన నియోజకవర్గం లో అంతర్గత రోడ్ల, నిర్మాణం ,వంతెనల నిర్మాణం వివిధ అభివృద్ధి పనులకు సుమారు 10 కోట్ల వ్యయంతో వివిధ అభివృద్ధి పనులు శంకుస్థాపనలు చేయడం సంతోషకరంగా ఉందని, బయ్యారం పెద్ద చెరువును ఆధునికరించాలని,

నియోజకవర్గ పరిధిలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ప్రభుత్వం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్, ఎస్పీ సుధీర్, రామ్నాథ్ కేకన్, రెవెన్యూ డివిజన్ అధికారి కృష్ణవేణి, సంబంధిత ఉన్నత అధికారులు,, తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ ఉపాధిహామీ పనులను పర్యవేక్షించిన ఎంపిడిఓ వెంకటయ్య



అలంపూర్ మార్చి 20 (వుదయం ప్రతినిధి)అయిజ మండలంలోని కిష్టాపూర్ గ్రామంలో జరుగుచున్న జాతీయ ఉపాధి హామీ పనులను గురువారం ఎంపిడిఓ వెంకటయ్య పర్యవేక్షించడం జరిగినది. ఈ సందర్భంగా కూలీలకు ఓఆర్ఎస్ పాకెట్స్ పంపిణీ చేయడం జరిగింది. అదే విధంగా వారికి కావలసిన వర్క్ సైట్ ఫెసిలిటీస్ అనగా టెంటు, వాటర్, ప్రథమ చికిత్స బాక్స్ ఏర్పాటు చేయడం జరిగింది. కూలీలందరూ కొలతల మేరకు పనులు చేసినట్లయితే మీకు 300 రూపాయలు రోజువారి కూలి వస్తాయని కూలీలకు తెలిపారు.

# మదర్ డైరీ, విజయ డైరీ రైతులను ఆదుకోవాలి : బిజెపి.



యాదాద్రి భువనగిరి/రాజపేట, మార్చి 20 వుదయం ప్రతినిధి:

రైతులకు రావలసిన పాల బిల్లులను మదర్ డైరీ, విజయ డైరీ వారు వెంటనే చెల్లించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని బీజేవైఎం నాయకులు బూరుగు శేఖర్ రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కేంద్ర బడ్జెట్లో రాష్ట్రానికి కేటాయించిన నిధుల విషయాన్ని ప్రశ్నిస్తున్న రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు సీఎం సొంత నియోజకవర్గానికి ఆలేరు నియోజకవర్గానికి వెచ్చిస్తున్న నిధులపై కూడా ప్రశ్నించాలని హితవు పలికారు. పాడి రైతులకు ప్రకటించిన నాలుగు రూపాయల ప్రోత్సాన్ని కూడా అందించాలని ఈ విషయంలో ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య చొరవచూపాలన్నారు.

# మరికల్ మండలంలో ఎల్ ఆర్ ఎస్ దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరూ వెంటనే రుసుము చెల్లించండి

మరికల్ మండల కేంద్రంలో శుక్రవారం గ్రామపంచాయతీ కార్యదర్శి శ్యాంసుందర్ రెడ్డి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మండల కేంద్రంలో ఎల్ఆర్ఎస్ దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరూ గ్రామ పంచాయితీ దగ్గర వచ్చి రుసుము చెల్లించవలెనని ఆయన అన్నారు ఈనెల ఆఖరిలో చెల్లించే వరికి 25% తగ్గింపు ఉంటుందని అందుకోసం తొందరగా మీరు రుసుము చెల్లించి మీ ప్లాట్లను రెగ్యులరేషన్ చేసుకోవాలని ఆయన అన్నారు

# నేడు పదవ తరగతి పరీక్షలు

మరికల్ మండల మార్చి20(వుదయం ప్రతినిధి): కేంద్రంలోని శుక్రవారం 10వ తరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయి వివిధ గ్రామాల నుండి విద్యార్థులు గురుకుల పాఠశాలలో పాఠశాలలో పరీక్షలు కేంద్రం లో పరీక్షలు విద్యార్థులు పరీక్ష సమయంలో పది నిమిషాలు ముందే పరీక్ష సెంటర్లకు చేరుకోవాలని ప్రైవేటు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఎలాంటి కాఫీ కొట్టకుండా సంవత్సరం మొత్తము చదువుకున్న విద్యార్థులు భయం లేకుండా పరీక్షలు రాసి పరీక్షలలో మంచి మార్కులు తెచ్చుకొని పాసు కావాలని గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ తెలిపారు

# ప్రపంచ నోటిఆరోగ్య దినోత్సవం




డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా వూ దయం ప్రతినిధి (బోడపాటి వరప్రసాద్ )ప్రపంచ నోటి ఆరోగ్య దినోత్సవంసందర్భంగా ద్రాక్షారామ భీమేశ్వర దంత వైద్యశాల డాక్టర్ క్రాంతి కుమార్ ఆధ్వర్యంలో రోగులకు ఉచిత దంత వైద్య శిబిరం గురువారం నిర్వహించబడింది. ఈ శిబిరంలో రోగులకు పరీక్ష చేసి చిగుళ్ల వ్యాధులు ఉన్నవాళ్లను గుర్తించి వాళ్లకు గుండె సంబంధిత వ్యాధులకు దారి తీయవచ్చునని అవగాహన కల్పించడం జరిగింది. నోటి ఆరోగ్యమే శరీర ఆరోగ్యమని ఈ విషయాన్ని అందరూ గమనించాలని డాక్టర్ క్రాంతికుమార్ తెలియజేశారు. ప్రతిరోజు రెండు పూటలా బ్రష్ చేయాలని, సంవత్సరానికి ఒక్కసారైనా దంత వైద్యున్ని సంప్రదించి నోటి క్లీనింగ్ ద్వారా వివిధ వ్యాధులను గుర్తించి మొదటి దశలోనే అరికట్టవచ్చని అవగాహన కల్పించడం జరిగింది. పళ్ళు లేని వారు కృత్రిమ పద్ధతిలో పళ్ళను కట్టుకొనుట ద్వారా గ్యాస్ట్రిక్ తద్వారా వచ్చే నోటి దుర్వాసనను,తదితర సమస్యల నుండి ఉపశమనం పొందవచ్చని సూచించారు. ఈ శిబిరంలో రోగులకు ఉచితంగా టూత్ పేస్ట్ లు,మందులు పంపిణీ చేయడం జరిగింది.

# శనిగల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన బోథ్ ఎమ్మెల్యే


బోథ్, మార్చి20(వుదయం ప్రతినిధి): బోథ్ మండల కేంద్రంలో స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ శనిగల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ. రైతు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేయాలన్నారు. రైతులు కూడా దళారులకు నమ్మి మోసపోకుండా, తమ పంటను ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలనే అమ్మాలన్నారు. మాజీ జడ్పీటీసీ సంధ్యారాణి, మండల కన్వీనర్ నారాయణ రెడ్డి, మాజీ సర్పంచులు తదితరులున్నారు.

# విద్యార్థులు కాలంతో పోటీ పడాలి

మహబూబాబాద్, మార్చి20(వుదయం ప్రతినిధి): ఇప్పుడున్న పోటీ ప్రపంచంలో విద్యార్థులు కాలంతో పోటీ పడాలని మరిపెడ ఎంఈఓ అనితా అన్నారు. మండల కేంద్రంలోని సెయింట్ అగస్టిన్ హైస్కూల్ లో నిర్వహించిన సైన్స్ ఎగ్జిబిషన్ ను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోటీ ప్రపంచంలో తట్టుకొని నిలబడాలంటే ఇప్పటి నుంచే విద్యార్థులు కొత్త కొత్త ఆవిష్కరణల వైపు దృష్టి పెట్టాలన్నారు. విద్యార్థులు చేసిన వివిధ ఆవిష్కరణలను తిలకించారు.

# పదవ తరగతి పరీక్షలు సజావుగా జరిగేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి

## జిల్లా కలెక్టర్ బి.ఎమ్.సంతోష్



గద్వాల మార్చి 20 (వుదయం ప్రతినిధి)జిల్లాలో పదవ తరగతి పరీక్షలు మార్చి 21 నుండి ఏప్రిల్ 4వ తేదీ వరకు ఉదయం 9:30 గంటల నుండి మధ్యాహ్నం 12:30 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని, ఎలాంటి మాస్ కాపీయింగ్ కు అవకాశం లేకుండా పరీక్షలను పారదర్శకంగా నిర్వహించేందుకు గాను పరీక్ష కేంద్రాలలో కట్టుదిట్టమైన చర్యలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. పదవ తరగతి పరీక్షలను సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో మొత్తం 40 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని, 7,717 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నారని తెలిపారు. పరీక్షల నిర్వహణలో ఎలాంటి లోటు పాట్లకు తావు లేకుండా నిర్వహించేందుకు గాను 40 మంది చీఫ్ సూపరింటెండెంట్ లను, 430 మంది ఇన్విజిలేటర్ లు, 3 ఫ్లయింగ్ స్క్వాడ్ లు, 14 మంది సెంటర్ కస్టోడియన్ లు, 40 మంది సిట్టింగ్ స్క్వాడ్ లు, 40 మంది డిపార్ట్మెంటల్ అధికారులను నియమించడం జరిగిందని తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని, పరీక్షా కేంద్రాల పరిసరాలలో ఉన్న జిరాక్స్ సెంటర్లను మూసి వేయడం జరుగుతుందని తెలిపారు. విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు సకాలంలో చేరుకునే విధంగా అవసరమైన మార్గాలలో ఆర్టిసి బస్సు సర్వీసులను నడపడం జరుగుతుందని, విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు సకాలంలో చేరుకోవాలని, పరీక్ష కేంద్రాలలో ఎట్టి పరిస్థితులలో కూడా విద్యార్థులు సెల్ ఫోన్లు ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులను అనుమతించబడదని తెలిపారు. పరీక్ష కేంద్రాలలో విద్యార్థులకు అవసరమైన త్రాగునీరు, మరుగుదొడ్లు ఏర్పాటు చేయడం జరిగింది అన్నారు. విద్యార్థులు ఎలాంటి ఆందోళనకు గురికాకుండా ప్రశాంత వాతావరణం లో పరీక్షలు రాయాలని ఆకాంక్షించారు. లిజిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షలను విజయవంతంగా నిర్వహించడం జరిగిందిలి

జిల్లాలో మార్చ్ 5వ తేదీ నుండి 20 వ తేదీ వరకు నిర్వహించిన ఇంటర్మీడియట్ పరీక్షలను ప్రశాంత వాతావరణంలో విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా విజయవంతంగా నిర్వహించడం జరిగిందని జిల్లా కలెక్టర్ ఈ సందర్భంగా తెలియజేశారు.

# ముగిసిన పొనకల్ దినసంత వేలం పాట

: వాయిదా పడిన వారసంత వేలం పాట



జన్నారం,మార్చ్ 20(వుదయం విలేఖరి) జన్నారం మండలంలోని పోన్కల్ గ్రామంలో నిర్వహించే దిన, సంతల నిర్వహణ హక్కులను బోయిని రాజన్న దక్కించుకున్నారు.గురువారం ఉదయం ఆ గ్రామ పంచాయతీలో దిన, వారసంతలకు వేలంపాట నిర్వహించారు.ఇందులో బోయిని రాజన్న దిన సంత నిర్వహణను హక్కులను రూ.3,95,000కు పాట పాడి దక్కించుకున్నారు.అదే విధంగా వార సంతకు తగిన వేలం పాట రాకపోవడంతో దానిని వాయిదా వేశామని ప్రత్యేక అధికారి ఉమర్ షరీఫ్,ఈవో రాహుల్ తెలిపారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఫసివుల్లా, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# గతంలో దరఖాస్తు చేసుకున్న పి.యం. విశ్వకర్మ పథకాన్ని పునరుద్దీకరించండి

బిజెపి అయిజ మండల అధ్యక్షుడు గోపాల కృష్ణ



అలంపూర్ మార్చి 20 (వుదయం ప్రతినిధి)అయిజ మండలంలోని మేడికొండ గ్రామంలో గతంలో పి.ఎం. విశ్వకర్మ పథకానికి కొంతమంది దరఖాస్తు చేసుకున్నారు. కానీ గ్రామ పంచాయతీ సెక్రెటరీ లాగిన్ లో కొన్ని సాంకేతిక కారణాల వలన దరఖాస్తులు పెండింగులో ఉన్నాయి. ఈ విషయమై భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షులు గోపాలకృష్ణ ఆధ్వర్యంలో ఎంపిడివో వెంకటయ్యని కలిసి సమస్య పరిష్కరించి మేడికొండ గ్రామపంచాయతీకి సంబంధించి పి యం విశ్వకర్మ పథకంకు లబ్ధిదారులను ఎంపిక చేయాలని వినతిపత్రం ఇవ్వడం జరిగింది. అందుకుగాను ఎంపిడిఓ సానుకూలంగా స్పందిస్తూ త్వరలో సమస్యను పరిష్కరించి లబ్దిదారులకు న్యాయం జరిగేటట్లు చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కిసాన్ మోర్చా కార్యవర్గ సభ్యులు మేడికొండ భీమ్ సేన్ రావ్, ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేష్ యాదవ్, గడిగ రఘు, సాకలి తిమ్మప్ప, రాముడు, తదితరులు పాల్గొన్నారు

# కసాయి తండ్రి అరెస్టు

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా వు దయం ప్రతినిధి బోడపాటి వరప్రసాద్



రాయవరం మండలం వెంటు టూరు గ్రామానికి చెందిన పిల్లి రాజు అప్పుల బాధలు తాళలేక తన కుమార్తె కుమారుడును చంపి తాను చనిపోవాలని ఉద్దేశంతో నేలపత్తిపాడు శివారు గణపతి నగర్ కాలవలో కొడుకు రామ్ సందీప్ 10 సంవత్సరాలుకూతురు కారుణ్య ఏడు సంవత్సరాలు ఇద్దరిని కాలువలోకి తోసి నాడు వారి రూరల్ రామచంద్రపురం పట్టణం భాష్యం స్కూల్లో చదువుతుండగా స్కూల్ నుండి ఇంటికి తీసుకెళ్తాను అంటూ కుమారుడు సందీప్ కుమార్తె కారుణ్య లను ఇరువురిని కాలువలోకి నెట్టు వేసినాడు కుమారుడు కర్ర సాయంతో ఈదుకుంటూ పైకి వచ్చి ప్రాణాలు రక్షించుకున్నాడు కుమార్తె కారుణ్య ఈత రాకపోవడంతో మునిగి చనిపోయింది అనంతరం నిందితుడు సంఘటన స్థలం నుండి పరారీ యానం వెళ్లి యానం బ్రిడ్జిపై తన స్కూటీని పెట్టి ఆత్మహత్య ప్రయత్నం చేసినట్లు అనంతరం మనసు మార్చుకున్న అతను తన బంధువులు ఇంటికి రాజానగరం మండలం రాధేయ పాలెం వెళ్లి విషయాన్ని బంధువులకు చెప్పగా వారు స్థానిక పోలీసులకు సమాచారం అందించారు దీంతో రామచంద్రపురం సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎం వెంకటనారాయణ తన సిబ్బందితో కలిసి వెళ్లి నిందితుడిని అదుపులో తీసుకుని రామచంద్రపురం తీసుకువచ్చా భారతీయ నేర శిక్షాస్మృతి 103 109 ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు 20వ తేదీ గురువారం కోర్టులో హాజరు పరిచి రెమైనింగ్ పంపన ఉన్నట్లు రామచంద్రపురం డి.ఎస్.పి రఘువీర్ వెల్లడించారు ఈ కార్యక్రమంలో సర్కిల్ ఇన్స్పెక్టర్ వెంకటనారాయణ రామచంద్రపురం ఎస్ఐ నాగేశ్వరరావు ద్రాక్షారామ ఎస్ఐ లక్ష్మణ్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు

# పది పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి : ఎంఈఓ....



చంద్రుగొండ, మార్చి20: ( వుదయం ప్రతినిధి ) పది తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి అయినట్లు మండల విద్యశాఖాధికారి సత్యన్నారాయణ తెలిపాడు. గురువారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, సెయింట్ జోషప్ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలను ఆయన పరిశీలించి, ఏర్పాట్లుపై ఆరాతీశాడు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ..... చంద్రుగొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 135మంది, స్థానిక సెయింట్ జోషప్ పాఠశాలలో 140మంది విద్యార్థులు శుక్రవారం నుండి పది పరీక్షలు వ్రాయనున్నారన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. ప్రశాంతంగా పరీక్షలు నిర్వహించేలా అందరూ సహకరించాలన్నారు. ఆయన వెంట ఉపాధ్యాయులు పాల్గొన్నారు...

# వరద కాల్వకై పోరాటం చేసింది సిపిఐ పార్టీ

"చాడ వెంకటరెడ్డి నాటి పోరాట ఫలితమే

గౌరవెల్లి,గండిపెల్లి తోటపల్లి ప్రాజెక్ట్ సాధించిన ఘనత

సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు గడిపె మల్లేశ్




హుస్నాబాద్ మార్చి20(వుదయం ప్రతినిధి): కరువుకు నిలయం మెట్ట ప్రాంతమైన హుస్నాబాద్ నియోజకవర్గ వర్గానికి త్రాగు సాగు నీరు రావాలనీ భారత కమ్యూనిస్టుపార్టీ సిపిఐ 4 దశాబ్దాల ప్రజా పోరాటం ఫలితంగా 2007 అప్పటి ఇందుర్తి శాసన సభ్యులుగా శాసన సభలో సిపిఐ పక్షనేత పని చేస్తున్న చాడ వెంకటరెడ్డి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి దీవంగనేత డాక్టర్ వైయస్ రాజశేఖరరెడ్డిని ఒప్పించి మెప్పించి హుస్నాబాద్ కు రప్పించి గౌరవెల్లి,గండిపెల్లి తోటిపెల్లి ప్రాజెక్టుల నిర్మాణంకు నిధులు మంజూరు చేస్తు శంకుస్థాపన చేయించిన ఘనత కేవలం చాడ వెంకటరెడ్డికే దక్కిందని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు హుస్నాబాద్ మాజీ వైస్ ఎంపిపి గడిపె మల్లేశ్ అన్నారు.గురువారం నాడు ఆయన విలేఖరులతో మాట్లాడుతూ శ్రీరాం సాగర్ వరదకాల్వ సాధన కోసం నిజామాబాద్ జిల్లా బాల్కొండలోని శ్రీరాం సాగర్ వరదకాల్వ ద్వారా మెట్ట ప్రాంతమైన ఇందుర్తి నియోజకవర్గంలో హుస్నాబాద్ ప్రాంతంలోని పల్లెల్లో గ్రామాల్లో పాదయాత్రలు చేసి 24 గంటల పాటు కలెక్టర్ ఆఫిస్ ముట్టడి ఎడ్లబండి రాస్తారోకో కరీంనగర్ జిల్లా కేంద్రం దిగ్బంధనం లాఠీ చార్జీలు తలలు పగిలిన నేలకు రాలిన నెత్తుటి సాక్షిగా సిపిఐ వరదకాల్వ సాదించిన ఘనత చాడ వెంకటరెడ్డికే ఇంకెవ్వరికి దక్కదని గడిపే మల్లేశం అన్నారు టిఆర్ఎస్ పాలకులు ప్రాజెక్టు పూర్తి కాకుండావివక్షతో నేటి వరకు గౌరవెల్లి గండిపెల్లి ప్రాజెక్టులు పూర్తి కాకుండా ప్రాజెక్టులో భూములు కోల్పోయిన నిర్వాసితులకు న్యాయం చేయలేక పోయాయని అధికారంలో ఉన్న రేవంత్ రెడ్డి ప్రజా పాలనలో నిధులు మంజూరు అయినప్పటికీ వఖ్యగ్ర కాల్వలు పూర్తి కాలేదని గౌరవెల్లి ప్రాజెక్టుతో పాటు గండిపెల్లి ప్రాజెక్టును వెంటనే పూర్తి చేసేందుకు ముఖ్యమంత్రి సంబంధిత నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కృషి చేయాలని గడిపె మల్లేశ్ కోరారు.

# అత్యాధునిక వెటర్నరీ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ 'పెట్ ఫస్ట్' ప్రారంభం



హైదరాబాద్, మార్చి 20 2025: పెంపుడు జంతువులకు అత్యుత్తమ వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా కోకాపేట్లోని నార్సింగిలో అత్యాధునిక వెటర్నరీ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ 'పెట్ ఫస్ట్'ను ప్రారంభించారు. ఈ సందర్భంగా పెట్ ఫస్ట్ వ్యవస్థాపకురాలు, మేనేజింగ్ డైరెక్టర్ పద్మజ మాట్లాడుతూ మా పెట్ 'మాక్స్' నా జీవితంలో ఎంతో ముఖ్యమైన భాగం అన్నారు. పెట్ పేరెంట్గా, వ్యాపారవేత్తగా జంతువుల సంరక్షణను ప్రోత్సహించేందుకు కట్టుబడి ఉన్నానన్నారు. ఈ దీక్షే ఆధునిక వెటర్నరీ ఆరోగ్య సంరక్షణ కోసం ఒక అత్యాధునిక కేంద్రాన్ని నిర్మించేందుకు ప్రేరణ ఇచ్చిందన్నారు. పెంపుడు జంతువుల సమగ్ర ఆరోగ్య సంరక్షణ మా లక్ష్యమన్నారు. ఈ హాస్పిటల్లో అధునాతన రోగ నిర్ధారణ పరీక్షలు, అత్యవసర సంరక్షణ, ప్రత్యేక చికిత్సలు, వెల్నెస్ కార్యక్రమాలు, పెంపుడు జంతువుల పునరుజ్జీవన కేంద్రం, పెంపుడు జంతువుల శిక్షణ అన్నీ ఒకే చోట గల గమ్యస్థానం అన్నారు. 'పెంపుడు జంతువుల పట్ల ప్రేమ, ఆయా కుటుంబాల పరిరక్షణ' ఇదే మా హామీ అన్నారు.

ఈ సందర్భంగా పెట్ ఫస్ట్ వ్యవస్థాపకుడు, ఎమ్మెల్యే కే మదన్ మోహన్ రావు మాట్లాడుతూ సమాజంలో మనుషులను మాత్రమే కాకుండా ప్రతి జీవిని ఆదరించాలన్నారు. అదే దృక్పథంతో పని చేస్తున్నానన్నారు. పెట్ ఫస్ట్ ద్వారా పెంపుడు జంతువులకు తగినంత శ్రద్ధ, వైద్య సేవలు అందే ప్రపంచాన్ని నిర్మించడం తమ లక్ష్యమన్నారు. ఆధునిక సౌకర్యాల ద్వారా వెటర్నరీ చికిత్సా ప్రమాణాలను మెరుగుపరచడమే కాకుండా, పెంపుడు జంతువులకు, పెంపుడు జంతువుల యజమానులకు ఉత్తమ సేవలు అందించేందుకు కట్టుబడి ఉన్నామన్నారు. 24/7 అత్యవసర, క్రిటికల్ కేర్ సేవలు కలవన్నారు. అత్యాధునిక పరీక్షలు, శస్త్రచికిత్స నిపుణులు, పూర్తి స్థాయి పెట్ ఆరోగ్య సంరక్షణ, ప్రపంచ స్థాయి అనుభవం కలిగిన వెటర్నరీ నిపుణుల బృందం కలదన్నారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మళ్ళు, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రెవెన్యూ, హౌసింగ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎక్సైజ్, టూరిజం, సంస్కృతి %ం% పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, పంచాయతీ రాజ్, మహిళా సంక్షేమ శాఖ మంత్రి శాఖ డీ అనసూయ సీతక్క, మేయర్ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో ఇసుక అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలి

జిల్లా కలెక్టర్ బి ఎమ్.సంతోష్



గద్వాల మార్చి 20 (వుదయం ప్రతినిధి) జిల్లాలో ఇసుక సౌలభ్యం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్ అధికారులను ఆదేశించారు. గురువారం రాజోలీ మండలం తుమ్మిళ గ్రామంలో గుర్తించబడిన ఇసుక డీ-సిల్టేషన్ ప్రదేశాన్ని కలెక్టర్ క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. అక్కడి భౌగోళిక పరిస్థితులను స్వయంగా గమనించి,ఇసుక తవ్వకాల ప్రక్రియ, భవిష్యత్తులో చేపట్టాల్సిన చర్యలు, పర్యావరణ పరిరక్షణ అంశాలపై సంబంధిత అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఇసుక తవ్వకాలు పూర్తి పారదర్శకంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా సరఫరా వ్యవస్థను మెరుగుపర్చాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు,నిర్మాణ రంగానికి,ప్రభుత్వ ప్రాజెక్టులకు అవసరమైన ఇసుకను సమర్థవంతం గా అందుబాటులోకి తీసుకురావాలని స్పష్టం చేశారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర మైనింగ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న ఇసుక డీ-సిల్టేషన్ ప్రదేశాన్ని సందర్శించారు. ఇక్కడ ఇప్పటికే ఇసుక నిల్వ ఉన్నట్లు గమనించి, దాని సరఫరాను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. నీటిపారుదల, రెవెన్యూ, మైనింగ్ శాఖలు సమన్వయంతో పని చేసి, ఇసుక తవ్వకం, నిల్వ, సరఫరాను సమర్థంగా నిర్వహించాలని ఆదేశించారు. అంతకుముందు కలెక్టర్ తుమ్మిల ఎత్తిపోతుల పథకాన్ని సందర్శించి, ప్రాజెక్టు పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా నీటి నిల్వలు, ఇన్డెంట్ చేసిన నీటి సరఫరా,సాగు అవసరాలు,తాగునీటి వినియోగం, భవిష్యత్తులో చేపట్టాల్సిన చర్యలపై అధికారుల నుండి వివరాలు తెలుసుకున్నారు.నీటి సరఫరా వ్యవస్థను సమర్థంగా నిర్వహించాలని అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏ.డి మైనింగ్ అధికారి రమణ,ఇరిగేషన్ ఈ.ఈ శ్రీనివాస్,తహశీల్దార్ రామ్ మోహన్, ఇంజినీరింగ్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# భయం వీడి పరీక్షలు రాయాలి



జన్నారం,మార్చ్ 20(వుదయం విలేఖరి) విద్యార్థులు ఆత్మస్థైర్యంతో పరీక్షలు రాయాలని జన్నారం మండల తాసిల్దార్ రాజ మనోహర్ రెడ్డి సూచించారు.గురువారం ఉదయం జన్నారం మండలంలోని కలమడుగు గ్రామంలో ఉన్న జడ్పీ పాఠశాలను ఆయన సందర్శించారు.ఈ సందర్భంగా ఆ పాఠశాలలో టెన్త్ పరీక్షలు రాయనున్న విద్యార్థులకు హాల్ టికెట్లను అందజేశారు.విద్యార్థులు భయం వీడి ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం కట్టా రాజమౌళి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యేను సన్మానించిన శివన్న సైన్యం



నారాయణపేట టౌన్ మార్చ్ 20( వుదయం ప్రతినిధి) నారాయణపేట ఎమ్మెల్యే డాక్టర్ చిట్టెం పర్ణిక రెడ్డిని శివన్న సైన్యం నేతలు గురువారం శాలువా పూలమాలతో ఘనంగా సన్మానించారు. బీసీ లకు చట్టసభల్లో, ఉద్యోగాల్లో 42 శాతం రిజర్వేషన్, ఎస్సీ వర్గీకరణ బిల్లులను శాసనసభలో ప్రవేశపెట్టి ఆమోదం పొందిన సందర్భంగా కృతజ్ఞతలు తెలుపుతూ ఎమ్మెల్యే చిట్టెం పర్ణిక రెడ్డికి సన్మానం చేసినట్లు శివన్న సైన్యం తెలిపారు. నారాయణపేట అభివృద్ధికి పూర్తిస్థాయిలో తాము ఎమ్మెల్యే వెంట ఉంటామని వారి సందర్భంగా తెలిపారు. కార్యక్రమంలో శివన్న సైన్యం, జిల్లా యూత్ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ కురువ మనోజ్ ,పట్టణ అధ్యక్షుడు సలీం, దొడ్డి కార్తీక్, గడ్డం వినోద్, జరంగ్ రాము ,మసి పవన్ లతోపాటు శివన్న సైన్యం యువ నాయకులు అధిక సంఖ్యలో

## సంగారెడ్డి జిల్లాలో ప్రశాంతంగా ముగిసిన ఇంటర్ పరీక్షలు

నారాయణఖేడ్, మార్చి20(వుదయం ప్రతినిధి): జిల్లాలో ఈనెల 5వ తేదీన ప్రారంభమైన ఇంటర్మీడియట్ పరీక్షలు గురువారంతో ముగిసాయి. ద్వితీయ సంవత్సరం కెమిస్ట్రీ, కామర్స్ సబ్జెక్టులకు 15, 412 మందికి, 15, 030 మంది విద్యార్థులు హాజరయ్యారు. 97. 52 శాతం విద్యార్థులు పరీక్షకు హాజరైనట్లు జిల్లా ఇంటర్మీడియట్ అధికారి గోవిందరాం తెలిపారు. ఇంటర్ పరీక్షలు [redacted]

# మల్లు భట్టి విక్రమార్క కృషితో మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



మధిర మార్చి 20 (వుదయం ప్రతినిధి) మధిర పట్టణంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయం లో వివిధ ఆస్పత్రులలో చికిత్స చేయించుకొని ఆర్థిక స్తోమత లేక రాష్ట్ర ప్రభుత్వానికి ముఖ్యమంత్రి సహాయ నిధి కోసం దరఖాస్తు చేసుకోగా మధిర నియోజకవర్గ శాసనసభ్యులు, తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, విద్యుత్ శాఖ మంత్రివర్యులు మల్లు భట్టి విక్రమార్క సిఫార్సుతో మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను దెందుకూరు, మధిర, రొంపిమల్ల, నిదానపురం, అల్లినగరం, సిరిపురం, మాటూరు గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు 6 లక్షల విలువగల చెక్కులను మధిర మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సూరంశెట్టి కిషోర్ అందజేశారు.

ఈ కార్యక్రమంలో మధిర మండల ఎస్సీసెల్ అధ్యక్షులు దారా బాలరాజు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కర్నాటి రామారావు, పాటిబండ్ల సత్యంబాబు, నిడమనూరు వంశీకృష్ణ, షేక్ జహంగీర్, సంపసాల రామకృష్ణ, ఇటికల కృష్ణారెడ్డి, గొల్లమందల శీను, గుర్రాల వీరారెడ్డి, సూర్యదేవర హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు

# ప్రజా పోరాటాలే మల్లు స్వరాజ్యంకు ఘనమైన నివాళులు ...

: సిపిఎం బాచుపల్లి మండల కార్యదర్శి బి వెంకట్రామయ్య



కుత్బుల్లాపూర్, మార్చి 20,(వుదయం ప్రతినిధి ),ప్రజా సమస్యలపై అలుపెరుగని నిరంతరం పోరాటాలు నిర్వహించడమే మల్లు స్వరాజ్యంకు ఘనమైన నివాళులు అని సిపిఎం బాచుపల్లి మండల కార్యదర్శి బి.వెంకట రామయ్య అన్నారు. తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు మల్లు స్వరాజ్యం మూడవ వర్ధంతిని ప్రగతి నగర్ సుందరయ్య భవన్లో స్వరాజ్యం చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం బాచుపల్లి మండల కార్యదర్శి బి వెంకట రామయ్య మాట్లాడుతూ తెలంగాణ నైజాం పాలన అంతం కోసం, భూమి, భుక్తి, విముక్తి కోసం ఆనాడు సాయుధ పోరాట కదన రంగంలో దూకిన వీరనారి మల్లు స్వరాజ్యం అని వారి స్ఫూర్తితో మహిళలందరూ ముందుకు సాగాలని మల్లు స్వరాజ్యం వెట్టి చాకిరి విముక్తి కోసం అలుపెరుగని పోరాటం చేసిందని నైజంనిరంకుశ విధానాలను గెరిల్లా యుద్ధ వ్యూహంతో పోరాడిన వీర వనిత మల్లు స్వరాజ్యం అన్నారు.

మహిళలు ఆమెను స్ఫూర్తిగా తీసుకొని ఉద్యమాలలో ముందుకు సాగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం బాచుపల్లి మండల నాయకులు బాల వెంకటేశ్వరరావు, కృష్ణయ్య, ఎన్ బాలపీరు, గోవింద్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# అంగన్వాడి గది మరమ్మత్తు కోసం ఆర్థిక సాయం చేసిన జెల్ల పరమేష్ గౌడ్.



యాదాద్రి భువనగిరి/రాజాపేట, మార్చి 20 వుదయం ప్రతినిధి: రాజపేట మండలం బేగంపేట గ్రామంలోని అంగన్వాడీ సెంటర్ – 2 లో తరగతి గది పెచ్చులూడి విద్యార్థులకు ఇబ్బందికరంగా మారడంతో స్థానిక సామాజికవేత్త జెల్ల పరమేష్ గౌడ్ గురువారం తరగతిగది మరమ్మత్తుల కోసం 5000 రూపాయల నగదు అందజేశారు. ఈ కార్యక్రమంలో జెల్లా పరమేష్ యువసేన సభ్యులు కొత్తపల్లి ప్రసాద్, పేట నగేష్, పల్ల పవన్, చిన్నం బాలస్వామి,తులసి, గణేష్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంగన్వాడీ టీచర్ కృతజ్ఞతలు చెప్పారు.

# ఇచ్చిన మాట నిలబెట్టుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం

## బీసీలు దళితుల అభ్యున్నతికి కృషి చేస్తున్న రేవంత్ సర్కార్

మార్చి 20 దమ్మపేట, (ప్రుదయం ప్రతినిధి): అశ్వారావుపేట నియోజకవర్గ శాసనసభ్యులు ఆదినారాయణ ఆదేశాల మేరకు దమ్మపేట మండల పట్వారి గూడెం గ్రామంలో గ్రామ శాఖ అధ్యక్షులు బొల్లికొండ నాగేశ్వరావు ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి మరియు మంత్రుల చిత్రపటాలకు పాలాభిషేకం చేయడం జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏ ఏ ఎం సి చైర్మన్ వానం రాణి %బ% శ్రీనివాస్ తెలంగాణ ఉద్యమ నాయకులు దమ్మపేట మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు ముళ్ళపూడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు రేవంత్ రెడ్డి , గౌరవ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మంత్రివర్యులు పొంగుల ప్రభాకర్ గ రాష్ట్ర మంత్రులకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతూ. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మన ప్రియతమ నేత రాహుల్ గాంధీ కలను సహకారం చేస్తూ దేశంలో ఎక్కడ జరగని విధంగా తెలంగాణ రాష్ట్రంలో బీసీ,దళిత బడుగు బలహీనవర్గాల పక్షపాతిగా కాంగ్రెస్ పార్టీ నిలిచి ఈరోజు బీసీలకు అవకాశాలు కల్పిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్ కు ప్రత్యేకమైన కృతజ్ఞతలు తెలుపుతున్నాము 42 శాతం రిజర్వేషన్లు కల్పించి బిల్లును చట్టసభల్లో ఆమోదంతో బడుగు బలహీన వర్గాలకు సామాజిక న్యాయం కాంగ్రెస్‌తోనే సాధ్యమని నిరూపితమైందన్నారు. చారిత్రాత్మక బీసీ బిల్లును ప్రవేశపెడుతున్న కాంగ్రెస్‌తో



బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు కలిసిరాకపోతే బీసీ సామాజికవర్గం ఆ పార్టీలను ఎన్నటికీ క్షమించదని ఆయన అన్నారు .బీజేపీ వారికి నిజంగా బీసీలకు న్యాయం చేయాలని ఉంటే దీన్ని కేంద్రంలో కూడా ఆమోదించేలా బీజేపీ అధిష్టానాన్ని ఒప్పించాలని ఆయన డిమాండ్ చేశారు.విద్య, ఉ పాధి రంగాల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని బిల్లును చట్టసభల్లో ఆమోదంతో కాంగ్రెస్ పార్టీయే బడుగు బలహీన వర్గాలకు న్యాయం చేస్తుందని మరోసారి రుజువయ్యిందన్నారు.సామాజిక న్యాయానికి కాంగ్రెస్ పార్టీ పెద్దపీట వేస్తుందని చెప్పడానికి బీసీ రిజర్వేషన్లు,ఎస్సీ వర్గీకరణ బిల్లులను చట్టసభల్లో ప్రవేశపెట్టడమే దీనికి నిదర్శనం అన్నారు.. ఈ సందర్భంగా కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ కి, గౌరవ రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు రేవంత్ రెడ్డి కి,గౌరవ రాష్ట్ర మంత్రివర్యులు పొన్నం ప్రభాకర్ కు,ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కొరసా సాగర్, కోరం అర్జున్ రావు, రెడ్డి మల్ల చిట్టి నాయన, యుగేందర్, ప్రశాంత్, నజీర్, నాగేంద్రబాబు, పవన్, శ్రీరాములు, వెంకటేశ్వరరావు, వీరభద్రం, కాంగ్రెస్ నాయకులు,అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# వివాహ విందులో పాల్గొన్న సీఎం రేవంత్ రెడ్డి.



కుత్బుల్లాపూర్, మార్చి 20,(ప్రుదయం ప్రతినిధి ),కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కోలన్ హన్మంత్ రెడ్డి కుమారుడు కోలన్ వెంకట్ రామ్ రెడ్డి వివాహ విందులో తెలంగాణ రాష్ట్ర ముఖ్య మంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ వేడుకలో నియోజకవర్గం కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## పదవ తరగతి విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే జారె



మార్చి 20 దమ్మపేట, (ప్రుదయం ప్రతినిధి): గురువారం నుండి జరగబోయే పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు సిద్ధం అవుతున్న విద్యార్థిని, విద్యార్థులందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేసిన అశ్వారావుపేట నియోజకవర్గం శాసనసభ్యులు జారే ఆదినారాయణ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులందరూ ఏకాగ్రతతో చదివి పరీక్షలు మంచిగా వ్రాయాలని, కష్టపడి మిమ్మల్ని చదివిస్తున్న తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, మీ పాఠశాలలకు, మీ గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని కోరుకుంటున్నాను. విద్యార్థులందరూ సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని,ఎలాంటి ఆందోళన చెందకుండా ప్రశాంతంగా పరీక్షలు వ్రాసి మంచి ఫలితాలు సాధించాలి అని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. అలాగే గ్రామాల నుంచి వచ్చే విద్యార్థులకు బైక్ లిఫ్ట్ అడిగితే ఇవ్వండి. సకాలంలో ఎగ్జామ్ సెంటర్ల దగ్గర విద్యార్థులను దింపి సహకరించండి అదేవిధంగావిద్యార్థిని, విద్యార్థులకులి గమనికపరీక్ష కేంద్రానికి 30 నిమిషాల ముందుగా చేరుకోవాలిపరీక్ష రాయడానికి కావలసిన సామాగ్రిని (హాల్ టికెట్ ,పెన్ను, పెన్సిల్, స్కేలు ,రబ్బర్ ,షార్ప్ను సిద్ధంగా ఉంచుకోవాలని ఆయన తెలియజేశారు

# పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు పూర్తయిన ఏర్పాట్లు

## : మండల విద్యాశాఖ అధికారి వై ప్రభాకర్

మధిర మార్చి 20 (ప్రుదయం ప్రతినిధి):నేటి నుంచి ప్రారంభం కానున్న పదవ తరగతి పబ్లిక్ పరీక్షల నిమిత్తం మధిర పట్టణం లోని 4 పరీక్షా కేంద్రాలు, ప్రభుత్వ ఉన్నత పాఠశాల సిరిపురం పరీక్షా కేంద్రం నందు పరీక్షల నిర్వహణకు కావలసిన ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందని మండల విద్యాశాఖ అధికారి వై ప్రభాకర్ తెలిపారు.



మధిర టౌన్ లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల (సీపీఎస్) నందు 180, టీపీఎం ఉన్నత పాఠశాల నందు 230 మంది, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల నందు 160 మంది, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (హ. వా) నందు 160 మంది ప్రభుత్వ ఉన్నత పాఠశాల సిరిపురం నందు 257 మంది మొత్తంగా మధిర మండలం నుంచి 1049 మంది విద్యార్థులకు పరీక్షలకు హాజరవుతున్నారని తెలిపారు. అన్ని పరీక్షా కేంద్రాలలో త్రాగునీటి వసతి, ఫర్నిచర్, ఏర్పాట్లు చేస్తూ, వైద్య సిబ్బందిని, పరీక్ష నిర్వహణ సిబ్బందిని, పరీక్ష కేంద్రం వద్ద పోలీస్ సిబ్బంది ని నియమించడం జరిగిందని తెలిపారు. ఈ పరీక్షా కేంద్రాలకు చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్మెంటల్ ఆఫీసర్స్ గా తోట నరసింహారావు, మురళీమోహన్, డి వెంకటేశ్వర్లు, విజయశ్రీ, సాధు సమాధానం, కొమ్ము శ్రీను, వెంకట్రావమ్మ, నస్సప్ప, నారాయణ దాస్, వీరయ్య, కస్టోడియన్ ఎస్ కె నాగూర్ వలి, సి సెంటర్ కస్టోడియన్ పోలె సుధాకర్ బాధ్యతలు నిర్వహిస్తున్నారని తెలిపారు. పరీక్షా కేంద్రాలకు విద్యార్థులు అందరూ సకాలంలో చేరుకోవాలని, పరీక్ష ప్రారంభానికి 5 నిముషాల వరకు మాత్రమే లోపలికి అనుమతి ఉంటుందని, ఎటువంటి ఎలక్ట్రానిక్ గాడ్జెట్లు ధరించి రాకూడదని తెలిపారు.

# కరుడుగట్టిన నేరస్తుని పట్టుకున్న కల్వకుర్తి పోలీసులు

**16 తులాల బంగారం 84 తులాల వెండి దొంగలించిన ఒక బైక్ స్వాధీనం**

**కల్వకుర్తి డీఎస్పీ వెంకటేశ్వర్లు**



కల్వకుర్తి మార్చి20(ప్రుదయం ప్రతినిధి): కల్వకుర్తి పట్టణంలోనీ వాసవి నగర్, సుభాష్ నగర్ ఏరియాలో దొంగతనాలుజరిగాయి. అలాగే ఊరుకొండ మండలంలోని ముచ్చల పల్లి గ్రామంలో దొంగతనలు జరిగాయి. ఇందుకుగాను నాగర్ కర్నూల్ జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు కల్వకుర్తి పట్టణంలో స్పెషల్ డ్రైవ్ వెహికల్ చెకింగ్ చేయడం జరిగింది. మంగళవారం రోజు కల్వకుర్తి పట్టణంలోని నాగర్ కర్నూల్ ఎక్స్ రోడ్ లో కల్వకుర్తి సీఐ నాగార్జున ఎస్సైలు మాధవరెడ్డి,కృష్ణదేవ. క్రైమ్ కానిస్టేబుల్ నజీర్. చిరంజీవి. వెహికల్ చెకింగ్ చేస్తుండగా %భ% బైక్ పై ఒక వ్యక్తి పోలీసు వారిని చూసి పారిపోవడానికి ప్రయత్నించగా చాకచక్యంతో పోలీసులు పట్టుకోవడం జరిగింది. అతనిని విచారించగా తన పేరు భాషమౌని సైదులు అని చేసిన నేరాలను ఒప్పుకోవడం జరిగింది.ఇతని వద్ద నుండి 16 తులాల బంగారం 84 తులాల వెండి ఇతడు దొంగతనాలకు ఉపయోగించే బైక్ ఎఫ్ జెడ్ ను స్వాధీనం చేసుకోవడం జరిగింది. ఇతనిపై పలు పోలీస్ స్టేషన్లలో సుమారు 50 నుంచి 60 కేసులు ఉన్నాయి.

ఈ విషయంపై కల్వకుర్తి డి.ఎస్.పి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ భాష మౌని సైదులు పై సుమారు 50 నుండి 60 వరకు కేసులు ఉన్నాయని ఇతను %టి% బైక్ పై తిరుగుతూ కల్వకుర్తిలో వాసవి నగర్, సుభాష్ నగర్ కాలనీలలో పలు దొంగతనాలు చేశాడని ఊరుకొండ మండలం ముచ్చలపల్లి గ్రామంలో దొంగతనం చేశాడని అతని వద్దనుండి 16 తులాల బంగారం 84 తులాల వెండిని అలాగే ఒక ఎఫ్ జెడ్ బైక్ ను స్వాధీన పరుచుకున్నామని నిందితుడిని బుధవారం సాయంత్రం రిమాండ్ కు పంపించడం జరిగిందని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో చాకచక్యం ఉపయోగించిన కల్వకుర్తి సీఐ నాగార్జున. ఎస్ఐ మాధవరెడ్డి. ఊరుకొండ ఎస్సై కృష్ణదేవ. క్రైమ్ కానిస్టేబుల్ నజీర్. చిరంజీవి లను జిల్లా ఎస్పీ నుండి రివార్డులు ఇప్పించడం జరుగుతుందని అన్నారు.

# కుంజ రాము జ్ఞాపకార్థంగా చలి వేంద్రం ప్రారంభం

## చలి వేంద్రాన్ని ప్రారంభించిన మంత్రి సీతక్క

కొత్తగూడ మార్చి 20(ప్రుదయం ప్రతినిధి ): చలివేంద్రం ఏర్పాటు అభినందనీయమని, ఆటసారుల ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్క అన్నారు.గురువారం మండల కేంద్రం లో కుంజ రాము జ్ఞాపకార్థం కుంజ కుసుమాంజలి -సూర్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మంత్రి సీతక్క ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ ఎండల తీవ్రత రోజురోజుకూ పెరిగిపోతున్నదని, నిత్యం పరిసర గ్రామాల నుంచి కొత్తగూడ మండల కేంద్రానికి



వివిధ పనుల కోసం ప్రజలు వస్తుంటారని, వారి దాహార్తిని తీర్చడానికి ఇలాంటి చలివేంద్రాలు ఎంతగానో ఉపయోగ పడతాయని పేర్కొన్నారు. ప్రజలు చలివేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వేసవికాలంలో పెరుగుతున్న ఉష్ణోగ్రతల రీత్యా అత్యవసరమైతే తప్ప ప్రజలు బయటకి రాకూడదని ప్రజలు తగు జాగ్రత్తలు పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు అన్ని గ్రామాల గ్రామ పార్టీ అధ్యక్షులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

# బడుగు బలహీన వర్గాల అభివృద్ధి,ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం.

-రోడ్లు,ఇతర మౌళిక రంగాలను అభివృద్ధి పరుస్తాం.
-ఏజెన్సీలోని మారుమూల గిరిజన ప్రాంతాల అభివృద్ధి సహకరిస్తాం.
-బయ్యారం పెద్ద చెరువుకు పాకాల చెరువు నీరు అందించేందుకు కృషి చేస్తా.
-గార్ల,బయ్యారం మండలాలకు రెండు పంటలకు,సాగు తాగు నీరు అందిస్తాం.
-మంత్రి దనసరి అనసూయ (సీతక్క).





బయ్యారం(ప్రుదయం ప్రతినిధి)మార్చి 20.గురువారం మండలంలో పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు,శంకుస్థాపన కార్యక్రమాలలో ముఖ్యఅతిథిగా మంత్రి సీతక్క పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధిలో రేవంత్ సర్కార్ ముందుందని పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క అన్నారు.మండలంలోని లక్ష్మీనరసిపురం నుండి గౌరారం వెళ్లే రహదారిపై వట్టే వాగుపై బ్రిడ్జి, రోడ్డు నిర్మాణ పనులకు మూడు కోట్ల నిధులు మంజూరు చేసి పనులకు శిలాఫలకం ఆవిష్కరణ చేశారు.గౌరారం నుండి వినోభనగరం,గురిమెల్ల వెళ్లే బీటి రహదారి నిర్మాణానికి ఒక కోటి 80 లక్షల నిధులతో భూమి పూజ చేశారు.దామర చెరువు నుండి కోటగడ్డ కు వెళ్లే ఆర్ అండ్ బి రహదారికి మూడు కోట్ల పదిలక్షల వ్యయంతో పనులు పూర్తయి బీటి రోడ్డు ప్రారంభోత్సవం గావించారు.బయ్యారం నుండి మొట్ల తిమ్మాపురం వెళ్లే రహదారిపై పట్టివాగుపై బ్రిడ్జి నిర్మాణానికి రెండు కోట్ల నిధులతో పనులు గావించి బ్రిడ్జి ప్రారంభోత్సవం గావించారు.మండలంలో సుమారుగా 10 కోట్ల నిధులు వెచ్చించి పనులకు ప్రారంభోత్సవాలు,శిలాఫలకాలను ఆవిష్కరణ చేశారు.ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ బయ్యారం మండలం పూర్తిగా ఏజెన్సీ మండలం రెండు పంటలు పండితేనే కుటుంబాలు,ప్రజలు సుఖ సంతోషాలతో ఉంటారని ఇక్కడ ఒకటే పంట పండటంతో ఇబ్బందులు పడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని ఇట్టిదాని శాసనసభ్యులు కోరం కనకయ్య సహకారంతో దేవాదుల ఎత్తిపోతల ద్వారా నీళ్లు పాకాల చెరువుకు, పాకాల చెరువు నుండి లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా పంది పంపులవాగులో పంపు చేసి ఆ నీరు బయ్యారం చెరువుకు రప్పించి మండలాన్ని అభివృద్ధి పరుస్తామని,రెండు పంటలు పండే విధంగా ఇక్కడ ప్రాంత ప్రజలకు అభివృద్ధి పరిచేందుకు కృషి చేస్తు నా ములుగు నియోజకవర్గంతో పాటు ఇల్లందు నియోజకవర్గ అభివృద్ధికి సహకరిస్తానని హామీ ఇచ్చారు.ఏజెన్సీ గ్రామాలకు రేవంత్ సర్కార్ ఐటీడీఏ నిధులు17వేల కోట్లు వెచ్చించిందని,ఆ నిధులతో ఈ ప్రాంత రోడ్లు,రవాణా సౌకర్యాలు, ఉపాధి కల్పన తదితర అంశాలపై సమగ్ర విచారణ చేసి ఈ ప్రాంతంను అభివృద్ధి సహకరిస్తానని హామీ ఇచ్చారు.ఇందిరమ్మ ఇండ్లు బడుగు బలహీన వర్గాల వారికి అందరికీ ఇందిరమ్మ ఇల్లు వచ్చే విధంగా కృషి చేస్తామని ఎవరు కూడా అధైర్య పడవద్దని వెనకాల ముందు పథకాలు అందరికీ వస్తాయని తెలిపారు.ఒకే వర్గాలలో కూడా కూలి పనులకు వెళ్లే కటిక పేదవారు ఉన్నారని, వారికి కూడా ఇందిరమ్మ ఇల్లు వచ్చే విధంగా కృషి చేస్తామని తెలిపారు.అదే విధంగా మన గిరిజన ప్రాంతాలకు ఐటీడీఏ ల ద్వారా అత్యధిక నిధులు, ఇండ్లు ఇవ్వాలని సీఎం రేవంత్ రెడ్డి ని కోరడంతో వారు అదనపు ఇండ్లు ఇవ్వడానికి ఒప్పుకోవడం జరిగిందని,రాబోయే కాలంలో ప్రతి పేదవాడికి ఇండ్లు వస్తాయని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ పిల్లలకు ఉద్యోగాలు లేక ఇబ్బందులు పడుతున్న తరుణంలో నిరుద్యోగులకు కాంగ్రెస్ ప్రభుత్వం 57వేల ఉద్యోగాలు ఇచ్చిందని,ఇంకా ఉద్యోగాలు రానటువంటి డిగ్రీ,ఇంటర్ చదివిన విద్యార్థులకు రాజీవ్ వికాసం ద్వారా నాలుగు లక్షల రూపాయలు ఇవ్వడం జరుగుతుందని,అర్హులు అందరూ దరఖాస్తులు చేసుకోవాలని ప్రభుత్వం తరఫున సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు.ఏజెన్సీలోని పోడు రైతులకు త్రీఫేస్ కరెంటు అందే విధంగా కృషి చేస్తామని, దానికి తోడు సోలార్ విద్యుత్,పంపు సెట్లను ప్రతి పోడు సాగు రైతులకు అందించే విధంగా తమ వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మండలంలోని తిమ్మాపురం గ్రామానికి నాకు విడదీయరాని సంబంధం ఉందని,రాబోయే రోజుల్లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ శంకుస్థాపనలకు వచ్చి మీ ఆశీర్వాదం తీసుకొని మీతో ముచ్చటిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య,జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్,తహశీల్దార్ బి.విజయ.ఎంపీడీవో విజయలక్ష్మి,బయ్యారం సొసైటీ చైర్మన్ మూల మధుకర్ రెడ్డి,డిఇ చందర్,ఏఈ శ్రీనివాస్,ఆర్ అండ్ బి డిఇ,ఏఇ,పంచాయతీ రాజ్ శాఖ ఈఇ,డిఇ,ఏఇ,జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్, ఆర్డీఓ కృష్ణవేణి, డిఎఆర్ఓ రాజేంద్ర ప్రసాద్,డీఎస్పీ తిరుపతి,సీఐ రవి కుమార్ ఎస్ఐ తిరుపతి,తిరుమల ప్రభాకర్ రెడ్డి,ప్రవీణ్ నాయక్,సూరం సుధాకర్ రెడ్డి, వెంకటపతి,వేల్పుల శ్రీనివాస్,నర్సయ్య,ఇతర ప్రభుత్వ శాఖల అధికారులు,కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# ఎస్రి ఇండియా, ఐఐటిటి నిఫ్ ఐఐటీ తిరుపతిలో జియోస్పేషియల్ ఇన్నోవేషన్ ఎకోసిస్టమ్‌ను బలోపేతం

### ఎస్రి ఇండియా, ఐఐటిటి నిఫ్ ఐఐటీ తిరుపతిలో జియోస్పేషియల్ ఇన్నోవేషన్ ఎకోసిస్టమ్‌ను బలోపేతం

తిరుపతి, 2025 మార్చి 20: 2025 మార్చి 17న ఐఐటీ తిరుపతిలో ప్రధాన అతిథి ప్రొఫెసర్ అభయ్ కరందికర్ (డీఎస్టీ కార్యదర్శి), ప్రొఫెసర్ కె.ఎన్. సత్యనారాయణ (డైరెక్టర్, ఐఐటీ తిరుపతి), మరియు ఎస్రి ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ అజేంద్ర కుమార్ సమక్షంలో కేంద్రాన్ని అధికారికంగా ప్రారంభించారు. జియోస్పేషియల్ విద్య, పరిశోధన, పారిశ్రామిక అనువర్తనాలను ముందుకు తీసుకువెళ్లేందుకు, భారత్‌ను జీఐఎస్ ఆవిష్కరణలో గ్లోబల్ లీడర్‌గా నిలబెట్టేందుకు, ఎస్రి ఇండియా ఐఐటీ తిరుపతి నవవిష్కర్ ఐ-హబ్ ఫౌండేషన్ ఈ కేంద్రం ద్వారా విద్యార్థులు, పరిశోధకులు, స్టార్టప్‌లు ఆధునిక జి ఐ ఎస్ టూల్స్, శిక్షణా మాడ్యూల్స్, వాస్తవ ప్రపంచ అనువర్తనాలకు ప్రాప్తి పొందగలరు. ఈ సహకారం భూవ్యవస్థాపన, పట్టణ ప్రణాళిక, రవాణా, డ్రోన్ ఆధారిత జియోస్పేషియల్ అనలిటిక్స్‌లో కీలక అభివృద్ధులను సాధించడానికి దోహదపడగలదని భావిస్తున్నారు.ప్రొఫెసర్ అభయ్ కరందికర్ మాట్లాడుతూ, "దేశంలో నైపుణ్యంగా ఉన్న జియోస్పేషియల్ వర్క్‌ఫోర్స్‌ను నిర్మించడానికి అకాడమియా పరిశ్రమ మధ్య సహకారాన్ని బలోపేతం చేయడం చాలా అవసరం. ఐఐటీ



తిరుపతిలోని కేంద్రం వంటి కార్యక్రమాలు విద్యార్థులకు సరైన నైపుణ్యాలను అందించి మెరుగైన ఉద్యోగ అవకాశాలను కల్పించడమే కాకుండా, భౌగోళిక సమాచారాన్ని పొందటానికి దేశ నమన్వలను పరిష్కరించగల పరిష్కారాలను అభివృద్ధి చేయడంలో వారికి సహాయపడతాయి" అని తెలిపారు.ప్రొఫెసర్ కె.ఎన్. సత్యనారాయణ, "ఐఐటీ తిరుపతిలో ఈ కేంద్రాన్ని స్థాపించడంలో ఎస్రి ఇండియాతో సహకరించడం మాకు ఎంతో ఆనందం. ఈ భాగస్వామ్యం ద్వారా విద్యార్థులు, స్టార్టప్‌లు, మరియు నిపుణులు అత్యాధునిక జియోస్పేషియల్ టెక్నాలజీలకు ప్రాప్యత పొందగలరు, అజేంద్ర కుమార్, "కేంద్రం ద్వారా కొత్త తరంలోని జియోస్పేషియల్ నిపుణులను అభివృద్ధి చేయడం మా లక్ష్యం. ఉపగ్రహ, డ్రోన్ డేటా, సమీకరణం, ఆధునిక విశ్లేషణలతో సహా జియోస్పేషియల్ టెక్నాలజీ పురోగతితో, ఈ కార్యక్రమం విద్యార్థులు నిపుణులకు అత్యాధునిక నైపుణ్యాలను అందించగలదు. ఈ కార్యక్రమంలో ప్రధాన పరిశ్రమ భాగస్వామ్యాలు, స్టార్టప్ అభివృద్ధి, ఆధునిక పరిశోధనలపై చర్చ జరిగింది. జియోస్పేషియల్ టెక్నాలజీలో పనిచేస్తున్న స్టార్టప్‌లు తమ ఆవిష్కరణలను ప్రదర్శించాయి.

# అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతి కాంగ్రెస్ తోనే సాధ్యం

జయశంకర్ భూపాలపల్లి మార్చి 20(ప్రుదయం ప్రతినిధి) అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని మహదేవపూర్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కోట రాజబాబు అన్నారు. అసెంబ్లీలో బీసీ రిజర్వేషన్, ఎస్సీ వర్గీకరణ బిల్లులకు ఆమోదం తెలిపినందుకు గురువారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అక్బర్ ఖాన్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కోట రాజబాబు ఆధ్వర్యంలో మహదేవపూర్ మండలకేంద్రంలో ని అంబేద్కర్ విగ్రహం వద్ద రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు, చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కోట రాజబాబు మాట్లాడుతూ బీసీ ఎస్సీ రిజర్వేషన్ బిల్లు ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు వెలువడిన గంటవ్యవధిలో సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీలో ప్రకటన చేసి చిత్తశుద్ధి నిరూపించుకున్నారన్నారు. గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు అగ్రనేత రాహుల్ గాంధీ ఇచ్చిన హామీ మేరకు అన్ని వర్గాలకు సమన్యాయం జరిగేలా సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం ప్రజాపాలన కొనసాగిస్తుందన్నారు. ముఖ్యంగా జనాభా దామాషా ప్రకారం బీసీలకు రాజకీయంగా, ఆర్థికంగా జరుగుతున్న అన్యాయాన్ని గుర్తించిన ప్రజా ప్రభుత్వం బీసీ కులగణన నిర్వహించి, బీసీ రిజర్వేషన్లను పెంచేలా అసెంబ్లీలో బిల్లు పెట్టి 42 శాతం రిజర్వేషన్ ఆమోదింపజేయడం ద్వారా యావత్ బీసీ సమాజానికి కాంగ్రెస్ ప్రభుత్వం మేలు చేసింది అన్నారు. మరోవైపు ఎస్సీ వర్గీకరణ పోరాటాన్ని ఆ వర్గ ప్రజల ఆకాంక్షలను గౌరవించి ఎస్సీ వర్గీకరణ బిల్లును అసెంబ్లీలో ఆమోదింపజేసి 30 ఏండ్ల కలను సాకారం చేశారని కొనియాడారు. ఒకే రోజు రెండు చారిత్రాత్మక బిల్లులను అసెంబ్లీ లో ప్రవేశ పెట్టడంతో పాటు నిరుద్యోగ యువతి యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించడానికి రాజీవ్ యువ వికాసం పథకాని ప్రవేశపెట్టడం అభినందనీయమని అన్నారు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన సంవత్సరంలోనే అత్యధిక పథకాలతో రైతులకు గిట్టుబాటు ధర, రెండు



లక్షల పంట రుణమాఫీ, రైతు భరోసా ద్వారా ఎకరానికి సంవత్సరానికి 12000/- రూపాయలు, మహిళలకు ఉచిత బస్ ప్రయాణం, ఉచిత విద్యుత్, 500 రూపాయలకు గ్యాస్ సిలిండర్ ఎన్నో పథకాలతో పేదరిక నిర్మూలన లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ ప్రజా పాలన దూసుకుపోతుంది అని, దేశంలోనే కాంగ్రెస్ పార్టీ ప్రజా పాలన ఆదర్శం అని అన్నారు. అన్ని వర్గాల, కులాల ప్రజలకు సమాన హక్కులు, అవకాశాలు కల్పించడం కాంగ్రెస్ పార్టీ గొప్పతనం అని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు వామనరావు,ఆకుతోట సుధాకర్, ధర్మయ్య, కోట సమ్మయ్య,ఉస్మాన్, ప్రదీప్ రామారావు, వరప్రసాద్, తోటపాటి ప్రజలు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## శ్రీ ముత్యాలమ్మ తల్లి తృతీయ వార్షికోత్సవం లో పాల్గొన్నా మాజీ ఎమ్మెల్యే తాటి



మార్చి 20 దమ్మపేట, (వుదయం ప్రతినిధి ): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం పార్కలగండి గ్రామం లో ఆలయ కమిటీ సభ్యులు కాకా శివ శంకర్ ప్రసాద్ ఆహ్వానం మేరకు పార్కలగండి గ్రామం లో నాభిశిల( బోడ్రాయి,గ్రామ దేవత( ముత్యాలమ్మ) అమ్మ వారి తృతీయ వార్షికోత్సవనికి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించిన బూర్గంపహాడ్,అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే తెలంగాణ రాష్ట్ర మాజీ ట్రైకర్ చైర్మన్ తాటి వెంకటేశ్వర్లు, ఈ సందర్భంగా తాడి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ముత్యాలమ్మ తల్లి వార్షికోత్సవం నిర్వహిస్తున్న నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలియజేశారు అదేవిధంగా అమ్మవారి దయ నియోజవర్గ ప్రజలందరిపై ఉండి అందరూ సుఖ సంతోషాలతో సుభిక్షంగా ఉండాలని ఆయన కోరారు ఈ కార్యక్రమం లో పద్దం.అశోక్ ,కీసరి రమేష్ ,కొండ్రు రంగా , సోయం సురేష్ ,కుర్సం గంగరాజు, మరియు తధితరులు పాల్గొన్నారు

## విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

-మంచిగా చదువుకొని ఉన్నత శిఖరాలను చేరాలి

-మేడిపల్లి జడ్పీ హెచ్ ఎస్ పాఠశాల లో నిర్వహించిన డ్రగ్స్ అండ్ సైబర్ అవగాహన కార్యక్రమం లో సి ఐ గోవింద్ రెడ్డి




మేడిపల్లి వుదయం ప్రతినిధి మార్చి 20.మేడిపల్లి మండల కేంద్రం లోని జడ్పీ హెచ్ ఎస్ పాఠశాల విద్యార్థులకు మేడిపల్లి సి ఐ గోవింద్ రెడ్డి ఆధ్వర్యంలో డ్రగ్స్ అండ్ సైబర్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సి ఐ గోవింద్ రెడ్డి మాట్లాడుతూ....విద్యార్థులు చెడు వ్యాసనాలకు దూరంగా ఉండాలని, మంచిగా చదువుకొని ఉన్నత శిఖరాలను చేరాలని ఆకాంక్షించారు. నేటి విద్యార్థులపై అనేక రకాల చెడు వ్యసనాలు ప్రభావం చూపుతున్నాయని ముఖ్యంగా డ్రగ్స్ వాడకం, గంజాయి, సిగరెట్, మొబైల్ దుర్వినియోగం లాంటి వ్యసనాలు, పరిసర ప్రాంతాల్లో కొంతమంది చెడు వ్యక్తులతో తిరగడం మూలంగా బానిసలుగా మారే అవకాశం ఉందన్నారు. కావున విద్యార్థులు చట్టాలపై అవగాహన కల్గి ఉండి నేరాల జోలికి వెళ్లి జీవితాలను నాశనం చేసుకోవద్దని తెలిపారు. ఈ కార్యక్రమం లో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎల్. సత్యప్రసాద్ మాట్లాడుతూ....పోలీస్ యంత్రాంగం చెప్పినట్లుగా చెడు వ్యసనాలకు, చెడు స్నేహితులకు దూరంగా ఉంటూ చక్కటి విద్యాబుద్ధులు నేర్చుకొని పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకొని రావాలని విద్యార్థులను కోరారు. ఈ కార్యక్రమం లో ఎస్ ఐ కృష్ణారావు,పోలీస్ సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## పదో తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి

సంగారెడ్డి, మార్చి20(వుదయం ప్రతినిధి): జిల్లాలో ఈనెల 21 నుంచి ఏప్రిల్ నాల్గవ తేదీ వరకు జరిగే పదవ తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు తెలిపారు. సంగారెడ్డి లోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో పరీక్షా కేంద్రాన్ని గురువారం పరిశీలించారు. పరీక్ష ఉదయం 9: 30 నుంచి మధ్యాహ్నం 12: 30 గంటల వరకు జరుగుతుందని చెప్పారు. పరీక్ష ప్రారంభమైన ఐదు నిమిషాల వరకు మాత్రమే విద్యార్థులను అనుమతిస్తామని పేర్కొన్నారు.

### గ్రామాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి: ఎమ్మెల్యే

జహీరాబాద్, మార్చి20(వుదయం ప్రతినిధి): గ్రామాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి అన్నారు. మండలం గట్టు లింగంపల్లి గ్రామంలో రూ 3. 50 కోట్లతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను గురువారం ప్రారంభించారు. రోడ్డు నిర్మాణం వల్ల గ్రామస్తులకు ఉపయోగంగా ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో రాజు, శ్రీకాంత్, నాయకులు పాల్గొన్నారు.

## పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి



పెద్దపల్లి జిల్లా: కాల్వ శ్రీరాంపూర్, మార్చి 20 (వుదయం) ప్రతినిధి: కాల్వ శ్రీరాంపూర్ మండలంలో నేటి నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 212 మంది, కూనారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 59 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. మొత్తం 271 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారని మండల విద్యాధికారి సిరిమల్ల మహేష్ తెలిపారు.పరీక్షా కేంద్రాల్లో పోలీసు భద్రత, మెడికల్, మంచినీటి సౌకర్యాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. విద్యార్థులు సకాలంలో హాజరు కావాలని సూచించారు.

## ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య



పెద్దపల్లి జిల్లా: మార్చి 20(వుదయం) ప్రతినిధి: కాల్వ శ్రీరాంపూర్ మండలం లోని ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని సౌకర్యాలతో పాటు ఉచిత నాణ్యమైన విద్యను అందిస్తున్నామని, తల్లిదండ్రులు తమ పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ఈర్ల సమ్మయ్య సూచించారు. ఊషన్నపల్లి ఇంగ్లీష్ మీడియం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో గురువారం భోజన విరామ సమయంలో ఒకటో తరగతి విద్యార్థి రిషి కీర్తన్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈర్ల సమ్మయ్య ఉపాధ్యాయులతో కలిసి రిషి కీర్తన్‌కు స్వీట్లు తినిపించి ఆశీర్వదించారు. అనంతరం మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలకు కృత్యాధార, కాన్సెప్ట్ బేస్డ్ విద్యను అందిస్తున్నామన్నారు. క్షేత్ర పరిశీలనలు, ప్రయోగాలు చేయిస్తూ శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందిస్తున్నామని తెలిపారు. తల్లిదండ్రులు ప్రైవేట్ విద్యాసంస్థల్లో డబ్బును వృథా చేయకుండా, ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అమృత సురేష్ కుమార్, కొనుకటి శ్రీవాణి, విద్యార్థులు పాల్గొన్నారు.

## లే అవుట్ లను క్షేత్ర స్థాయిలో పరిశీలించిన కలెక్టర్ బి.ఎమ్.సంతోష్



అలంపూర్ మార్చి 20 (వుదయం ప్రతినిధి) లే అవుట్ల అభివృద్ధి ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ఉండేలా కార్యాచరణ రూపొందించి, సమర్ధవంతంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ బి.యం.సంతోష్ అధికారులను ఆదేశించారు. గురువారం అయిజ మున్సిపల్ పరిధిలోని సర్వే నంబర్లు 751,957 ప్రాంతాల్లో లే అవుట్లను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రాంతాల్లో లేఅవుట్‌ను స్వయంగా పరిశీలించిన కలెక్టర్, నీటి వనరుల అభివృద్ధి, అప్రోచ్ రోడ్డు ఏర్పాటు, విద్యుత్ సరఫరా, డ్రెయినేజ్ కనెక్షన్లను సమగ్రంగా అందుబాటులోకి తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. లేఅవుట్‌కు సంబంధించిన భూమిని పర్యవేక్షించి, ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా మంజూరు ప్రణాళికను సిద్ధం చేసి, అభివృద్ధి పనులను పూర్తి స్థాయిలో వేగంగా, సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత, పారదర్శకత పాటిస్తూ, ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను అందుబాటు లోకి తీసుకొచ్చేలా చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఈఈ శ్రీనివాస రావు, మున్సిపల్ కమిషనర్ రాజయ్య, టౌన్ ప్లానింగ్ అధికారి కుర్మన్న, తహసీల్దార్లు జ్యోతి, టిపిఒ వరప్రసాద్, ఎ.ఈ లు, తదితరులు పాల్గొన్నారు.

## మార్చి 27న మధిర బార్ అసోసియేషన్ ఎన్నికలు



మధిర,మార్చి20(వుదయం ప్రతినిధి) మధిర బార్ అసోసియేషన్ కు మార్చి 27 న ఎన్నికలు. మధిర బార్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నికలకు గాను గురువారం నామినేషన్ల ప్రక్రియ పూర్తయ్యింది. నామినేషన్ల దాఖలు అనంతర%శీ% అధ్యక్ష పదవికి బోజెడ్ల పుల్లారావు,పల్లపోతుల కృష్ణారావు మధ్య పోటీ కొనసాగుతోంది. మిగిలిన నాలుగు స్థానాలకు ప్రధాన కార్యదర్శిగా జింకల రమేష్, ఉపాధ్యక్షులుగా గంధం శ్రీనివాసరావు,సంయుక్త కార్యదర్శిగా భైరవభట్ల రమణరావు,కోశాధికారిగా కాకాణి విజయ్ కుమార్ ఏకగ్రీవం గా ఎంపికయ్యారు.అధ్యక్ష పదవికి ఎన్నిక మార్చి 27 తేదీన ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు జరుగుతుందని , తదనంతర పలితాలు ప్రకటిస్తామని ఎన్నికల అధికారి తెల్లూరి వెంకట్రావు తెలిపారు.

## రేవంత్ రెడ్డికి రాబోయే స్థానిక ఎన్నికల్లో గుణపాఠం తప్పదు....

అంబేద్కర్ యువజన సంఘం...



చంద్రుగొండ, మార్చి20(వుదయం ప్రతినిధి): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ శాసనసభలో బిల్లు ఆమోదం తెలిపిన అంశంపై అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు ఇల్లంగి.బాలకృష్ణ, బేతి. నాగబాబులు మాట్లాడుతూ షెడ్యూల్డ్ కులాల వర్గీకరణ క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు ఏర్పాటుచేసిన షమీం అఖ్తర్ కమిషన్ ఏ గ్రామం కూడా క్షేత్రస్థాయిలో పరిశీలించకుండా రిపోర్టును రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వడం దారుణమని, రేవంత్ రెడ్డి బిజెపి, ఆర్ఎస్ఎస్ కనుసన్నల్లో పనిచేస్తున్నారని వారికి స్థానిక ఎన్నికల్లో మాలలు గట్టి గుణపాఠం చెప్తారని, షెడ్యూల్డ్ కులాల వర్గీకరణ చేసే హక్కు రాష్ట్రాలకు లేదని అది పార్లమెంటుకు మాత్రమే ఉందని, వర్గీకరణకు మద్దతు పార్టీలకు గుణపాఠం తప్పదని, ఉత్తర భారత దేశంలో వర్గీకరణ అంశంపై మందకృష్ణ ఎందుకు మాట్లాడడం లేదని, రాజ్యాంగ రక్షణ కోసం మాలలు ఎంతవరకైనా పోరాటం కొనసాగిస్తారని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం మండల బాధ్యులు ఎలమందల. లక్ష్మణ్, దాసరి. క్రాంతి, దాసరి. సతీష్, బేతి. వంశీకృష్ణ, పానం.నరేందర్, బేతి. బాబు, దాసరి. రాజు, పిల్లి. తంబి రాజ్, పిల్లి. వెంకటేష్, మద్దెల. క్రాంతి కుమార్ బడుగు.సీతారాములు రాయి.రాజా తదితరులు పాల్గొన్నారు...

## "కెటీఆర్" ను కలిసిన కెవిఆర్



తుంగతుర్తి/ శాలిగౌరారం, మార్చి 20, (వుదయం ప్రతినిధి): రాష్ట్ర వ్యాప్త బిఆర్ఎస్ పార్టీ ప్రచార పర్యటనలో భాగంగా బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ "కెటిఆర్" గురువారం రోజు సూర్యాపేట జిల్లా కేంద్రానికి వచ్చారు. ఈ సందర్భంగా నల్లగొండ జిల్లా, శాలిగౌరారం మండల బిఆర్ఎస్ పార్టీ మాజీ అధ్యక్షుడు కట్ట వెంకట్ రెడ్డి(కె వి ఆర్),బిఆర్ఎస్ అగ్ర నాయకులు, కార్యకర్తలు తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్ కుమార్ తో కలిసి కేటీఆర్ ను కలిశారు.

## కలెక్టర్ ఆదేశాలతో ఓఆర్ఎస్ఎల్ ప్యాకెట్లు పంపిణీ చేసిన ఎంపీడీవో వెంకటేశ్వర్లు



కొండపాక మార్చి20(వుదయం ప్రతినిధి): సిద్దిపేట జిల్లా కలెక్టర్ ఆదేశాలతో ఉపాధి హామీ పథకం లో జరుగుతున్న పనులను మండల వ్యాప్తంగా పలు గ్రామాలలో క్షేత్రస్థాయిలోపరిశీలిస్తు కూలీలకు తగు సూచనలు ఇస్తున్నారు కొండపాక ఎంపీడీవో వెంకటేశ్వర్లు. దీనిలో భాగంగా గురువారం రోజు వెలికట్ట గ్రామ రైతు పురుషోత్తం పొలంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులు జరుగుతున్న ప్రదేశానికి వెళ్లి ఎండ తీవ్రత నుండి ఉపశమనం పొందడానికి ఉపాధి హామీ కూలీలకు ఓఆర్ఎస్ఎల్ ప్యాకెట్లను అందించాడు, ఎండల తీవ్రత చాలా ఎక్కువగా ఉన్నందున సరైన ముందు జాగ్రత్తలు తీసుకుంటూ పనులు చేయవలసిందిగా కోరాడు, పథకంలో భాగంగా 100 రోజులు నిండిన ప్రతి ఒక్కరికి మస్టర్లు నమోదు చేసుకుంటూ సరైన రికార్డు మైంటైన్ చెయ్యాలని, పనులు జరుగుతున్న ప్రదేశాల్లో ముందుగానే తాగునీరు లాంటి కనీస అవసరాలు సమకూర్చుకోవాలని, చేసే ప్రతి పని రైతులకు పనికొచ్చేలా, భూమి చదునుతోపాటు ఏవైనా ముఖ్యమైన పనులు కావాలనుకున్నప్పుడు నా దృష్టికి తీసుకొస్తే వాటి అమలుకు నేను సహకరిస్తానని తెలిపాడు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి నరసింహులు, టి ఏ నాగార్జున, ఫీల్డ్ అసిస్టెంట్ ప్రభాకర్, భర్మ కొమరయ్య పాల్గొన్నారు

## దమ్మపేట పోలీస్ ఆధ్వర్యంలో నాగుపల్లిలో కార్డెన్ అండ్ సేర్చ్





మార్చి 20 దమ్మపేట, (వుదయం ప్రతినిధి): దమ్మపేట పోలీస్ వారి ఆధ్వర్యంలో నాగుపల్లి గ్రామంలో కార్డెన్ అండ్ సెర్చ్ నిర్వహించడం జరిగింది. ఈ యొక్క కార్డెన్ సెర్చ్ కార్యక్రమంలో దమ్మపేట మరియు అశ్వరావుపేట పోలీస్ సిబ్బంది అందరూ పాల్గొనడం జరిగింది. ఈ ఈ యొక్క కార్డెన్ సెర్చ్ లో ఎటువంటి సరైన ధ్రువపత్రాలు లేని 32 ద్విచక్ర వాహనాలును సీజ్ చేయడం జరిగింది . ఈ సందర్భంగా దమ్మపేట ఎస్సై సాయి కిషోర్ రెడ్డి మాట్లాడుతూ గంజాయి గుట్కా వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, ముఖ్యంగా యువత చదువులు పట్ల శ్రద్ధ చూపించి ఉన్నత ఉద్యోగాలు పొందాలని సూచించడం జరిగింది. అలాగే నాగుపల్లి గ్రామస్తులకు వారి గ్రామాల్లో ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు ఎవరైనా వస్తే పోలీస్ వారికి తెలియజేయమని చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో దమ్మపేట అశ్వరావుపేట పోలీస్ సిబ్బంది పాల్గొనడం జరిగింది

## బడ్జెట్లో గల్ఫ్ కార్మికులకు తీరని అన్యాయం



జన్నారం,మార్చ్ 20(వుదయం విలేకరి) బడ్జెట్‌లో గల్ఫ్ కార్మికుల సంక్షేమం కోసం ఎటువంటి నిధులను కేటాయించకపోవడం తీవ్ర నిరాశ కలిగించిందని గల్ఫ్ కార్మికుల సంక్షేమ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు కల్లెడ భూమయ్య తెలిపారు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో ప్రభుత్వం తన మేనిఫెస్టోలో గల్ఫ్ కార్మికుల సంక్షేమం నిధితోపాటు గల్ఫ్ బోర్డును ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చినప్పటికీ, ఇప్పుడు ఆ దిశగా ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం బాధాకరం అన్నారు. గల్ఫ్ దేశాల్లో కష్టపడి సంపాదిస్తూ తమ కుటుంబాలను పోషిస్తున్న వేలాది మంది కార్మికులు ఎన్నో సమస్యలను ఎదుర్కొంటున్నారు. వారి సంక్షేమం కోసం ప్రత్యేక గల్ఫ్ బోర్డును ఏర్పాటు చేసి, అవసరమైన నిధులను కేటాయించాలి. కానీ, తాజా బడ్జెట్‌లో దీనికి ప్రాధాన్యత ఇవ్వకపోవడం దురదృష్టకరం అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల గల్ఫ్ దేశాల్లో మృతిచెందిన కార్మికుల కుటుంబాలకు ఐదు లక్షల ఎక్స్గ్రేషియా ప్రకటించినందుకు తెలంగాణ గల్ఫ్ కార్మికుల సంక్షేమ సమితి స్వాగతం పలికిందని అన్నారు.
ప్రభుత్వం వెంటనే ఈ విషయాన్ని పునఃపరిశీలించి, గల్ఫ్ కార్మికుల హక్కులను పరిరక్షించేలా తగిన చర్యలు తీసుకోవాలి. లేకపోతే, తెలంగాణ గల్ఫ్ కార్మికుల సంక్షేమ సమితి, గల్ఫ్ జేఏసీ తో కలసి పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామన్నారు.

## మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ ధ్యేయం

– దేవాదాయ అటవీ శాఖ మంత్రి కొండ సురేఖ



వరంగల్, మార్చి 20(వుదయం జిల్లా ప్రతినిధి) :కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుందని దేవాదాయ అటవీ శాఖ మంత్రి కొండ సురేఖ అన్నారు. వరంగల్ నగరంలోని దేశాయిపేట ప్రాంతంలో మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని నూతనంగా నిర్మించిన వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్ ని మంత్రి కొండా సురేఖ ప్రారంభించారు. కార్యక్రమంలో వర్ధన్నపేట శాసనసభ్యులు కేఆర్ నాగరాజు, నగర మేయర్ గుండు సుధారాణి, వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారద, కార్పొరేటర్లు కావటి కవిత రాజు యాదవ్, సురేష్ జోషి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసి న సమావేశంలో రాష్ట్ర మంత్రి కొండ సురేఖ మాట్లాడుతూ కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాట్లు చేసిందన్నారు. మహిళలకు అనేక సంక్షేమ పథకాలు అమ లు చేస్తున్న ఘనత రాష్ట్ర ప్రభుత్వానికే దక్కుతుందని మంత్రి కొండ సురేఖ తెలిపారు. సమావేశంలో పాల్గొన్న సంక్షే మ పథకాల లబ్ధిదారులు కడార్ల రాణి, జన్నుకమల లు మంత్రిని ఘనంగా సత్కరించారు.

## వుదయం వార్తకు స్పందన



మెదక్, ( 2025 మార్చ్ 20 వుదయం ప్రతినిధి : బుధవారం రోజున ప్రార్థన నిర్వహించిన ఉపాధ్యాయులు అనే శీర్షికతో వచ్చిన వార్తకు మెదక్ జిల్లా విద్యాధికారి రాధా కిషన్ స్పందించారు. ఈ సందర్భంగా మెదక్ జిల్లా విద్యాధికారి రాధా కిషన్ మాట్లాడుతూ... మెదక్ జిల్లా వ్యాప్తంగా ఉపాధ్యాయులందరూ కూడా ఖచ్చితంగా సమయపాలన పాటించాలన్నారు.
ఉదయం 7:45 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు విధులకు హాజరుకావాలని సూచించారు. లేనిపక్షంలో చర్యలు తప్పవు అన్నారు.

## వుదయం వార్తకు స్పందన



మెదక్, ( 2025 మార్చ్ 20 వుదయం ప్రతినిధి : వల్లూరు అడవిలో 2 ఆవుల ఆవుల కళేబరాలు అనే శీర్షికతో బుధవారం రోజున వచ్చిన వార్తకు అటవీ శాఖ అధికారులు స్పందించారు. అటవీ ప్రాంతంలోని ఆవు కళేబరాలను అటవీశాఖ అధికారులు తొలగించారు. ఈ సందర్భంగా రామాయంపేట ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ విద్యాసాగర్ మాట్లాడుతూ... అటవీ ప్రాంతంలో ఎవరైనా కూడా మాంసం, కళేబరాలను వేసినట్లు గుర్తిస్తే శాఖ పర్యమైన చర్యలు తీసుకుంటామన్నారు.




# బిజినెస్






## ఇండియాను బలోపేతం చేయడంలో భాగమవుతున్న పతంజలి!

పతంజలి ఆయుర్వేదం భారతీయ ఆరోగ్య రంగాన్ని విప్లవం చేసి, ప్రపంచ స్థాయిలో గుర్తింపు పొందింది. స్వావలంబన, సమగ్ర ఆరోగ్యంపై దృష్టి సారించి, దేశీయ ఉత్పత్తులను ప్రోత్సహిస్తోంది. ఆయుర్వేద పరిశోధన, టెలిమెడిసిన్ వంటి ఆధునిక సాంకేతికతలను ఉపయోగిస్తూ, భారతదేశ అభివృద్ధి లక్ష్యాలను సాధించడంలో కీలక పాత్ర పోషిస్తోంది. పతంజలి ఆయుర్వేదం భారతీయ వెల్‌నెస్ పరిశ్రమలో కొత్త విప్లవాన్ని తీసుకువచ్చింది. ఆయుర్వేదాన్ని ఆధునిక శాస్త్రంతో జతచేయడంతో ప్రపంచవ్యాప్త గుర్తింపును పొందింది. యోగా గురువు స్వామి రామ్‌దేవ్, ఆచార్య బాలకృష్ణ నాయకత్వంలో, పతంజలి ఆరోగ్యం, ప్రకృతివైద్య రంగంలో కొత్త కోణాలను స్థాపించడమే కాకుండా, స్వావలంబన భారతదేశాన్ని సృష్టించడంలో కూడా ఒక ముఖ్యమైన సహకారాన్ని అందించింది. పతంజలి ఆయుర్వేద భవిష్యత్తు ప్రణాళికలు స్వావలంబన, సమగ్ర ఆరోగ్యం, ఆవిష్కరణ మరియు భారతదేశాన్ని బలమైన, ఆరోగ్యకరమైన దేశంగా మార్చడానికి ప్రపంచ విస్తరణపై దృష్టి సారించాయి. పతంజలి ఆయుర్వేదం తన ప్రపంచవ్యాప్తంగా విస్తరణ ద్వారా ప్రాచీన భారతీయ వైద్య విధానాన్ని ప్రపంచవ్యాప్తంగా ప్రాచుర్యం పొందేలా చేస్తోంది. అమెరికా, యూరప్, ఆఫ్రికా, ఆసియాకు తన ఉత్పత్తుల ఎగుమతిని పెంచడం ద్వారా, పతంజలి అంతర్జాతీయ మార్కెట్లలో స్వదేశీ ఉత్పత్తులకు డిమాండ్‌ను బలోపేతం చేసింది. ఆన్‌లైన్ ప్లాట్‌ఫారమ్‌లు, అంతర్జాతీయ భాగస్వామ్యాలను ఉపయోగించి కంపెనీ తన ఉత్పత్తులను ప్రపంచవ్యాప్తంగా అందుబాటులో ఉంచింది. దీనితో పాటు, యోగా ఆయుర్వేద పరిశోధన కేంద్రాలను స్థాపించడం ద్వారా, పతంజలి ఆయుర్వేదాన్ని ప్రపంచ ఆరోగ్య వ్యవస్థలో ప్రభావవంతమైన వైద్య వ్యవస్థగా ఏర్పాటు చేస్తోంది.

పతంజలి భవిష్యత్తు ప్రణాళికల్లో స్వావలంబన, సంపూర్ణ ఆరోగ్యంపై దృష్టి సారించింది. పతంజలి ఆయుర్వేదం రైతులు, మూలికా ఉత్పత్తిదారులు, స్థానిక చేతివృత్తులవారికి మద్దతు ఇవ్వడం ద్వారా దేశీయ ఉత్పత్తిని ప్రోత్సహిస్తోంది. తద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తోంది. యోగా, సహజ జీవనశైలి, సమతుల్య పోషకాహారాన్ని ప్రోత్సహించడం ద్వారా, పతంజలి సమగ్ర ఆరోగ్య నమూనాను అభివృద్ధి చేస్తోంది. దీనితో పాటు, ఆయుర్వేద పరిశోధన, శాస్త్రీయ ఆధారాల ద్వారా దాని ఉత్పత్తుల నాణ్యత, ప్రభావం మరింత బలోపేతం అవుతోంది. ఆయుర్వేద ఉత్పత్తులను ఆధునిక శాస్త్రంతో జతచేయడంతో వాటి ప్రభావాన్ని పెంచడానికి పతంజలి తన తదుపరి వ్యాపార అధ్యాయంలో రిసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్‌కి ప్రాధాన్యత ఇస్తోంది. టెలిమెడిసిన్, డిజిటల్ హెల్త్‌కేర్, బయోటెక్నాలజీ, పర్యావరణ అనుకూల ఉత్పత్తి ప్రక్రియల ద్వారా ఆరోగ్య సంరక్షణను మరింత ప్రభావవంతంగా అందుబాటులోకి తెస్తోంది.

## శంషాబాద్ వద్ద AQI మానిటరింగ్ స్టేషన్‌ను ప్రారంభించిన స్టోన్‌క్రాఫ్ట్ గ్రూప్

బయోఫిలిక్, పర్యావరణ అనుకూల రియల్ ఎస్టేట్‌లో మార్గదర్శక సంస్థ అయిన స్టోన్‌క్రాఫ్ట్ గ్రూప్, ఉడ్స్ శంషాబాద్ వద్ద తమ విప్లవాత్మకమైన AQI (ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్) మానిటరింగ్ స్టేషన్‌ను ప్రారంభించింది. ఈ కార్యక్రమం పర్యావరణ పరిరక్షణ పట్ల కంపెనీ యొక్క స్థిరమైన నిబద్ధతను , పర్యావరణ స్పృహతో కూడిన ప్రాంగణాలను సృష్టించాలనే దాని లక్ష్యాన్ని నొక్కి చెబుతుంది. ఈ కార్యక్రమంలో స్లోవేనియా రిపబ్లిక్ రాయబారి మాటేజా వోడెబ్ ఘోష్, స్లోవేనియా రిపబ్లిక్ ఆర్థిక సలహాదారు శ్రీమతి టీ పిరిహ్, జీహెచ్ఎంసి అర్బన్ బయోడైవర్సిటీ వింగ్ అదనపు కమిషనర్ శ్రీమతి వివిఎల్ సుభద్రా దేవి (ఐఎఫ్ఎస్) మరియు భారత ప్రభుత్వ మాజీ అదనపు కార్యదర్శి శ్రీ అశోక్ పవాడియా సహా సుప్రసిద్ధ నిపుణులు మరియు మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్, సమాజ ప్రయోజనం కోసం గాలి నాణ్యతను పర్యవేక్షించడంలో స్టోన్‌క్రాఫ్ట్ గ్రూప్ యొక్క అంకితభావాన్ని వెల్లడించటమే కాకుండా పర్యావరణ స్థిరత్వం గురించి అవగాహన పెంచడానికి ఉత్ప్రేరకంగా కూడా నిలుస్తుంది. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో భాగంగా రిబ్బన్ కటింగ్ తో పాటుగా ప్రారంభోత్సవ ప్రతీకగా చెట్లను నాటడం, ప్రాజెక్ట్ యొక్క విస్తృత ప్రభావాలను చర్చించడానికి అనుసంధానిత మీడియా సమావేశం వంటి అర్థవంతమైన కార్యక్రమాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో స్లోవేనియా రిపబ్లిక్ రాయబారి మతేజా వోడెబ్ ఘోష్ పర్యావరణ అనుకూల కార్యక్రమాల యొక్క ప్రపంచ ప్రాముఖ్యతను నొక్కి చెబుతూ, "ప్రభుత్వాలు, NGO , కార్పొరేట్లు లేదా వ్యాపారాలు, ఎవరైనా సరే , గాలి నాణ్యతను మెరుగుపరచడం , పర్యావరణ పరిరక్షణను ప్రోత్సహించడం కోసం సమిష్టిగా పనిచేయడం



చాలా అవసరం. శ్రీ కీర్తి చిలుకూరి నేతృత్వంలోని స్టోన్‌క్రాఫ్ట్ గ్రూప్ వంటి రియల్ ఎస్టేట్ డెవలపర్‌లు టౌన్ ప్లానర్లు, ఆర్కిటెక్ట్‌లపై కీలక బాధ్యత ఉంది. పర్యావరణపరంగా స్థిరమైన మరియు శుభ్రమైన గాలి , ప్రభావ వంతమైన లైటింగ్ వచ్చేలా వెంటిలేషన్ ఉన్న ప్రదేశాలను నిర్మించడంలో వారి పాత్ర చాలా కీలకం. పర్యావరణ అనుకూల భవనాలు స్వచ్ఛమైన నీటి వనరులను ఉపయోగించాలి. వాటర్ హార్వెస్టింగ్ మరియు రీసైక్లింగ్ ప్రయత్నాలను చేయాలి , పునరుత్పాదక శక్తిని ఉపయోగించుకోవాలి. ప్రపంచవ్యాప్తంగా, మనం ఇటువంటి వినూత్న ప్రాజెక్టులను ఇప్పుడు చూస్తున్నాము. %ూాు×% మానిటరింగ్ స్టేషన్ వంటి ప్రభావవంతమైన ప్రాజెక్టులతో స్టోన్‌క్రాఫ్ట్ గ్రూప్ వంటి కంపెనీలు పర్యావరణ పరిరక్షణ సమర్థిస్తున్నట్లు చూడటం స్ఫూర్తిదాయకం. పర్యావరణ సవాళ్లను ఎదుర్కోవడానికి అంతర్జాతీయ సహకారం చాలా ముఖ్యమైనది మరియు ఈ కార్యక్రమం ఇతరులు అనుసరించడానికి ఒక వెలుగు రేఖలా పనిచేస్తుందని ఆశిస్తున్నాను. ఈ ప్రయత్నాలను మనం వేడుక జరుపుకోవాలి" అని అన్నారు.

## భారత వృద్ధి 6.5 శాతమే..!




వచ్చే ఆర్థిక సంవత్సరం (2025-26)లో భారత వృద్ధి రేటు 6.5 శాతానికే పరిమితం కావొచ్చని ప్రముఖ రేటింగ్ ఏజెన్సీ ఫిచ్ అంచనా వేసింది. ప్రస్తుత 2024-25లో 6.3 శాతంగా ఉండొచ్చని పేర్కొంది. 2026-27లో 6.3 శాతానికి తగ్గొచ్చని విశ్లేషించింది. అమెరికా వాణిజ్య విధానాలు ప్రధాన సవాళ్లుగా నిలువనున్నాయని పేర్కొంది. వినియోగదారుల విశ్వాసం తగ్గిందని పేర్కొంది. దీంతో వాహన అమ్మకాల్లో తగ్గుదల చోటు చేసుకుంటున్న విషయాన్ని ఫిచ్ గుర్తు చేసింది. 2024-25లో భారత జిడిపి 6.4 శాతానికి పరిమితం కావొచ్చని ఇటీవల ఎన్ఎస్ఒ అంచనా వేసింది. ఇది నాలుగేళ్లలోనే అత్యంత కనిష్ట స్థాయి.

ఇంతక్రితం 2023-24లో జిడిపి 8.2 శాతం పెరిగింది. 2024-25లో 6.6 శాతం వృద్ధి ఉండొచ్చని ఆర్‌బిఐ ఇటీవల అంచనా వేసింది. దీంతో పోల్చితే ఫిచ్ తాజా అంచనాలు మరింత ఆందోళన కలిగించే అంశం. ఆర్థిక వ్యవస్థలోని మందగమనం ఆర్థిక కార్యకలాపాలను దెబ్బతీయనుందని స్పష్టమవుతోంది.

## పరుగులు పెడుతున్న పసిడి ధరలు..



బులియన్ మార్కెట్‌లో బంగారం, వెండి ధరలు పరుగులు పెడుతున్నాయి. కనీవినీ ఎరుగని రీతిలో పసిడి ధరలు పెరిగి ఆల్ టైం హైకి చేరుకున్నాయి.. స్వచ్ఛమైన బంగారం ధర 90 మార్క్ దాటగా.. కిలో వెండి ధర లక్షా 15వేలకు చేరువైంది.. వాస్తవానికి మార్కెట్‌లో పసిడి, వెండికి ఎప్పుడూ డిమాండే ఉంటుంది. బులియన్ మార్కెట్‌లో బంగారం, వెండి ధరలు పరుగులు పెడుతున్నాయి. కనీవినీ ఎరుగని రీతిలో పసిడి ధరలు పెరిగి ఆల్ టైం హైకి చేరుకున్నాయి.. స్వచ్ఛమైన బంగారం ధర 90 మార్క్ దాటగా.. కిలో వెండి ధర లక్షా 15వేలకు చేరువైంది.. వాస్తవానికి మార్కెట్‌లో పసిడి, వెండికి ఎప్పుడూ డిమాండే ఉంటుంది. అంతర్జాతీయంగా జరుగుతున్న పరిణామాల ప్రకారం బంగారం, వెండి ధరల్లో ఎప్పటికప్పుడు మార్పులు, చేర్పులు జరుగుతుంటాయి.. ఒక్కోసారి ధరలు పెరిగితే, మరికొన్నిసార్లు తగ్గుతుంటాయి.. తాజాగా.. బంగారం, వెండి ధరలు స్వల్పంగా పెరిగాయి.. 20 మార్చి 2025 గురువారం ఉదయం ఆరు గంటల వరకు పలు వెబ్‌సైట్లలో నమోదైన ధరల ప్రకారం.. 22 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.82,910, 24 క్యారెట్ల పది గ్రాముల గోల్డ్ ధర రూ.90,450 గా ఉంది. వెండి కిలో ధర రూ.1,05,100 గా ఉంది. 10గ్రాముల బంగారంపై రూ.10, కిలో వెండిపై రూ.100 మేర ధర పెరిగింది.

హైదరాబాద్‌లో 22 క్యారెట్ల బంగారం ధర రూ.82,910, 24 క్యారెట్ల ధర రూ.90,450 గా ఉంది. విశాఖపట్నం, విజయవాడ నగరాల్లో 22 క్యారెట్ల బంగారం ధర రూ.82,910, 24 క్యారెట్ల ధర రూ.90,450. ఢిల్లీలో 10 గ్రాముల 22 క్యారెట్ల పసిడి ధర రూ.83,060, 24 క్యారెట్ల ధర రూ.90,600 గా ఉంది. ముంబైలో 22 క్యారెట్ల ధర రూ.82,910, 24 క్యారెట్ల ధర రూ.90,450 గా ఉంది. చెన్నైలో 22 క్యారెట్ల ధర రూ.82,910, 24 క్యారెట్ల రేటు రూ.90,450 గా ఉంది. బెంగళూరులో 22 క్యారెట్ల ధర రూ.82,910, 24 క్యారెట్ల ధర రూ.90,450 గా ఉంది.

## 3 రోజుల్లో రూ.14 లక్షల కోట్ల లాభం

ఈక్విటీ సూచీలు వరుసగా మూడో రోజూ లాభపడ్డాయి. బుధవారం ట్రేడింగ్‌లో సెన్సెక్స్ ఒకదశలో 267 పాయింట్ల మేర పుంజుకున్నప్పటికీ, చివరికి 147.79 పాయింట్ల లాభంతో 75,449.05 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 73.30 పాయింట్ల వృద్ధితో 22,907.60 వద్ద ముగిసింది. కన్స్యూమర్ డ్యూరబుల్స్, కేపిటల్ గూడ్స్, రియల్టీ షేర్లలో మదుపరులు కొనుగోళ్లు పెంచడంతోపాటు విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు మళ్లీ



మన మార్కెట్లో పెట్టుబడులు పెడుతుండటం ఇందుకు దోహదపడింది. గడిచిన మూడు ట్రేడింగ్ సెషన్లలో సెన్సెక్స్ 1,620.14 పాయింట్లు (2.19 శాతం) పుంజుకుంది. మూడు రోజుల ర్యాలీలో బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రూ.13.82 లక్షల కోట్లు పెరిగి రూ.405.01 లక్షల కోట్లకు (4.68 లక్షల కోట్ల డాలర్లు) చేరింది. బీఎస్ఈ మార్కెట్ క్యాప్ మళ్లీ రూ.400 లక్షల కోట్ల మైలురాయిని దాటడం దాదాపు నెల రోజుల తర్వాత ఇదే మొదటిసారి.

## తిరుపతిలో స్టోర్‌ను ప్రారంభించిన రివర్




స్టోర్ యొక్క సౌందర్యం లో ప్రధాన ఆకర్షణగా ఇండీ నిలుస్తుంది. మన రోజువారీ జీవితంలో ఇండీ ఎలా మిళితం అవుతుందో వర్ణిస్తూ అత్యంత జాగ్రత్తగా రూపొందించిన ప్రాంగణం ఇది . ఈ కథనం నది యొక్క తత్వానికి అనుగుణంగా ఉంటుంది. బెంగళూరుకు చెందిన ఎలక్ట్రిక్ స్కూటర్ తయారీ సంస్థ రివర్, తిరుపతిలో తమ స్టోర్‌ను ప్రారంభించింది. రివర్ స్టోర్ కస్టమర్‌లకు ఇండీ, యాక్సెసరీలు మరియు మర్చండైజ్ తో సహా అన్ని రివర్ ఉత్పత్తుల శ్రేణిని ప్రత్యక్షంగా చూసే అవకాశం అందిస్తుంది. దాదాపు 829 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉన్న రివర్ స్టోర్ రేణిగుంట రోడ్డు లో సాస్త ఆటోమోటివ్ భాగస్వామ్యంతో ప్రారంభించబడింది. తిరుపతిలోని ఈ స్టోర్ ఉత్సాహపూరితమైన వాతావరణాన్ని కలిగి ఉంది. నదీ ప్రవాహాన్ని గుర్తుకు తెచ్చే 'ఫ్లో లైన్లు' తో బ్రాండ్ యొక్క సౌందర్యాన్ని ప్రదర్శించడానికి వైవిధ్యంగా రూపొందించబడింది. స్టోర్ యొక్క సౌందర్యం లో ప్రధాన ఆకర్షణగా ఇండీ నిలుస్తుంది. మన రోజువారీ జీవితంలో ఇండీ ఎలా మిళితం అవుతుందో వర్ణిస్తూ అత్యంత జాగ్రత్తగా రూపొందించిన ప్రాంగణం ఇది . ఈ కథనం నది యొక్క తత్వానికి అనుగుణంగా ఉంటుంది. ప్రజలను వారు ఎక్కడ నుండి వచ్చారో మరియు వారు ఉండాలనుకుంటున్నారో అక్కడికి తీసుకువెళుతుంది. గత ఏడాది డిసెంబర్‌లో విశాఖపట్నంలో స్టోర్‌ను ప్రారంభించడంతో రివర్ ఆంధ్రప్రదేశ్‌లోకి ప్రవేశించింది. ఈ కంపెనీ ప్రస్తుతం బెంగళూరు, హైదరాబాద్, చెన్నై, హుబ్లీ, విశాఖపట్నం, కొచ్చి, కోయంబత్తూరు మరియు మైసూరులో 13 అవుట్‌లెట్‌లను నిర్వహిస్తోంది. రాబోయే కొద్ది వారాల్లో రివర్ తమ కార్యకలాపాలను త్రివేండ్రం, వెల్లూరు, తిరుపూర్, బెల్గాం మరియు పూణేలకు విస్తరించనుంది. మార్చి 2025 చివరి నాటికి, భారతదేశం అంతటా 25 స్టోర్లను తెరవాలని రివర్ ప్రణాళిక సిద్ధం చేసింది. ఇండీ ధర రూ1,42,999 (ఎక్స్-షోరూమ్, తిరుపతి).

కస్టమర్‌లు టెస్ట్ రైడ్‌ల కోసం స్టోర్‌ని సందర్శించవచ్చు, మర్చండైజ్ ను బ్రౌజ్ చేయవచ్చు లేదా ఇండీని బుక్ చేసుకోవచ్చు.



# జాతీయం - అంతర్జాతీయం



## ఉచితాలపై సభ చర్చించాల్సిన అవసరం ఉంది



ఉచితాలు, సబ్సిడీలపై సభలో పకడ్బందీ చర్చ జరగాలని ఉప రాష్ట్రపతి, రాజ్యసభ చైర్మన్ జగ్దీప్ ధన్‌ఖడ్ బుధవారం అభిప్రాయం వ్యక్తం చేశారు. ప్రభుత్వ పెట్టుబడులు అన్నిటినీ విస్తృత శ్రేయస్సుకు దోహదపడేలా ఒక జాతీయ విధానాన్ని రూపొందించవలసిన తక్షణ అవసరం ఉందని ఆయన సూచించారు. అభివృద్ధి ప్రాజెక్టులు, పథకాల కోసం పార్లమెంట్ సభ్యుల వద్ద నిధులను ప్రస్తుత ఐదు కోట్ల రూపాయల నుంచి ఏడాదికి రూ. 20 కోట్లకు పెంచాలని జీరో అవర్‌లో సమాజ్‌వాది పార్టీ (ఎస్‌పి) సభ్యుడు రామ్‌గోపాల్ యాదవ్ చేసిన అభ్యర్థనకు ధన్‌ఖడ్ స్పందిస్తూ, ప్రభుత్వం, ప్రతిపక్షం అంగీకరించినట్లయితే ఈ అంశంపై పకడ్బందీ చర్చకు తాను సుముఖుడినేనని చెప్పారు. ఉచిత విద్యుత్, నీరు, సబ్సిడీ ధరకు వంట గ్యాస్ సరఫరా, రైతులు, మహిళలు వంటి కొన్ని బృందాలకు నగదు పంపిణీ వంటి ఎన్నికల ఉచితాల ప్రకటనను ప్రభుత్వంపై ఆర్థిక భారాలు మోపుతాయని, ప్రభుత్వ వనరులను దుర్వినియోగం చేస్తాయని, దీర్ఘకాలిక అభివృద్ధి లక్ష్యాలకు హానికరమని తరచు విమర్శలు వస్తున్న విషయం విదితమే. 'ఉచితాలుగా తరచు పేర్కొంటున్న సంతృప్తిపరచే విషయాలపై ఈ సభ చర్చించవలసిన అగత్యం ఉంది. సభా నాయకుని,

ప్రతిపక్ష నాయకుని సంప్రదించిన తరువాత పకడ్బందీ చర్చకు నేను సుముఖుడిని' అని సభాధ్యక్షుడు చెప్పారు. మూలధన వ్యయానికి ద్రవ్యం అందుబాటులో ఉన్నప్పుడే దేశం వృద్ధి చెందుతుందని ఆయన అన్నారు. 'ఎన్నికల ప్రక్రియ ఎలా ఉందంటే ఇవి వోటర్లను ప్రలోభపెట్టేవిగా మారాయి.



## డొనాల్డ్ ట్రంప్ సంచలన నిర్ణయం

వాషింగ్టన్ : అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన నిర్ణయం తీసుకోనున్నారు. విద్యా శాఖను మూసివేసేందుకు రంగం సిద్ధం చేశారు. ఈ మేరకు గురువారం విద్యా శాఖను మూసివేయాలని లక్ష్యంగా పెట్టుకున్న ఒక కార్యనిర్వాహక ఉత్తర్వుపై ట్రంప్ సంతకం చేస్తారని, ఇది కీలకమైన ప్రచార హామీని నెరవేరుస్తుందని వైట్ హౌస్ ఒక ఫ్యాక్ట్ షీట్‌లో తెలిపింది. విద్యా శాఖను మూసివేయడానికి, విద్యా అధికారాన్ని రాష్ట్రాలకు తిరిగి ఇవ్వడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని విద్యా కార్యదర్శి లిండా మెక్‌మహోన్‌ను ఆదేశిస్తున్నట్లు ఉత్తర్వులో పేర్కొన్నారు. ప్రభావవంతంగా, అంతరాయం లేని సేవలు, కార్యక్రమాలు, ప్రయోజనాల కొనసాగించాలని ఉత్తర్వులో పేర్కొన్నారు. ఈ చర్యను డెమోక్రటిక్ రాష్ట్ర అటార్నీ జనరల్ బృందం ఇప్పటికే సవాలు చేసింది. విద్యా శాఖను ట్రంప్ కూల్చివేయకుండా నిరోధించాలని, గత వారం సిబ్బందిలో దాదాపు సగం మందిని తొలగించడాన్ని నిలిపివేయాలని కోరుతూ వారు దావా వేశారు.

## చర్చలకు ఇంకా అవకాశాలు వున్నాయి



గాజా : గాజావ్యాప్తంగా ఇజ్రాయిల్ మళ్ళీ దాడులు మొదలుపెట్టినా తాము చర్చలకు ద్వారాలు మూసివేయలేదని హమాస్ పేర్కొంది. సంతకాలు చేసిన ఒప్పందం అమల్లో వుండగా, కొత్త ఒప్పందాలు చేయాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. కాగా 'ఇది కేవలం ప్రారంభం మాత్రమే'నని ఇజ్రాయిల్ ప్రధాని బెంజామిన్ నెతన్యాహు వ్యాఖ్యానించారు. కాల్పుల విరమణకు ఉద్దేశించిన చర్చలన్నీ ఇక కాల్పుల మధ్యనే జరుగుతాయని తేల్చి చెప్పారు. మంగళవారం తెల్లవారు జామునుండి మళ్ళీ ప్రారంభించిన వైమానిక దాడుల్లో ఇప్పటివరకు 436మంది మరణించారు. వీరిలో 183మంది చిన్నారులు కాగా, 125మంది పురుషులు, 94మంది మహిళలు, 34మంది వృద్ధులని పాలస్తీనా ఆరోగ్య శాఖ వర్గాలు తెలిపాయి. బుధవారం 29మంది మరణించారని ఆ వర్గాలు చెప్పాయి. ఇదిలావుండగా, జెరూసలేంలోని నెతన్యాహు నివాసం దిశగా వేలాదిమంది ఇజ్రాయిలీలు ప్రదర్శన నిర్వహించారు. యుద్ధం మళ్ళీ ప్రారంభమవడాన్ని వారు తీవ్రంగా ఖండించారు. మరింతమంది వీధుల్లోకి రావాల్సిందిగా ప్రతిపక్ష నేత యార్ లపిడ్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఇజ్రాయిల్ వైఖరిని ఫ్రాన్స్ అధ్యక్షుడు మాక్రాన్ తీవ్రంగా ఖండించారు. గాజాపై దాడులను 'నాటకీయమైన వెనుకంజ చర్య' అని వ్యాఖ్యానించారు. మరోసారి గాజా ప్రజలను దుర్భరమైన బాంబు దాడుల్లో ముంచెత్తడమేనని పేర్కొన్నారు. తక్షణమే కాల్పుల విరమణను అమలు చేయాల్సిన అవసరం ఎంతైనా వుందన్నారు. అంతర్జాతీయ నాయకత్వం ఆధ్వర్యంలో అన్ని పక్షాలు చర్చలు జరపడం ముఖ్యమని చెప్పారు. మరోవైపు గాజాలో కాల్పుల విరమణను పునరుద్ధరించేందుకు అంతర్జాతీయ చొరవ కావాలని జోర్డాన్ రాజు అబ్దుల్లా 2 పేర్కొన్నారు. ఇజ్రాయిల్ దాడులు, మొత్తంగా ఆంక్షలు ఇవన్నీ కలిసి వేలాదిమంది ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారాయని అన్నారు. అంతర్జాతీయ సమాజం తక్షణమే స్పందించి, ఈ విషయంలో చొరవ తీసుకోవాలని కోరారు. రాజకీయ పరిష్కారమొక్కటే శాంతి స్థాపనకు దారి తీస్తుందని, ఈ ప్రాంతంలో ఇజ్రాయిలీలు, పాలస్తీనియన్లకు హామీ కల్పించగలిగేది రెండు దేశాల ఏర్పాటు మాత్రమేనని స్పష్టం చేశారు.

# ఏప్రిల్ 16న ఇసిల

## నియామకంపై పిటిషన్ల విచారణ



2023 చట్టం కింద ప్రధాన ఎన్నికల కమిషనర్ (సిఇసి), ఎన్నికల కమిషనర్ (ఇసి)ల నియామకాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లను ఏప్రిల్ 16న విచారించేందుకు సుప్రీం కోర్టు బుధవారం నిర్ణయించింది. ఈ కేసు జాబితాలో 38వ నంబర్‌తో ఉందని, ఆ క్రమంలో బుధవారం విచారణకు వచ్చే అవకాశం లేదని న్యాయవాది ప్రశాంత్ భూషణ్ చెప్పిన మీదట పిటిషన్ల విచారణకు ఏప్రిల్ 16ను న్యాయమూర్తులు సూర్యకాంత్, ఎన్ కోటీశ్వర్ సింగ్‌తో కూడిన ధర్మాసనం నిర్ధారించింది. ఈ వ్యవహారాన్ని సత్వరం విచారించవలసిందిగా ప్రశాంత్ భూషణ్ విజ్ఞప్తి చేశారు. ఇది ప్రజాస్వామ్య మూలంలోకి వెళుతుందని, 2023 రాజ్యాంగ ధర్మాసనం తీర్పు దీనికి వర్తిస్తున్నదని ఆయన వాదించారు. ఈ వాదనలు అన్నిటినీ కోర్టు అర్థం చేసుకుంటున్నదని, కానీ ప్రతి రోజు విచారించవలసిన జాబితాలో అత్యవసర విషయాలు అనేకం ఉన్నాయని జస్టిస్ కాంత్ తెలిపారు. 'మేము దీనిని ఏప్రిల్ 16కు నిర్ధారిస్తాం. దాని వల్ల కేసును అంతిమంగా విచారించగలం' అని బెంచ్ తెలియజేసింది. ప్రధాని, ప్రతిపక్ష నాయకుడు, భారత ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ)తో కూడిన కమిటీ ద్వారా సిఇసి, ఇసిల నియామకం కోసం2023 రాజ్యాంగ ధర్మాసనం తీర్పును పాటించాలా లేక కమిటీలో నుంచి సిజెఐని మినహాయించిన 2023 చట్టాన్ని అనుసరించాలా అన్న స్వల్ప చట్టపరమైన ప్రశ్న ఇందులో ఇమిడి ఉందని పిటిషనర్ ఎన్‌జిఒ ప్రజాస్వామ్య సంస్కరణల సంస్థ (ఎడిఆర్) తరఫున హాజరైన ప్రశాంత్ భూషణ్ తెలిపారు. 2023 చట్టం కింద సిఇసి, ఇసిల నియామకానికి వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్లను 'ప్రాధాన్య ప్రాతిపదిక'పై తాము చేపడతామని ఫిబ్రవరి 18న సర్వోన్నత న్యాయస్థానం తెలియజేసింది. 2023 చట్టం కింద కొత్త సిఇసి, ఇసి నియామకం ద్వారా ప్రభుత్వం 'ప్రజాస్వామ్యాన్ని ప్రహసనప్రాయం' చేసిందని ప్రశాంత్ భూషణ్ ఆరోపించారు. ప్రభుత్వం ఫిబ్రవరి 17న ఇసి జ్ఞానేశ్ కుమార్‌ను సిఇసిగా నియమించింది. జ్ఞానేశ్ కుమార్ కొత్త చట్టం కింద నియుక్తుడైన తొలి సిఇసి.

## 30 రోజుల కాల్పుల విరమణకు సిద్ధం !



వాషింగ్టన్ : ఉక్రెయిన్‌లో యుద్ధాన్ని నివారించేందుకు, ఆ ఘర్షణలకు శాంతియుత పరిష్కారాన్ని కనుగొనేందుకు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో అమెరికా అగ్ర నేత ట్రంప్ చేసిన ఫోన్ కాల్ సుదీర్ఘంగా సాగింది. రెండు గంటలకు పైగా సాగిన ఈ పోన్ సంభాషణల్లో 30రోజుల కాల్పుల విరమణ ప్రతిపాదన, సముద్ర జలాల భద్రత, ఖైదీల మార్పిడి వంటి పలు అంశాలపై సుదీర్ఘంగా చర్చించినట్లు క్రెమ్లిన్ తెలిపింది. ట్రంప్ ప్రతిపాదనలకు పుతిన్ సానుకూలంగా స్పందించారు. 30రోజుల పాటు ఇంధన సదుపాయాలపై దాడులు చేయకుండా ఇరు పక్షాలు సంయమనం పాటించాలని ట్రంప్ ప్రతిపాదించారు. ఇందుకోసం ఉభయపక్షాలు పరస్పర ఒప్పందం కుదుర్చుకోవాలన్నారు. ఈ చొరవను పుతిన్ స్వాగతించారు. తక్షణమే వాటికి అనుగుణంగా చర్యలు తీసుకోవాల్సిందిగా రష్యా మిలటరీని ఆదేశించారు. అమెరికా,రష్యా సంబంధాలను సాధారణ స్థాయికి తీసుకురావడంపై ఇరువురు నేతలు ఆసక్తి కనబరిచారు. అంతర్జాతీయ భద్రత, ఆర్థిక సహకారం వంటి అంశాలపై చర్చలు కొనసాగించేందుకు అంగీకరించారు. ఉక్రెయిన్ ఘర్షణలకు శాంతియుత పరిష్కారానికి తన నిబద్ధతను పుతిన్ పునరుద్ఘాటించారని క్రెమ్లిన్ ప్రచురించిన ప్రకటన తెలిపింది. కూలంకషమైన, సమగ్రమైన పరిష్కారం కోసం అమెరికా భాగస్వాములతో కలిసి పనిచేయడానికి పుతిన్ సంసిద్ధత వ్యక్తం చేశారని ఆ ప్రకటన పేర్కొంది. రష్యాకు గల చట్టబద్ధమైన భద్రతా ప్రయోజాలను పరిగణనలోకి తీసుకుంటూనే ఈ సంక్షోభానికి మూల కారణాలను పరిష్కరించేలా, స్థిరమైన, దీర్ఘకాలిక ఒప్పందం వుండాలని పుతిన్ నొక్కి చెప్పారు. 30రోజుల కాల్పుల విరమణ గురించి ప్రస్తావిస్తూ, తమ కీలకమైన ఆందోళనలను రష్యా పక్షం వివరించింది. కదనరంగం పొడవునా కాల్పుల విరమణ పర్యవేక్షణకు సమర్థవంతమైన యంత్రాంగం వుండాలని, ఉక్రెయిన్‌లో బలవంతంగా సమీకరణలను నిలుపుచేయాలని, వారి సైన్యానికి తిరిగి ఆయుధాలు సమకూర్చే చర్యలను ఆపు చేయాలని కోరింది. ఉక్రెయిన్‌కు విదేశీ మిలటరీ సాయం పూర్తిగా ఆగిపోవాలని, అలాగే ఉక్రెయిన్‌తోనిఘా సమాచారం పంచుకోవడం నిలిచిపోవాలని స్పష్టం చేసింది. పరిస్థితులు పెచ్చరిల్లకుండా నివారించాలంటే ఇది కీలకమైన షరతని నొక్కి చెప్పింది.

## దేశ రహస్యాలు చేరవేత.. ఇద్దరి అరెస్ట్

కాన్పూర్: పాకిస్థాన్‌కు చెందిన గూఢచర్య సంస్థ ఐఎస్‌ఐకి దేశ రక్షణ రహస్యాలు చేరవేస్తున్నడన్న ఆరోపణలపై కాన్పుర్ ఆర్డినెన్స్ ఫ్యాకర్టీ ఉద్యోగులను ఎటిఎస్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలో జూనియర్ వర్క్ మేనేజర్‌గా చేస్తున్న కుమార్ వికాస్ పాకిస్థాన్‌కు చెందిన ఏజెంట్‌తో కుట్ర చేస్తున్నట్లు సమాచారం తెలుసుకొని అతన్ని అదుపులోకి తీసుకున్నారు. 2025 జనవరిలో పాకిస్థాన్‌కు చెందిన ఓ ఏజెంట్ నేహాశర్మ పేరుతో అతనితో ఫేస్‌బుక్ పరిచయం ఏర్పడింది. తాను భారత్ హెవీ ఎలక్ట్రికల్ లిమిటెడ్(బిహెచ్ఇఎల్) ఉద్యోగి అని పరిచయం చేసుకుంది. తమ కంపెనీకి చెందిన సున్నిత విషయాలను చెప్పాలని.. అందుకు డబ్బులు కూడా ఇస్తానని ఆశ చూపింది. అంతేకాక.. అతనికి వలపు వల విసిరింది.

దీంతో అతను లూడో అనే గేమ్ సహాయంతో ఆమెకు సమాచారం అందించడం ప్రారంభించాడు. సున్నితమైన పత్రాలు, మందుగుండు సామాగ్రి ఉత్పత్తికి సంబంధించిన డేటా, పరికరాల వివరాలు, ఉద్యోగుల సమాచారం వంటివి లీక్ చేశాడు. లీక్ చేసిన సమాచారం వల్ల భారతదేశ ఐక్యత, సమగ్రత, సార్వభౌమత్వం తీవ్రంగా దెబ్బతినే ప్రమాదం ఉంది. జాతీయ భద్రతకు ముప్పు వాటిల్లే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఇదే నేహాశర్మకు సమాచారం అందిస్తున్న పెరోజాబాద్‌కి చెందిన ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ మెకానిక్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇతనికి కూడా నేహాశర్మ అనే వ్యక్తి ఫేస్‌బుక్‌లో పరిచయం అయిందని అనంతరం అతనికి వలపు వల విసిరి దేశ రక్షణ రంగానికి సంబంధించిన రహస్య సమాచారాన్ని, లేఖలను తీసుకున్నట్లు తెలిపారు. ఇందులో గగన్‌యాన్ ప్రాజెక్టుకు సంబంధించిన వివరాలు కూడా ఉన్నట్లు పేర్కొన్నారు.



## సిసిటివి కెమెరాల ప్రాజెక్టులో రూ.7కోట్లు లంచం

అమ్ ఆద్మీపార్టీ నేత, గతంలో పబ్లిక్ వర్క్స్ శాఖమంత్రి సత్యేంద్ర జైన్ పై అవినీతి నిరోధక శాఖ లంచానికి పాల్పడ్డారని కేసు పెట్టింది. రూ. 571 కోట్ల రూపాయల సిసిటివి కెమెరాల ప్రాజెక్టు కేసులో సత్యేంద్ర జైన్ అవినీతికి పాల్పడ్డారని కేసు నమోదైంది. ఢిల్లీ వ్యాప్తంగా సిసిటివి కెమెరాల ఏర్పాటులో జాప్యం చేసినందుకు భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ కు విధించిన రూ. 16 కోట్ల రూపాయల జరిమానాను సత్యేంద్ర జైన్ రద్దు చేశారని,అందుకు బదులుగా ఏడు కోట్ల రూపాయలు లంచం అందుకున్నారని, ఆవిధంగా ఆయన కాంట్రాక్టర్లకు ప్రయోజనం కల్గించారని కేసు నమోదయింది. అవినీతి నిరోధకచట్టం సెక్షన్ 7, సెక్షన్ 13(1) (ఏ) కింద , ఇండియన్ పీనల్ కోడ్ సెక్షన్ 120(బి) కింద క్రిమినల్ కుట్రకు పాల్పడినట్లు ఎఫ్ ఐ ఆర్ దాఖలైంది. ఏసీబీ జాయింట్ కమిషనర్ మాధుర్ వర్మ ఈ విషయాన్ని వెల్లడించారు. సిసిటివి కెమెరాలను ఏర్పాటు చేయడంలో జరిగిన జాప్యానికి బిఇఎల్ కు 16 కోట్ల రూపాయల జరిమానాను రద్దు చేసినందుకు ఆయనకు రూ.7 కోట్లు లంచంగా అందిందని అన్నారు. ప్రాజెక్టులో విపరీతమైన జాప్యం జరిగినా,అదనంగా మరో లక్షా 40 వేల సిసిటివి కెమెరాలను ఏర్పాటు చేసేందుకు కాంట్రాక్ట్ ను పొడిగించారని ఏసీబీ పేర్కొంది. ఈ స్కామ్ వెనుక ప్రధాన సూత్రధారి సత్యేంద జైన్ అని ఢిల్లీ బీజేపీ చీఫ్ వీరేంద్ సచ్ దేవ ఆరోపించారు.

## బీజాపూర్‌లో ఎదురుకాల్పులు

రాయ్‌పూర్: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్-దంతెవాడ జిల్లాల్లో గురువారం ఉదయం ఎన్‌కౌంటర్ జరిగింది. మావోయిస్టులు, భద్రతా బలగాల మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో ఇద్దరు మావోయిస్టులు మృతి చెందగా ఒక జవాన్ అమరడయ్యాడు. బీజాపూర్ జిల్లాలోని గంగలూరు అటవీ ప్రాంతంలో మావోయిస్టులు సంచరిస్తున్నారని సమాచారం రావడంతో పెద్ద ఎత్తున భద్రతా బలగాలను తరలించామని ఎస్‌పి జితేంద్రయాదవ్ తెలిపారు. భద్రతా బలగాల రాకను గమనించిన మావోయిస్టులు తొలుత కాల్పులు జరపాని, దీంతో భద్రత బలగాలు ఎదురు కాల్పులు జరిపాయని వివరించారు. ఎదురుకాల్పుల్లో ఇద్దరు మావోలు దుర్మరణం చెందగా ఒక జవాన్ మృతి చెందాడన్నారు. ఘటనా స్థలం నుంచి పెద్ద ఎత్తున మావోయిస్టులు పారిపోయారని వెల్లడించారు. ఘటనా స్థలంలో మందు గుండు సామాగ్రి, ఎకె 47, తుపాకులను స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. నారాయణపూర్ జిల్లాలో ఐఇడి పేలడంతో ఒక జవాన్ గాయపడినట్లు సమాచారం.



## జమ్మూ కశ్మీర్‌లో 17 మంది మరణాల మిస్టరీ

జమ్మూ కశ్మీర్ లోని రజౌరీ జిల్లాలోని బధాల్ గ్రామంలో అనూహ్యంగా 17 మంది చనిపోవడం కలకలం రేపింది. ఆ గ్రామస్తుల శరీరంలో ఆరు రకాల విషాలను కనుగొన్నట్లు దేశం వివిధ ప్రాంతాలలోని వైద్య పరిశోధన సంస్థలు పేర్కొన్నాయి. ఆ గ్రామస్తుల మృతదేహాల పోస్ట్ మార్టం, ఆ ప్రాంతం వారు భుజించిన ఆహార పదార్థాల శాంపిల్స్ ను పరీక్షించి ఈ నిర్ధారణకు వచ్చాయి. కాగా, ఆ విషం ఎలా వచ్చిందో.. ఎవరు ఇచ్చారో నిగ్గుతేల్చేందుకుసీబీఐ విచారణ జరిపించాలని జమ్మూకశ్మీర్ శాసనసభ్యులు డిమాండ్ చేశారు. గ్రామస్తుల మరణాలకు బాక్టీరియా లేదా వైరల్ పరమైన అంటువ్యాధులు కారణం కాదని, క్లినికల్ నివేదికలు, ప్రయోగశాల పరిశోధనల్లో స్పష్టమైనట్లు ఆరోగ్య మంత్రి సకీనా ఇటూ అసెంబ్లీలో తెలిపారు. చండీగఢ్ వైద్య సంస్థ మృతులలో అల్యూమినియం, కాడ్మియం వంటి రసాయనాలు ఉన్నట్లు తెలిపిందని ఆమె అన్నారు. కాగా, లక్నోలోని వైద్యపరిశోధన సంస్థ అల్జికార్బ్ సల్ఫేట్, ఎసిడామప్రిడ్ , డైథైల్డి థియో కార్బమేట్, క్లోర్పెనా పైర్ వంటి రసాయనాలను కనుగొన్నట్లు తెలిపింది.

## గూఢచర్యంపై చైనాలో ఒక రీసెర్చర్‌కు మరణ శిక్ష

ఒక రీసర్చ్ సంస్థలో ఒక చైనీస్ ఇంజనీర్‌కు విదేశీ వేగు సంస్థలకు రహస్య సమాచారం విక్రయించినందుకు మరణ శిక్ష విధించినట్లు చైనా స్టేట్ సెక్యూరిటీ మంత్రిత్వశాఖ బుధవారం వెల్లడించింది. రీసర్చ్ సంస్థకు చెందిన ఇంజనీర్ లియూ విదేశీ సంస్థలకు నిఘా సమాచారం విక్రయానికి 'పక్కా ప్రణాళిక'తో పని చేసినట్లు మంత్రిత్వశాఖ వ్యాసాన్ని ఉటంకిస్తూ అధికార మీడియా తెలియజేసింది. చైనా జాతీయ భద్రత అధికారులు గూఢచర్యం కేసు గుట్టు రట్టు చేశారు. ఈ కేసులో లియూ అక్రమంగా ప్రభుత్వ రహస్యాలను కాపీ చేసి, విదేశీ వేగు సంస్థలకు విక్రయించాడు. లియూ గూఢచర్యం సాగించి, అక్రమంగా ప్రభుత్వ రహస్యాలను విక్రయించినందుకు దోషిగా నిర్ధారించి జీవితాంతం రాజకీయ హక్కులు లేకుండా మరణ శిక్ష విధించినట్లు మంత్రిత్వశాఖ వ్యాసాన్ని ఉటంకిస్తూ ప్రభుత్వ ఆధ్వర్యంలోని 'గ్లోబల్ టైమ్స్' తెలియజేసింది. తన పట్ల అన్యాయంగా వ్యవహరించి, పదోన్నతులు నిరాకరించారని విశ్వసించిన తరువాత లియూలో నిరసన భావన చోటు చేసుకున్నదని, రాజీనామా చేసే ముందు అతను ప్రతీకార దృక్పథంతో,

బ్లాక్‌మెయిల్ చేయాలనే తలంపుతో భారీ స్థాయిలో రహస్య సమాచారాన్ని గోప్యంగా కాపీ చేశాడని ఆ వ్యాసం వివరించింది.

# చక్కని ఆరోగ్యం

## ఖాళీ కడుపుతో వీటిని తినడం ఎంత డేంజరో తెలుసా..?

రాత్రి పన్నెండు గంటలు ఖాళీ కడుపుతో ఉండటం అంటే మన శరీరం దాదాపు రాత్రంతా ఉపవాసం ఉన్నట్టే. తరువాతి రోజును రిఫ్రెషింగ్ గా స్టార్ట్ చేయాలంటే మన జీవక్రియలకు అవసరమైనంత శక్తి లభించాల్సిందే.అందుకే మనం రోజును ఏం తిని మొదలు పెడుతున్నామనేది చాలా ముఖ్యం. కొన్ని రకాల ఆహారాలు ఖాళీ కడుపుతో తినకుండా ఉండటం మంచిదని ఆహార నిపుణులు సూచిస్తున్నారు.

ఎందుకంటే అవి ఎన్నో రకాల ఆరోగ్య సమస్యలను కలిగిస్తాయంటున్నారు. ఖాళీ కడుపు ఆమ్లాలను కలిగి ఉంటుంది. ఇవి జీర్ణాశయంలోని సున్నితమైన పొరను చికాకు పరుస్తాయి. ప్రోటీన్, ఆరోగ్యకరమైన కొవ్వులు ఫైబర్ కలిగిన సమతుల అల్పాహారం తిన్నప్పుడే రక్తంలో చక్కెర స్థాయిలను బ్యాలెన్స్ చేస్తుంది. మనం రోజంతా ఫోకస్ గా ఉండేందుకు ఉదయం అంతా స్థిరమైన శక్తిని అందించడానికి సహాయపడుతుంది. అయితే, బ్రేక్ ఫాస్ట్ లో ఈ కొన్ని ఆహార పదార్థాలను తీసుకోవచ్చు. మరికొన్ని తీసుకోకూడదట. ఖాళీ కడుపుతో గోరువెచ్చని నిమ్మకాయ నీరు త్రాగడం వల్ల మీ జీవక్రియను ప్రారంభించడానిక చక్కని మార్గం. ఇది మీ జీర్ణక్రియను మెరుగుపడుతుంది. ఓట్ మీల్ ఫైబర్ కు గొప్ప మూలం. ఉదయం అంతా కడుపు నిండిన అనుభూతిని కలిగిస్తుంది.గ్రీకు పెరుగులో ప్రోటీన్, ప్రోబయోటిక్స్ అధికంగా ఉంటాయి, ఇది పేగు ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో సహాయపడుతుంది. గుడ్లు ప్రోటీన్ తో పాటు మరెన్నో అవసరమైన పోషకాలతో నిండి ఉంటాయి. ఇవి కడుపునింపడంతో పాటుగా



పోషకాలతో కూడిన అల్పాహారంగా పనిచేస్తాయి. గ్రీన్ టీలో యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. జీవక్రియను పెంచడానికి కొవ్వును కరిగించడానికి సహాయపడతాయి. బెర్రీలు కేలరీలు తక్కువగా మరియు ఫైబర్ అధికంగా ఉంటాయి, ఇవి బరువు నిర్వహణకు గొప్ప ఎంపికగా చేస్తాయి. బాదం పప్పులు ఆరోగ్యకరమైన కొవ్వులు, ప్రోటీన్ ఫైబర్ కు ఇది మంచి మూలం. ఇవి ఖాళీ కడుపుతో సంతృప్తికరమైన చిరుతిండిగా చేస్తాయి. చియా గింజలు ఒమేగా-3 కొవ్వు ఆమ్లాలు ఫైబర్ కు మంచి సోర్స్ గా పనిచేస్తాయి.

ఇవి మీ ఉదయం దినచర్యకు పోషకాలను జోడిస్తుంది. ఖాళీ కడుపుతో కాఫీ తాగడం వల్ల కడుపులో యాసిడ్ ఉత్పత్తి పెరుగుతుంది. కొంతమందికి అసౌకర్యం కలుగుతుంది. కారంగా ఉండే ఆహారాలు కడుపు పొరను చికాకుపరుస్తాయి. యాసిడ్ రిఫ్లక్స్ లేదా అజీర్ణానికి దారితీస్తాయి. సిట్రస్ పండ్లు యాసిడ్లను కలిగి ఉంటాయి.ఖాళీ కడుపుతో వీటిని తింటే కడుపులో చికాకు కలిగిస్తాయి. కార్బోనేటేడ్ పానీయాలు, ముఖ్యంగా ఖాళీ కడుపుతో తినేటప్పుడు, గ్యాస్ ఉబ్బరం కలిగిస్తాయి. చక్కెర కలిగిన ఆహారాలు రక్తంలో చక్కెర స్థాయిలలో వేగంగా పెరుగుదలకు కారణమవుతాయి. దీని వలన రోజు తరువాత తినే ఆహారంలో హెచ్చుతగ్గులు సంభవిస్తాయి. వేయించిన ఆహారాలలో అనారోగ్యకరమైన కొవ్వులు ఎక్కువగా ఉంటాయి. ఖాళీ కడుపుతో జీర్ణం కావడం కడుపుకు కష్టంగా ఉంటుంది.



## టమాటాలు అధికంగా తింటున్నారా?

టమోటాలు చాలా రకాలుగా తింటారు. ఇది కూరల్లో, గ్రేవీ, సూప్, సలాడ్లను చిక్కగా చేయడానికి ఉపయోగిస్తారు. టమాటా ఆహారం రుచిని పెంచుతుంది. పచ్చి టొమాటోను సలాడ్ రూపంలో తింటే ఆరోగ్యానికి మేలు జరుగుతుంది. టమాటాలు నిత్యం మనం కూరల్లో వాడుతూ ఉంటాం. అయితే టమాటాల వలన అనేక ఆరోగ్య ప్రయోజనాలు కూడా ఉన్నాయి. అయితే టమోటాలు చాలా రకాలుగా తింటారు. ఇది కూరల్లో, గ్రేవీ, సూప్, సలాడ్లను చిక్కగా చేయడానికి ఉపయోగిస్తారు. టమాటా ఆహారం రుచిని పెంచుతుంది. పచ్చి టొమాటోను సలాడ్ రూపంలో తింటే ఆరోగ్యానికి మేలు జరుగుతుంది. దీనివల్ల కడుపులోని పురుగులు నశిస్తాయి. టమోటాలు యాంటీఆక్సిడెంట్లతో సమృద్ధిగా ఉంటాయి. లైకోపీన్ వంటి యాంటీఆక్సిడెంట్లు టమోటాలలో పుష్కలంగా ఉంటాయి. ఇవి ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గించడంలో, దీర్ఘకాలిక వ్యాధుల ప్రమాదాన్ని తగ్గించడంలో సహాయపడతాయి. టమోటాలలోని చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తుంది. లైకోపీన్ చెడు కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడంలో సహాయపడుతుంది. రక్త ప్రసరణను మెరుగుపరచడం ద్వారా గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. ఇన్ఫెక్షన్ల నుండి రక్షిస్తుంది. టమోటాలలో విటమిన్ సి పుష్కలంగా ఉంటుంది. ఇది బలమైన రోగనిరోధక వ్యవస్థకు అవసరం. ఇన్ఫెక్షన్ల నుండి శరీరాన్ని రక్షించడంలో సహాయపడుతుంది. టమోటాలలో విటమిన్ ఎ, విటమిన్ సి అధికంగా ఉండటం వల్ల వృద్ధాప్య సంకేతాలు, మచ్చలు తగ్గడం ద్వారా ఆరోగ్యకరమైన చర్మాన్ని ప్రోత్సహిస్తుంది. టమోటాలలో ఉండే ఫైబర్ కంటెంట్ జీర్ణక్రియను సజావుగా ప్రోత్సహిస్తుంది. మలబద్ధకాన్ని నివారించడంలో సహాయపడుతుంది. జీర్ణ ఆరోగ్యానికి ప్రయోజనకరంగా ఉంటుంది. టమోటాలలోని పొటాషియం, మెగ్నీషియం రక్తనాళాల పనితీరును మెరుగుపరచడం ద్వారా రక్తపోటును నియంత్రించడంలో సహాయపడుతుంది. సోడియం స్థాయిలను సమతుల్యం చేస్తుంది. విటమిన్ ఎ, బీటా కెరోటిన్ సమృద్ధిగా ఉన్న టమోటాలు కంటి ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి సహాయపడతాయి

.. అవి వయస్సు సంబంధిత మాక్యులర్ క్షీణత ప్రమాదాన్ని తగ్గిస్తాయి. తక్కువ కేలరీలు, అధిక నీటి శాతం కలిగిన టమోటాలు బరువు నిర్వహణకు మద్దతు ఇస్తూ మిమ్మల్ని కడుపు నిండిన అనుభూతి కలిగంచడంతోపాటు హైడ్రేటెడ్‌గా ఉంచడానికి సహాయపడతాయి.

## ఈ అలవాట్లు లేకపోతే జీవితం ఆగమే

మనం తలుచుకోవాలే గానీ జీవితాన్ని సక్సెస్ బాటలోకి నెట్టడం ఏమంత పెద్ద విషయం కాదు. మనం రోజూ చేసే చిన్న పొరపాట్లే మనల్ని సక్సెస్ కు చేరువ కానీయకుండా ఆపుతుంటాయి. ఈ 8 అలవాట్లను గనక కచ్చితంగా పాటించగలిగితే ఇక వారికి లైఫ్ లో తిరుగుండదని నిపుణులు చెప్తున్నారు. ఉరుకుల పరుగుల జీవితం మనుషుల ఆరోగ్యంపై పెను సవాలు విసురుతోంది. పూర్వం ఎన్ని పనులున్నా ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేసేంతా ఉండేవి కావు. అలాంటిది ఇప్పుడు యాంత్రిక జీవనంలోకి అలవాటుపడ్డాం. మారిన జీవన శైలితో లేనిపోని రోగాలన్ని మన శరీరాల్లో తిష్ట వేసుకుని కూర్చుంటాయి. అయితే నిత్యం మనం చేసే చిన్న చిన్న పనులే రోజూవారి జీవితంపై తీవ్ర ప్రభావాన్ని చూపుతాయి. జీవితంలో భారీ మార్పులకు దారితీసే అలవాట్ల గురించి నిపుణులు ఆసక్తికర విషయాలు చెప్పారు. ఈ అలవాట్లు మీకు లేకపోతే వెంటనే అలవర్చుకోవాలని సూచిస్తున్నారు. పెద్దలు మొత్తుకుని చెప్పినా యువత చాలా వరకు బ్రహ్మ ముహూర్తంలో మేల్కొనడానికి ఇష్టపడరు. ఉదయం 5 గంటలకే నిద్ర మేల్కోవడం ద్వారా ఎన్నో పనులను అనుకున్న సమయం కంటే ముందుగానే చేయవచ్చు. త్వరగా మేల్కుంటే స్వీయసంరక్షణ, ప్లానింగ్, ఒత్తిడి లేని ఉదయం మన సొంతమవుతుంది. ఈ అలవాటు అందరిలో మనల్ని ప్రత్యేకంగా ఉంచుతుంది. మెదడు చురుగ్గా పని చేస్తుంది. బ్రహ్మ ముహూర్తంలో నిద్రలేచిన వెంటనే శరీరాన్ని తగినంతగా నీరు ఇవ్వాలి. తద్వారా జీవక్రియ మెరుగుపడుతుంది. అంతేకాకుండా శక్తిని



పెంపొందించడంలో నీరు కీలకం. ఈ అలవాటు ఆరోగ్యాన్ని అలాగే మానసిక దృఢత్వాన్ని పెంపొందిస్తుందని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. ఇతరులు చేసే మేలు మర్చిపోకుండా కృతజ్ఞత భావంతో ఉండాలి. సంక్లిష్ట పరిస్థితిలో సహాయపడేవారు కొందరుంటారు. మనం అడగకపోయినా మనకు అవసరమైన ఉపకారం చేసే వారు కొందరుంటారు. వీరికెప్పుడూ కృతజ్ఞులమై ఉండాలి. ఇది మనస్సును ప్రశాంతపరుస్తుంది. వ్యాయామం మానవ జీవితంలో ముఖ్యమైన అంశం. వ్యాయామం వల్ల శారీరకంగా, మానసికంగా ఎన్నో లాభాలు ఉన్నాయి. ఇది గుండె జబ్బులు, మధుమేహం, అధిక బరువు తదితర సమస్యల బారిన పడకుండా చేస్తుంది. శరీరానికి చెమటొచ్చే వ్యాయామాలు రోగనిరోధక శక్తిని పెంచడమే కాకుండా మానసిక ఒత్తిడిని తగ్గిస్తాయి. రన్నింగ్, జాగింగ్ కూడా మంచివే. గొప్ప వ్యక్తుల లక్షణాల్లో పుస్తకాలు, పేపర్లు చదవడం ఒకటి. నిత్యం చదవడం వల్ల జ్ఞానం సంపాదించొచ్చు. ఇంతే కాకుండా ఒత్తిడి కూడా తగ్గుతుంది. ఇతర అంశాలపై దృష్టి మరలకుండా ఏకాగ్రత పెంపొందుతుంది. తెలియని విషయంపై స్పష్టంగా మాట్లాడగలరు. జీవితంలో ప్రతి ఒక్కరు క్రమశిక్షణ అలవరుచుకోవాలి. ఉదయం లేవగానే మీ బెడ్‌ను(పరుపు) సర్దుకుంటే మనస్సు గందరగోళానికి గురి కాదు. మానసిక ప్రశాంతత కావాలంటే పరిసరాల పరిశుభ్రత కూడా ముఖ్యమే.

## వేసవిలో ఈ పదార్థాలను ఆహారంలో చేర్చుకోండి!



మారుతున్న కాలానికి అనుగుణంగా శరీరాన్ని ఫిట్‌గా ఉంచుకోవాలంటే ఆహారంలో కూడా ఆరోగ్యకరమైన మార్పులు చేసుకోవాలి. ఆహారం పౌష్టికాహారంగా, అందరికీ ఉపయోగపడేలా, సులభంగా లభించే వస్తువులుగా ఉండాలి. ఈ సమయంలో వేసవి ప్రారంభమవుతుంది. వాతావరణం మారినప్పుడు అది నేరుగా మన శరీరంపై ప్రభావం చూపుతుంది. శరీరం ఫిట్‌గా ఉంటే మీరు అనారోగ్యానికి గురవుతారని ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. కానీ బలహీనమైన రోగనిరోధక శక్తి ఉన్నవారికి ఈ సమయం సవాలుగా మారుతుంది. ఎక్కువ నూనె లేదా వేడి ఆహారాన్ని తినడం వల్ల పొట్ట ఆరోగ్యం పాడవుతుంది. ఆరోగ్య నిపుణుల అభిప్రాయం ప్రకారం.. వేసవి, సూర్యరశ్మి ప్రారంభం కాకముందే మన ఆహారంలో అవసరమైన మార్పులు చేసుకోవాలి. ఈ సమయంలో ఆహారంలో ప్రోబయోటిక్స్, యాంటీఆక్సిడెంట్లు, హైడ్రేటెడ్ ఫుడ్స్, లైట్ ప్రొటీన్లు కలిగిన ఆహారాలు సమృద్ధిగా ఉండాలి. ఈ ఆహారాలు తినడం వల్ల శరీరం రిఫ్రెష్‌గా ఉంటుంది. రోగనిరోధక శక్తి బలంగా ఉంటుంది. ఉష్ణోగ్రత పెరిగినప్పుడు కొబ్బరి నీళ్లు తాగడం మంచిది. ఇది శరీరానికి హైడ్రేషన్ అందిస్తుంది. కొబ్బరి నీరు ఎలక్ట్రోలైట్స్ అధికంగా ఉండే పానీయం. ఇది జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. కొబ్బరి నీరు చర్మానికి కూడా మేలు చేస్తుంది. ఈ సమయంలో మార్కెట్‌లో పుచ్చకాయల విక్రయాలు కూడా ప్రారంభమయ్యాయి. ఈ పండు 90% నీటితో నిండి ఉంటుంది. ఇది నిర్జలీకరణ సమస్యను తొలగిస్తుంది. ఈ సీజన్‌లో అజీర్తి సమస్య కూడా పెరుగుతుంది. పుచ్చకాయ తినడం వల్ల రోగనిరోధక శక్తి బలపడి చర్మ సంబంధిత సమస్యలను నివారిస్తుంది. రోజూ పుచ్చకాయ తినడం వల్ల ప్రతి రోజుకి కావలసినంత శక్తి లభిస్తుంది. పెరుగు, రుచిగల పెరుగు రెండూ వేసవిలో తినడానికి ఉత్తమ ఎంపికలు. వీటిని ప్రతిరోజూ తినవచ్చు. పెరుగులో ప్రోబయోటిక్స్ పుష్కలంగా ఉన్నాయి. ఇది పేగు ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. వీటిలో మంచి బ్యాక్టీరియా ఉంటుంది. ఇది పేగు ఆరోగ్యాన్ని కాపాడుతుంది. పెరుగు శరీర ఉష్ణోగ్రతను కూడా తక్కువగా ఉంచుతుంది. పెరుగు తినడానికి సరైన సమయం పగటిపూట. వేసవిలో రోజూ తినాల్సిన కూలింగ్ గుణాలు కలిగిన మరో సూపర్ ఫుడ్ ఇది. కీరదోసకాయలో యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి చెడు టాక్సిన్స్‌ను బయటకు పంపడంలో సహాయపడతాయి. దోసకాయ సలాడ్, రైతా లేదా తాజా జ్యూస్ తాగడం వల్ల చాలా వరకు ప్రయోజనం ఉంటుంది. నిమ్మకాయ, ఇతర సిట్రస్ పండ్లు రోగనిరోధక శక్తి.. విటమిన్ సి గొప్ప వనరులు. వీటిని రోజూ తినడం వల్ల సీజనల్ ఇన్ఫెక్షన్లతో పోరాడుతుంది. నిమ్మరసం తాగడం వల్ల వాపు తగ్గుతుంది. మొటిమలు, చర్మం పొడిబారడం వంటి సమస్యలను అధిగమించడానికి మీరు నిమ్మ, నారింజ, ద్రాక్షను కూడా తినవచ్చు.

## కంటికి, ఒంటికి ఎంతో మంచిదైన కరివేపాకు పచ్చడి.

ఏ ఊర్లో అయినా కరివేపాకుకు కొదవుండదు. అంతలా మన ఆహారపు అలవాట్లలో ఇది భాగం. అయితే ఈ ఆకులు పోపులో వచ్చినా కూరల్లో కనిపించినా వేరి పక్కన పెట్టేస్తుంటారు. అందువల్ల ఇందులోని పోషకాలు అందకుండానే ఉండిపోతాయి. అందుకే ఈ సారి ఇలా కరివేపాకుతో పచ్చడిని చేసి చూడండి. ఇందులోని పోషకాలన్నీ శరీరానికి పుష్కలంగా చేరి ఎన్నో రకాల ప్రయోజనాలకు కలిగిస్తాయి. కరివేపాకు.. ప్రతి ఒక్కరి ఇంట్లో ఉండే ఈ ఆకును వేయందే వంట అసలు పూర్తే కాదు. ఎంతో చవకగా మార్కెట్లో దొరికే ఈ ఆకులు శరీరానికి ఎంతో మేలు చేస్తాయి. పోపు పెట్టాలన్నా, కారంపొడులకైనా చట్నీలకైనా ఇది లేకుండా పని పూర్తవదు. ఎన్నో రకాలుగా వాడే ఈ ఆకులను పెరట్లోనూ ఈజీగా పెంచుకోవచ్చు. దీని వల్ల కంటి ఆరోగ్యంతో పాటు, ఐరన్ లోపాన్ని కూడా మెరుగు చేసుకోవచ్చు. జుట్టు రాలే సమస్యకు ఇదే మంచి పరిష్కారం. ఒకప్పటిలా కరివేపాకు దొరకడం గగనమైంది. అందుకే ఒకేసారి మార్కెట్లో కట్టలుగా తెచ్చి నిల్వ చేసుకుంటున్నారు. కొన్నిసార్లు సరిగ్గా నిల్వ చేయకుండే వీటి ఆకులు వెంటనే వాడిపోతుంటాయి. అలాంటప్పుడు దీన్ని కరివేపాకు పచ్చడి చేస్తే వేడి వేడి అన్నంలోకి ఎంతో అద్భుతంగా ఉంటుంది. మరి ఆ రెసిపీ ఎంటో మీరూ తెలుసుకోండి.



కరివేపాకు పచ్చడి రెసిపీకి కావలసిన పదార్థాలు: కరివేపాకులు - పావు కిలో/ చింతపండు - నిమ్మకాయ సైజులో/ నూనె - సరిపడినంత/ ఇంగువ - చిటికెడు/ ఆవాలు - ఒక స్పూను/ ఎండుమిర్చి - ఎనిమిది/ మెంతి గింజలు - పావు స్పూను/శనగపప్పు - ఒక స్పూను/ మినప్పప్పు - ఒక స్పూను

కరివేపాకు పచ్చడి రెసిపీ

కరివేపాకులను ముందుగానే శుభ్రంగా కడిగి గాలికి ఆరబెట్టుకోవాలి. ఇప్పుడు స్టవ్ మీద కళాయి పెట్టి నూనె వేయాలి. ఆ నూనెలో మినప్పప్పు, శనగపప్పును వేసి వేయించుకోవాలి. ఆ తర్వాత మెంతులను, ఎండుమిర్చిని కూడా వేసి వేయించాలి. వీటన్నిటి తర్వాత ముందుగా ఆరబెట్టుకున్న కరివేపాకులను వేసి ఐదు నిమిషాల పాటు వేయించాలి. తర్వాత స్టవ్ ఆఫ్ చేయాలి. ఈ మిశ్రమాన్ని చల్లారనివ్వాలి.

మిక్సీ జార్లో వేయించిన కరివేపాకుల మిశ్రమం, చింతపండు, ఉప్పు కూడా వేసి రుబ్బుకోవాలి.కొద్దికొద్దిగా నీరు పోసుకుని మెత్తగా రుబ్బుకోవాలి. ఇప్పుడు ఆ మొత్తం మిశ్రమాన్ని ఒక గిన్నెలో వేసుకోవాలి.దీన్ని ఇప్పుడు తాలింపు పెట్టుకోవాలి. చిన్న కళాయిలో నూనె వేసి ఆవాలు, జీలకర్ర, వెల్లుల్లి రెబ్బలు, చిటికెడు ఇంగువ వేసి వేయించి ఈ తాలింపును పచ్చడిపై వేసుకోవాలి. అంతే టేస్టీ కరివేపాకు పచ్చడి రెడీ అయినట్టే. వారం రోజుల పాటు దీన్ని నిల్వ చేసుకోవచ్చు. కావలసి ఉంటే ఫ్రిడ్జ్ లో పెట్టుకోవచ్చు. కరివేపాకు పచ్చడిని మరింత టేస్ట్ కావాలనుకుంటే కొన్ని కొత్తిమీర ఆకులను కూడా కలుపుకోవచ్చు. మీకు స్పైసీగా తినాలనిపిస్తే ఎండుమిర్చి ఎక్కువగా వేసుకోవచ్చు. లేకుంటే పచ్చిమిర్చిని జతచేసుకోవచ్చు. పచ్చిమిర్చిని వేయించి జోడిస్తేనే మంచి రుచిగా అనిపిస్తుంది. కారం తక్కువగా తినే వారు దీన్ని తక్కువగా కలుపుకోవాలి. ముఖ్యంగా చిన్న పిల్లలు. కరివేపాకు చర్మానికి సహజ టోనర్ లా పనిచేస్తుంది. దీని వల్ల జుట్టు కూడా సరికొత్త నిగారింపు సంతరించుకుంటుంది.

# సినిమా



## మరి ఇంత బోల్డ్‌గానా.. జినాల్ జోషి ఫోటోలు వైరల్



## పార్లమెంట్‌కి వెళుతున్న రామ్ చరణ్.. నమ్మలేకపోతున్నారా!

ఏంటి మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ పార్లమెంట్‌కి వెళుతున్నారా, ఇది నిజమా అని మీలో ఎన్నో ప్రశ్నలు తలెత్తుతున్నాయి కదా. రియల్ లైఫ్‌లో కాదు కాని రీల్ లైఫ్‌లో పార్లమెంట్‌లో అడుగుపెట్టబోతున్నాడట రామ్ చరణ్. త్వరలో సినిమా షూటింగ్ కోసం యూనిట్ సభ్యులు ఢిల్లీ వెళ్లనున్నట్టు తెలుస్తుంది. కథలో భాగంగా కొన్ని కీలక సన్నివేశాలను ఢిల్లీలోని పార్లమెంట్ ఆవరణలో చిత్రీకరించాల్సి ఉందట. అంతే కాకుండా జామా మసీదు పరిసర ప్రాంతాల్లోనూ సినిమా షూటింగ్ నిర్వహించేందుకు బుచ్చిబాబు ప్లాన్ చేయడంతో నిర్మాతలు పర్మిషన్స్ కూడా తీసుకున్నారని సమాచారం. త్వరలోనే చరణ్‌తో పాటు కీలక నటీనటులు, సాంకేతిక నిపుణుల బృందం ఢిల్లీ వెళ్లే అవకాశాలు ఉన్నాయి. కన్నడ సూపర్ స్టార్ శివ రాజ్ కుమార్ ముఖ్య పాత్రలో నటిస్తున్నారు. ఈ సినిమా షూటింగ్ మొన్నటి వరకు హైదరాబాద్‌లోని రామోజీ ఫిల్మ్ సిటీలో, శివారు ప్రాంతంలో షూటింగ్ జరుపుకుంది. స్పోర్ట్స్ డ్రామాగా రూపొందుతున్న ఈ సినిమాలో రామ్ చరణ్ వివిధ ఆటలు ఆడతాడని సమాచారం. సాధారణంగా స్పోర్ట్స్ డ్రామా అంటే ఒకే ఆట నేపథ్యంలో ఉంటుంది. కాని ఈ చిత్రంలో రామ్ చరణ్ పలు ఆటలు ఆడతాడట. ఆట కూలీ పాత్రలో రామ్ చరణ్ కనిపించబోతున్నారని వార్తలు వస్తుండగా, దీనిపై క్లారిటీ రావలసి ఉంది. ఇటీవలి కాలంలో ఎప్పుడూ చూడని వైవిధ్యభరిత కాన్సెప్ట్‌తో ఈ సినిమాని రూపొందించబోతున్నట్టు సమాచారం. ఇక ఈ సినిమా టీజర్‌ని రామ్ చరణ్ బర్త్‌డే సందర్భంగా విడుదల చేయాలని భావిస్తున్నారు. అదే సమయంలో సినిమా టైటిల్‌ను రివీల్ చేసే అవకాశం కూడా కనిపిస్తుంది. ఇదే ఏడాదిలో సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకు వచ్చే ఉద్దేశం ఉన్నట్లు తెలుస్తోంది. మైత్రి మూవీ మేకర్స్‌తో కలిసి వెంకట సతీష్ కిలారు ఈ సినిమాను భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. ఆస్కార్ అవార్డ్ గ్రహీత ఏ ఆర్ రెహమాన్ ఈ సినిమాకు సంగీతాన్ని అందిస్తున్న నేపథ్యంలో సినిమాపై అంచనాలు భారీగా పెరిగాయి. జాన్వీ కపూర్ కథానాయికగా నటిస్తుంది.



## ఆ దర్శకుడితో నాగార్జున 100వ సినిమా?

చిరంజీవి, బాలకృష్ణ, నాగార్జున, వెంకటేశ్.. ఈ నలుగురిని టాలీవుడ్‌కి నాలుగు స్తంభాలు అంటారు. ప్రస్తుతం టాలీవుడ్‌లో అత్యధిక సినిమాలలో హీరోలుగా నటించింది వీరే. చిరంజీవి ఇప్పటికే 156 చిత్రాలకు పైగా నటించగా.. బాలకృష్ణ కూడా సెంచరీ పూర్తి చేశాడు. ఇక ఇప్పుడు నాగార్జున(%ఛీఘ్రుఘతీయబఙఖ%) తన 100వ సినిమాను పూర్తి చేసే పనిలో ఉన్నాడు. ఇప్పటికే హీరోగా 99 చిత్రాల్లో నటించిన నాగ్.. తన సెంచరీ మూవీ కోసం ఆచి తూచి వ్యవహరిస్తున్నాడు. నాగ్ సోలో హీరోగా నటించిన చివరి చిత్రం 'నా సామి రంగ'. ఇది గతేడాది సంక్రాంతికి ఈ సినిమా రిలీజైంది. ఆ తర్వాత సోలో సినిమా ఇంత వరకూ ప్రకటించలేదు. ఇప్పుడు తన బెంచ్ మార్క్ సినిమా కోసం అదిరిపోయే ప్లాన్ వేస్తున్నట్లు టాక్ నడుస్తోంది. కింగ్ నాగ్ నటించబోయే 100వ సినిమాని టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా మార్చేందుకు స్కెచ్ వేస్తున్నట్లు ఓ న్యూస్ చక్కర్లు కొడుతోంది ప్రస్తుతం నాగార్జున 'కుబేర', 'కూలీ' చిత్రాలతో బిజీగా ఉన్నాడు. ఇవి పూర్తయిన తర్వాత 100వ సినిమా ప్రాజెక్ట్ పట్టాలెక్కే అవకాశం ఉంది. తాజా వార్తల ప్రకారం, ఈ చిత్రానికి తమిళ దర్శకుడు కార్తీక్ దర్శకత్వం వహించనున్నారని సమాచారం. కార్తీక్ గతంలో తమిళంలో 'నితం ఓరువానం" చిత్రానికి దర్శకత్వం వహించారు. ఈ సినిమా తెలుగులో 'ఆకాశం' పేరుతో డబ్ అయ్యింది. ఇక్కడ ఆశించిన స్థాయిలో ఆ చిత్రం ఆడలేదు కానీ దర్శకుడు కథను తెరపై చూపించిన విధానం నాగ్‌కి బాగా నచ్చిందట. వెంటనే అతన్ని పిలిపించి..వందో చిత్రం బాధ్యతలు అప్పజెప్పాడట. తన 100వ విజువల్ వండర్‌గా, ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఉండాలని నాగ్ కోరుకుంటున్నట్లు గతంలో ఒక ఇంటర్వ్యూలో చెప్పారు. నిన్న మొన్నటి వరకు నాగార్జున వందో చిత్రానికి పూరి జగన్నాథ్, బెజవాడ ప్రసన్న కుమార్, తమిళ్ డైరెక్టర్ మోహన్ రాజా, నవీన్ పేర్లు గట్టిగా వినిపించాయి.. అయితే, తాజా సమాచారం ప్రకారం కార్తీక్‌తోనే ఈ ప్రాజెక్ట్ ఖరారైనట్లు కనిపిస్తోంది. షూటింగ్ ఈ ఏడాది చివరలో లేదా 2026 ప్రారంభంలో మొదలయ్యే అవకాశం ఉంది. నాగ్ అభిమానులకు ఆకట్టుకునేలా ఓ సూపర్ స్టోరీని రెడీ చేశాడట కార్తీక్. రూ. 100 కోట్ల భారీ బడ్జెట్‌తో పాన్ ఇండియా రేంజ్ లో నాగ్ సెంచరీ మూవీని తెరకెక్కించేందుకు రెడీ అవుతున్నారట. త్వరలోనే దీనిపై అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉంది.



## మోహన్ బాబు బర్త్ డే స్పెషల్.. మహదేవ శాస్త్రి గ్లింప్స్ చూశారా?

మంచు విష్ణు డ్రీమ్ ప్రాజెక్ట్‌గా తెరకెక్కిస్తోన్న చిత్రం కన్నప్ప. ఈ మూవీని ముకేశ్ కుమార్ సింగ్ దర్శకత్వంలో తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమా భారీ బడ్జెట్‌తో అవా ఎంటర్‌టైన్మెంట్, 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ పతాకాలపై మోహన్ బాబు నిర్మిస్తున్నారు. ఇప్పటికే ఈ చిత్రంలోని పలువురు అగ్రతారల ఫస్ట్ లుక్ పోస్టర్లను ఆడియన్స్‌కు పరిచయం చేశారు. ఈ మూవీలో మోహన్ బాబు, మోహన్ లాల్, శరత్ కుమార్, ప్రభాస్, బ్రహ్మానందం, అక్షయ్ కుమార్, కాజల్ అగర్వాల్ కీలక పాత్రల్లో నటిస్తోన్న సంగతి తెలిసిందే. అయితే ఈ చిత్రంలో మోహన్ బాబు మహదేవ శాస్త్రి పాత్రలో అభిమానులను అలరించనున్నారు. ఇవాళ ఆయన పుట్టిన రోజు కావడంతో ప్రత్యేక గ్లింప్స్‌ను మేకర్స్ విడుదల చేశారు. మహదేవ శాస్త్రి పాత్రను పరిచయం చేసే సాంగ్‌ను గ్లింప్స్ రూపంలో రిలీజ్ చేశారు. ఈ పాటను ఓకేసారి ఐదు భాషల్లో ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చారు. తెలుగుతో పాటు తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో ఆడియన్స్‌కు పరిచయం చేశారు. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం ఏప్రిల్ 25న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో సందడి చేయనుంది.

# ప్రపంచ పర్యాటకులను ఆకర్షించేలా..

-మొదటిపేజీ తరువాయి

లిమిటెడ్ సీఈఓ జూలియా మోర్లీ, 2024 ప్రపంచ సుందరి క్రిస్టినా పిజ్కోవా, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు మీడియాతో మాట్లాడారు. హైదరాబాద్‌లో జరిగే మిస్ వరల్డ్ పోటీలకు 140 దేశాల నుంచి అందాల భామలు వస్తారని తెలిపారు.

**ప్రపంచ పర్యాటకులను ఆకర్షించేలా..**

తెలంగాణ గురించి ప్రపంచానికి చాటి చెప్పేందుకు ఇది మంచి అవకాశమని మంత్రి జూపల్లి కృష్ణారావు అభివర్ణించారు. ఈ పోటీల్లో పాల్గొనే వారితో పాటు వేలాది మంది దేశ విదేశాలకు చెందిన వారు తెలంగాణకు వస్తారని అన్నారు. ఈ వేదిక వల్ల నిరంతరంగా పర్యాటక రంగానికి సంబంధించి రాబడి పెరుగుతుందని తెలిపారు. ప్రపంచ పర్యాటకులను ఆకర్షించగలమని అన్నారు. మిస్ వరల్డ్ పోటీలకు రూ.54 కోట్లు పెట్టుబడి పెట్టామని చెప్పారు. అందులో సగమే ప్రభుత్వం కేటాయిస్తుందని..మరో సగం ప్రమోటర్‌ల నుంచి సేకరిస్తామని స్పష్టం చేశారు. ఇది చరిత్రాత్మక కార్యక్రమమని.. సంస్కృతి, సంప్రదాయాలకు తెలంగాణ నెలవు అని వ్యాఖ్యానించారు. మహిళల అంతః సౌందర్యాన్ని సెలబ్రేట్ చేయడం మిస్ వరల్డ్ పోటీల ఉద్దేశమని అన్నారు. సమాజ నిర్మాణంలో మహిళల పాత్ర గొప్పదని మంత్రి జూపల్లి కృష్ణారావు చెప్పారు.

తెలంగాణలో మహిళలకు అన్ని రంగాల్లో ఎంతో ప్రాధాన్యత ఉందన్నారు. ప్రపంచానికి తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, ఆహారం, పర్యాటక అందాలను తెలియజేసేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడుతాయని చెప్పుకొచ్చారు. సౌత్ కొరియా స్క్విడ్ గేమ్, బీటీఎస్ బ్యాండ్ లాంటివి దేశ ఎకానమీకి ఎంతో ఉపయోగపడ్డాయని వివరించారు. ఈ కార్యక్రమం ద్వారా



తెలంగాణ పేరు ప్రఖ్యాతులతో పాటు ఆర్థికంగానూ వృద్ధి సాధిస్తుందని భావిస్తున్నామని చెప్పారు. నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు, ప్రపంచ స్థాయి పెట్టుబడులు ఆకర్షించేందుకు ఇది మంచి అవకాశమని తెలిపారు రాష్ట్ర ఆదాయం కూడా పెరుగుతుందన్నారు. ఈ అందాల పోటీలను మహిళా సాధికారతకు ప్రతీకగా చూడాలని చెప్పారు. ప్రభుత్వాన్ని విమర్శించేందుకు, రాజకీయ కోణంలో ఈ పోటీలను చూడటం సరికాదని మంత్రి జూపల్లి కృష్ణారావు హితవు పలికారు.

**భారతదేశానికి చాలా ప్రాధాన్యత ఉంది: క్రిస్టినా పిజ్కోవా**

బేగంపేట్ టూరిజం ప్లాజాలో ఇవాళ జరిగిన ప్రీ ఈవెంట్ ప్రెస్ కాన్ఫరెన్స్‌లో 2024 ప్రపంచ సుందరి క్రిస్టినా పిజ్కోవా పాల్గొని సందడి చేశారు. నమస్తే ఇండియా అంటూ 2024 ప్రపంచ సుందరి క్రిస్టినా పిజ్కోవా పలకరించింది. అతిథులు చాలా గొప్పగా స్వాగతం చెప్పారని అన్నారు. తన ప్రయాణంలో, తన హృదయంలో భారతదేశానికి చాలా ప్రాధాన్యత ఉందని తెలిపారు. భారత కల్చర్, ఆర్ట్స్ చాలా గొప్పగా ఉంటాయని వివరించారు. భారతదేశం చాలా ఇన్‌స్పైరింగ్ అని తెలిపారు. భారత్ విలువలను బోధిస్తుందని.. భిన్నత్వంలో ఏకత్వానికి ఎంతో గొప్ప భావన ఉందని చెప్పుకొచ్చారు. ఎన్నో భాషలు ఉన్నా అంత ఒక్కటిగా ఉండటం భారతదేశం స్ఫూర్తి అని తెలిపారు. మిస్ వరల్డ్ పోటీలు కూడా అంతే భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీక అని చెప్పారు. యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని సందర్శించడం మంచి అనుభూతిని ఇచ్చిందని క్రిస్టినా పిజ్కోవా పేర్కొన్నారు.

**తెలంగాణలో గొప్ప కట్టడాలు: స్మితా సభర్వాల్**

తెలంగాణ త్రిలింగ దేశంగా ప్రాముఖ్యత కలిగిందని సీనియర్ ఐఏఎస్, తెలంగాణ పర్యాటకశాఖ కార్యదర్శి స్మితా సభర్వాల్ తెలిపారు. ఈ ప్రాంతానికి 2500 ఏళ్ల చరిత్ర ఉందని ఉద్ఘాటించారు. రాష్ట్రం ఏర్పడిన 11 ఏళ్లలో ఎంతో వృద్ధి సాధించామని చెప్పారు. రామప్ప, వేయి స్థంభాల ఆలయం, చార్మినార్, గోల్కొండ కోట లాంటి ఎన్నో గొప్ప కట్టడాలు ఇక్కడ ఉన్నాయని అన్నారు. మే నెలలో జరుగనున్న మిస్ వరల్డ్ పోటీలను తెలంగాణ సంస్కృతి ప్రతిభింభించేలా నిర్వహించనున్నామని చెప్పారు. మెడికల్ టూరిజంలో తెలంగాణకు ఎంతో ప్రాముఖ్యత ఉందని అన్నారు. సినిమా, ఆహార రంగాల్లో తెలంగాణకు పెట్టింది పేరని చెప్పారు. అత్యంత సురక్షిత పర్యాటక ప్రాంతం తెలంగాణ అని స్మితా సభర్వాల్ పేర్కొన్నారు.

# ప్రతి తెలంగాణ బిడ్డకు గుండె ధైర్యం ఈ గులాబీ జెండానే

-మొదటిపేజీ తరువాయి

ఎన్టీఆర్ పేరు ఎందుకు తీసుకున్నానంటే ప్రత్యేక సందర్భం ఉంది. రెండే రెండు పార్టీలు విజయవంతంగా 25 ఏండ్ల పైచిలుకు ప్రస్థానాన్ని కొనసాగించాయి. టీడీపీ, బీఆర్ఎస్ పార్టీ. తెలంగాణ ప్రజల గుండెల్లోంచి పుట్టిన పార్టీ గులాబీ పార్టీ అని కేటీఆర్ తెలిపారు. ఒకసారి వెనక్కి తిరిగి చూస్తే 2001లో ఆనాడు కేసీఆర్ పార్టీ పెట్టినప్పుడు ఏమున్నది..? ఆయనకు 46 ఏండ్ల వయసు. ఒక రాజకీయ పార్టీ పెట్టాలంటే దుస్సాహసం ఉండాలి. నాడు వదేండ్ల చరిత్ర కలిగిన కాంగ్రెస్ పార్టీ, ఎన్డీఏ ప్రభుత్వం బీజేపీ ఒక వైపు ఉన్నారు. మూడో వైపు అదే ఎన్డీఏకు కన్వీనర్‌గా ఉంటూ ఏపీ ముఖ్యమంత్రిగా ఉంటూ.. ఢిల్లీలో చక్రం తిప్పుతూ చంద్రబాబు ఒక వైపు ఉన్నాడు. అదే మాదిరిగా తెలంగాణ అంశం 30 ఏండ్లు మరుగునపడ్డ అంశం. 1971లో తెలంగాణ ప్రజాసమితి అనే పార్టీ 11 ఎంపీలు గెలిచి మళ్లీ కాంగ్రెస్ పార్టీలో కలిపోయింది. తెలంగాణ ప్రజా సమితి కాంగ్రెస్‌లో విలీనం కావడంతో తెలంగాణ సమాజనికి నమ్మకం లేని పరిస్థితిలో 2001లో గులాబీ జెండా ఎగురేసి.. ఒక్కడిగా బయల్దేరి శూన్యం నుంచి సునామీ సృష్టించి తెలంగాణ సాధించిన మహా నాయకుడు కేసీఆర్ అని కేటీఆర్ పేర్కొన్నారు.

**వానపాములు కూడా నాగుపాముల్లా బుస కొడుతున్నాయి**

రాష్ట్ర ముఖ్యమంత్రి సీఎం రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. భూమికి మూడు ఫీట్లు ఉన్నోడు కూడా అసెంబ్లీలో చాలాచాలా మాట్లాడుతున్నాడని కేటీఆర్ తీవ్ర విమర్శలు చేశారు. సూర్యాపేటలో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ బహిరంగ సభలో కేటీఆర్ పాల్గొని ప్రసంగించారు. రేవంత్ రెడ్డి ఒక రాజకీయ పిగ్మీ. కేసీఆర్ మోకాలి ఎత్తుకు సరిపోనోడు కూడా ఆహా ఓహో అని గర్జిస్తున్నాడు. గ్రామ సింహాలు కూడా సింహాల్లాగా ఎగురుతున్నాయి. వానపాములు కూడా నాగుపాముల్లాగా బుస కొడుతున్నాయి. అలాంటి పరిస్థితి రాష్ట్రంలో వచ్చింది. 2001లో గులాబీ జెండా ఎగురేసి.. ఒక్కడిగా బయల్దేరి శూన్యం నుంచి సునామీ సృష్టించి తెలంగాణ సాధించిన మహా నాయకుడు కేసీఆర్. ఇది ఏ రాజకీయ మరగుజ్జు ఔనన్నా కాదన్నా.. వానపాములు నాగుపాములై బుసకొట్టినట్టు యాక్టింగ్‌లు చేసినా కేసీఆర్ అనవాళ్లు చెరిపేస్తామని డైలాగులు కొట్టినా.. చరిత్ర చెరిపేయలేని సత్యం ఏదంటే కేసీఆర్ లేకపోతే తెలంగాణ రాష్ట్రం లేదు అనేది అక్షర సత్యం. ఎవరు ఔనన్నా కాదన్నా ఇది వాస్తవం. కేసీఆర్ వెంట ఎందరో నడిచారు. ఎందరో ఆత్మబలిదానాలు చేసుకున్నారు. చివరకు చావు నోట్లో తలపెట్టి కేసీఆర్ తెలంగాణను సాధించారు అని కేటీఆర్ తెలిపారు.



**ప్రతి తెలంగాణ బిడ్డకు గుండె ధైర్యం ఈ గులాబీ జెండానే : కేటీఆర్**

ప్రతి తెలంగాణ బిడ్డకు గుండె ధైర్యం ఈ గులాబీ జెండానే అని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. బీఆర్ఎస్ పార్టీ రజోత్సవాల వేడుకల నేపథ్యంలో సూర్యాపేటలో ఏర్పాటు చేసిన పార్టీ బహిరంగ సభలో కేటీఆర్ పాల్గొని ప్రసంగించారు. టీఆర్ఎస్ పార్టీ ప్రారంభించిన సమయంలో కేసీఆర్‌కు మనీ పవర్ లేదు.. మజిల్ పవర్ లేదు.. కుల బలం లేదు.. ధన బలం లేదు.. మీడియా లేదు. ప్రతికూల శక్తులన్నీ హైదరాబాద్‌లో అడ్డా పెట్టి తొక్కి పారేస్తాం అని హుంకరింపులు. ఈరకమైన వాతావరణంలో ఒక్కడిగా బయల్దేరిన సమయంలో ఆయనకు కొందరు తోడుగా నిలిచారు. అలా ఒక్కొక్క అడుగేసుకుంటూ 14 ఏండ్ల శ్రమించి తెలంగాణను సాధించారు అని కేటీఆర్ తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ మూడు ప్రాతల్లో విజయవంతమైంది. 14 ఏండ్లు ఉద్యమపార్టీగా విశ్వరూపం చూపించాం. ప్రజాస్వామ్యబద్ధంగా తమ కోరికలను ఎలా నెరవేర్చుకోవచ్చు అని చూపించాం. తెలంగాణ సాధించాం. ఆ తర్వాత పదేండ్ల పాటు ప్రజలు, రైతుల కోసం ఎలా పని చేయొచ్చు అని చేసి చూపించాం. అభివృద్ధిలో తెలంగాణను నంబర్ వన్ రాష్ట్రంగా నిలిపాం. 15 నెలల కిందట అధికారం పోయింది.. ప్రతిపక్షంలోకి వచ్చాం.. ఇక చిట్టి నాయుడు ఏం చెబుతున్నారు తనను బతకనిస్తలేరు అని అంటున్నాడు. ప్రతిపక్ష పార్టీగా ప్రజల తరపున పోరాడుతున్న పార్టీ బీఆర్ఎస్ మాత్రమే. ఒక్క మాటలో చెప్పాలంటే ప్రతి తెలంగాణ బిడ్డకు గుండె ధైర్యం ఈ గులాబీ జెండా అని ఘంటాపథంగా చెప్పొచ్చు. ఈ గులాబీ జెండా ఎగిరి 24 ఏండ్లు నిండి 25వ ఏడాదిలోకి వచ్చే నెల 27న అడుగుపెట్టబోతున్నామని కేటీఆర్ తెలిపారు.

**అసూయ, ద్వేషం, ఆశ..**
**పార్టీ ఓటమిపై కేటీఆర్ కీలక వ్యాఖ్యలు**

అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ ఓటమికి అసూయ, ద్వేషం, ఆశ కారణమైనట్లు ఓ సింగర్ చెప్పినట్లు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. ఈ మూడింటి వల్లే బీఆర్ఎస్ పార్టీ అనుకున్నన్ని సీట్లు సాధించలేకపోయిందని ఆ సింగర్ చెప్పారని కేటీఆర్ తెలిపారు. సూర్యాపేటలో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ పార్టీ సభలో కేటీఆర్ పాల్గొని ప్రసంగించారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మెడికల్ కాలేజీలు, దామరచర్ల విద్యుత్ ప్లాంట్, యాదాద్రి ఆలయంతో పాటు ఎన్నో ప్రాజెక్టులు నిర్మించాం కదా.. ఎందుకు ఓడిపోయామని ఓ సింగర్‌తో అంటే.. ఆయన ఇలా సమాధానం చెప్పారు. రామాయణంలో కట్టె, కొట్టె, తెచ్చె అన్నట్టు సింపుల్‌గా చెప్తా అని ఇలా చెప్పిండు.. బీఆర్ఎస్ ఎన్నికల్లో ఓడిపోవడానికి అసూయ, ద్వేషం, ఆశ పని చేశాయని చెప్పిండు. అసూయ అంటే అధికార పార్టీలోకి రాగానే ఎమ్మెల్యేలు కొత్త కారు, కొత్త ఇల్లు కట్టుకున్నాడని ప్రచారం చేశారు. ఇది వరకు అంగి లేకుండా తిరిగినట్టు ఇవాళ కొంత మంది నాయకులు కొత్త అంగి వేసుకున్నట్టు అసూయ పడ్డారు. మరో వైపు ద్వేషం..ఈ రాష్ట్రాన్ని కుటుంబం కోసం తెచ్చినట్టు.. దొర పాలన అని ప్రజల్లో ద్వేషం నిండే విధంగా అగ్ర నాయకత్వంపై ప్రచారం చేశారు. ఇక ఆశ.. కేసీఆర్ పదివేలు ఇస్తుండు.. నేను పదిహేను వేలు వేస్తా.. ఇద్దరికీ పెన్షన్లు ఇస్తా అని ఆశ పెట్టిండు. ఎతుల వెంకట్ రెడ్డి, కోతుల ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆశలు పెట్టి మోసం చేశారు. కాంగ్రెసోడు, బీజేపోడు అభివృద్ధి గురించి మాట్లాడలేదు. మెడికల్ కాలేజీ, ఎస్పీ ఆఫీసు గురించి మాట్లాడలేదు. కొత్త మండలాలు, కొత్త గ్రామ పంచాయతీల గురించి చెప్పలేదు. అసూయ, ద్వేషం, ఆశ నింపి ఓడగొట్టారు అని ఆ సింగర్ చెప్పారని కేటీఆర్ గుర్తు చేశారు.కేసీఆర్ హయాంలో భూముల ధరలు పెరిగాయి. దాంతో అందరి సంపద పెరిగింది. టీఆర్ఎస్ సంపద పెరగొద్దు.. కానీ కాంగ్రెస్, బీజేపీ సంపద పెరగాలట. కేసీఆర్ దొర అని యూట్యూబ్‌లో పనికిమాలిన చెత్త మాట్లాడి తిట్టని తిట్లు తిట్టి విషప్రచారం చేసి అధికారంలోకి వచ్చిండు. ఇవాళ అదే యూట్యూబ్ వాళ్లను గుడ్డలుడదీసి కొడుతాడట. ఆయన కాడికి వస్తే అన్ని గుర్తుకు వస్తున్నాయి. ఇదివరకు ఎవరికి భార్యాలు పిల్లలు లేరట. ఈయనకు మాత్రమే ఉన్నారట. నాయకులను నీచంగా వికృతంగా మాట్లాడి.. ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిండు రేవంత్ రెడ్డి అని కేటీఆర్ ధ్వజమెత్తారు.

# హైడ్రాకు హైకోర్టు తలంటు... పెద్దవాళ్లవి మీకు కనపించవా...

**హైదరబాద్ :** గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని చెరువులు, కుంటలు, ప్రభుత్వ స్థలాల పరిరక్షణ కోసం హైడ్రా వ్యవస్థను తీసుకొచ్చారు. ఇప్పటికే వందల అక్రమ నిర్మాణాలను హైడ్రా అధికారులు నేలమట్టం చేశారు. అయితే హైడ్రా పూర్తిగా పక్షపాతంగా వ్యవహరిస్తుందని.. డబ్బున్న బిల్డర్లను వదిలేసి పేదల ఇండ్లను కూల్చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ విషయమై పలువురు హైకోర్టును ఆశ్రయించగా.. పలు సందర్భాల్లో హైకోర్టు హైడ్రా తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసింది. తాజాగా మరోసారి హైడ్రాపై తెలంగాణ హైకోర్టు ఫైరయింది పేదలకు చెందిన అక్రమ నిర్మాణాలను కూల్చివేయడంతో సరిపెట్టడం కాదని.. పెద్దల నిర్మాణాలను తాకి చూడాలని హైడ్రాను ఉద్దేశించి ఘాటు వ్యాఖ్యలు చేసింది. పేదలకు వర్తించే చట్టాలు పెద్దలకు వర్తించవా? అని నిలదీసింది. సంపన్నులకు ఏమైనా ప్రత్యేక చట్టాలున్నాయా అని ప్రశ్నించింది. రికివాడల్లో అక్రమ నిర్మాణాలను కూల్చివేసి పేపర్లలో ఫొటోలు వేయించుకోవడం కాదని.. సంపన్నులు ఉండే దుర్గం చెరువు, మియాపూర్ చెరువుల్లో ఆక్రమణలనూ తొలగించాలని.. అప్పుడే ప్రజాప్రయోజనాలను పరిరక్షించినట్ల వుతుందని అన్నారుహైదరాబాద్ శివారు రాజేంద్రనగర్ మండలం అత్తాపూర్‌లోని పలు సర్వే నంబర్లలో ఉన్న 6.10 ఎకరాల స్థలానికి సంబంధించి అక్రమ నిర్మాణాలంటూ స్థానిక ఎమ్మార్వో జారీ చేసిన నోటీసులను సవాలు చేస్తూ షామ్స్ ఫాతిమాఖాన్ అనే వ్యక్తి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ సి.వి.భాస్కర్‌రెడ్డి నేతృత్వంలోని ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. వక్ఫ్ బోర్డు సీఈవో రాసిన లేఖ ఆధారంగా వాల్టా చట్టం కింద ఎమ్మార్వో నోటీసులు జారీ చేయటం చెల్లదని పిటిషనర్ తరపు న్యాయ వాది వాదించారు. ప్రభుత్వ న్యాయవాది కలుగజేసుకొని.. మీరాలం చెరువు ఆక్రమణలపై ఇప్పటికే ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలైందన్నారు. ఆ పిటిషన్‌లోని ఉత్తర్వుల ప్రకారం సదరు సర్వే నెంబర్లలోని ఆక్రమణల తొలగింపునకు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు.దీనిపై న్యాయమూర్తి జస్టిస్ భాస్కర్ రెడ్డి స్పందిస్తూ.. ఒకప్పుడు హైదరాబాద్ సిటీ ఆఫ్ లేక్స్‌గా ఉండేదని.. అప్పుడు 2,200 చెరువులుంటే ప్రస్తుతం 180 కూడా లేవని అసహనం వ్యక్తం చేశారు. ప్రస్తుతం చెరువుల పరిరక్షణకు హైడ్రా చర్యలు తీసుకుంటోందని.. కాకపోతే మురికివాడల్లోని పేదల అక్రమ నిర్మాణాలనే కాకుండా పెద్దలు చేపట్టిన అక్రమ నిర్మాణాలను కూల్చాలని సూచించింది. అప్పుడే ప్రజలకు మేలు చేసినట్లవుతుం దన్నారు. మీరాలం చెరువుకు సంబంధించి పిటిషనర్ అభ్యంత రాలు లేవనెత్తగా.. ఇరిగేషన్, రెవెన్యూ శాఖ అధికారులు సంయుక్త సర్వే నిర్వహించాలని హైకోర్టు ఆదేశించింది. ఆ భూమి వక్ఫ్‌బోర్డుదని తేలితే ఆక్రమణల తొలగింపు బాధ్యత లను హైడ్రాకు కాకుండా వక్ఫ్‌బోర్డుకు వదిలేయాలంటూ పిటిషన్‌పై విచారణను హైకోర్టు మూసేసింది.

## కేడర్‌లో ఉత్సాహం

-మొదటిపేజీ తరువాయి

ఫలితాలతో తెలంగాణ రాష్ట్రం మొత్తం ఇదే వ్యూహంతో వెళ్లాలని బీజేపీ నేతలు ప్రయత్నాలు మొదలు పెట్టారు. ఇదే ఉత్సాహంతో స్థానిక ఎన్నికల్లో పనిచేసేలా బీజేపీ హై కమాండ్ దిగువ స్థాయి నేతలకు దిశానిర్దేశం చేస్తోంది. సర్పంచ్ ఎన్నికల్లో అన్ని స్థానాల్లోనూ పోటీ చేయాలని బీజేపీ హై కమాండ్ భావిస్తోంది. ఈ మేరకు దిగువ స్థాయి నేతలతో అగ్ర నాయకులు సమావేశాలు నిర్వహిస్తున్నారు.

## అదంతా దుష్ప్రచారం

-మొదటిపేజీ తరువాయి

నాపై కోపం? రుణమాఫీ చేసినందుకా నాపై కోపం? 59వేల మంది ఉద్యోగాలు ఇచ్చినందుకా? నాపై కోపం అని ప్రశ్నించారు. అనంతరం, తెలిపారు. అనంతరం,బిల్డ్ నౌ పోర్టల్‌ను ఆవిష్కరించారు. ముఖ్యమంత్రి పదవిని చేపట్టడం కంటే జెడ్పీటీసీగా గెలిచినప్పుడే తనకు ఎక్కువ ఆనందం కలిగిందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. మొదటిసారి వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో 'ప్రజాపాలనలో కొలువుల పండుగ' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కారుణ్య నియామకాలు క్రమం తప్పకుండా చేపట్టాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని ఆయన స్పష్టం చేశారు. కారుణ్య నియామకాలు చేపట్టకపోవడం వల్ల చాలామంది పదేళ్లు నష్టపోయారని ఆయన విమర్శించారు. జాబ్ క్యాలెండర్‌తో పాటు కారుణ్య నియామకాలు కూడా ఇవ్వాల్సిందేనని ఆయన అన్నారు. తెలంగాణ ఉద్యమంలో నిరుద్యోగుల పాత్ర మరువలేనిదని ఆయన గుర్తు చేశారు. స్వరాష్ట్రం వచ్చినా నిరుద్యోగుల కల నెరవేరలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పేదలు, బడుగుబలహీన వర్గాల వారే పోటీ పరీక్షలకు సిద్ధమవుతారని ఆయన అన్నారు. నిరుద్యోగుల బాధలను ప్రజా ప్రభుత్వం గుర్తించిందని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. అందుకే ఏడాదిలో 59 వేల ఉద్యోగాలను ఇచ్చామని తెలిపారు. నిరుద్యోగులను నిర్లక్ష్యం చేయడం వల్లే గత ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓడిపోయిందని ఆయన అన్నారు. ఉద్యోగాలు ఇవ్వని వారికి ఓట్లు, ఉద్యోగాలు ఎందుకని యువత బీఆర్ఎస్‌ను ఓడించిందని అన్నారు. నిరుద్యోగుల బాధలు తనకు తెలుసని ఆయన అన్నారు. ఉద్యోగ ఖాళీలను పెండింగ్‌లో ఉంచవద్దని ఆదేశించినట్లు చెప్పారు. పరీక్షలు నిర్వహించి నెలల వ్యవధిలోనే ఫలితాలు వెల్లడించామని ఆయన అన్నారు.

## ఉగాది నుంచి రేషన్ పై సన్నబియ్యం

**హైదరాబాద్ :** రేషన్ కార్డు దారులకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త. రేషన్ కార్డుల లబ్ధిదారులకు సన్న బియ్యం ఇచ్చేందుకు రేవంత్ ప్రభుత్వం రెడీ అయ్యింది. ఉగాది నుంచి రేషన్ షాపుల్లో సన్నబియ్యం పంపిణీ చేయాలని నిర్ణయించింది. అంతా అనుకున్నట్టు జరిగితే సూర్యాపేట జిల్లాలో సీఎం రేవంత్ ఈ పథకాన్ని లాంఛనంగా ప్రారంభించను న్నారు. ప్రస్తుతం రేషన్ దుకాణాల్లో దొడ్డు బియ్యం లబ్దిదారులకు ఇస్తున్నారు. చాలా మంది నిరుపేదలు వాటినే తింటున్నారు. పండగలు లేదా బంధువులు వచ్చినప్పుడు సన్నబియ్యం కొనుగోలు చేస్తున్నారు. మార్కెట్‌లో సన్న బియ్యం కేజీ రూ. 50 నుంచి రూ.75 మధ్య పలుకుతోంది. అంత డబ్బు పెట్టి కొనకుండా రేషన్ కార్డులపై ఉచితంగా సన్నబియ్యం ఇవ్వనుంది ప్రభుత్వం.ఒక్కో సభ్యుడికి 6 కేజీల చొప్పున ఎంతమంది ఉంటే అన్ని ఆరు కిలోలు సన్న బియ్యాన్ని ఇవ్వనున్నారు. రాష్ట్రంలోని అన్ని రేషన్ షాపుల్లో సన్నబియ్యం ఏప్రిల్ ఒకటి నుంచి ఇవ్వాలని భావిస్తున్నట్లు పౌరసరఫరాల శాఖ వర్గాలు వెల్లడించాయి. గోదాముల్లో సన్నబియ్యం సిద్ధంగా ఉన్నట్లు అధికార అధికారులు తెలిపారు. ప్రస్తుతం నిల్వ ఉన్న బియ్యం రానున్న 4 నెలల కాలానికి నెలలకు సరిపోతాయని అంచనా వేస్తున్నారు. రేషన్‌కార్డు దారులకు పంపిణీ చేసేందుకు ప్రభుత్వం సన్న బియ్యం తీసుకుంటోంది. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 91,19,268 రేషన్ కార్డులు ఉన్నారు. 2,82,77,859 మంది లబ్ధిదారులు ఉన్నారు. కొద్దిరోజుల కిందట కొత్త రేషన్ కార్డులు పంపిణీని అంతా సిద్ధం చేశారు. వారికీ సన్న బియ్యం అందనుంది. కోటి 10 లక్షల మంది రేషన్ కార్డు దారులకు సన్నబియ్యం ఇచ్చేందుకు కసరత్తు చేస్తోంది రేవంత్ సర్కార్.ఖరీఫ్ సీజన్‌లో రైతుల నుంచి పౌర సరఫరాల శాఖ దాదాపు 53.95 లక్షల టన్నుల వరి ధాన్యాన్ని కొనుగోలు చేసింది. కొనుగోలు చేసిన వడ్లను మిల్లర్లకు అందజేశారు. అక్కడ కస్టమ్ మిల్లింగ్ రైస్ చేసి వాటిని గోదాముల్లో నిల్వ చేశారు. గతంలో కంటే ఈసారి కొనుగోలు కేంద్రాలకు సన్న వడ్లు అధికంగా వచ్చాయని ప్రభుత్వ అధికారులు చెబుతున్నారు. సన్న, దొడ్డు వడ్లను వేర్వేరుగా నిల్వ చేసిన అధికారులు వాటిని మిల్లింగ్ చేయించారు.

## 61 లక్షల ట్రావెల్ అలవెన్స్

**హైదరబాద్ :** తెలంగాణ ఐఏఎస్ అధికారి స్మితా సబర్వాల్ కు నోటీసులు ఇచ్చేందుకు జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీ సిద్ధమైంది. యూనివర్సిటీ నుంచి వాహన అద్దెకు తీసుకున్న నిధులపై అడిట్ విభాగం అభ్యంతరం తెలిపిది స్మితా సబర్వాల్ కు నోటీసులు ఇవ్వాలని యూనివర్సిటీ అధికారులు నిర్ణయించారని సమాచారం.



సీనియర్ ఐఏఎస్ అధికారి స్మితా సభర్వాల్‌ను అద్దె కారు వివాదం చుట్టుముట్టింది. ప్రొఫెసర్ జయశంకర్ యూనివర్శిటికీ తన కారు అద్దె చెల్లింపు బిల్లులు పంపి డ్రా చేసుకున్నారని ఆడిట్‌లో తేలింది. కారుకు అద్దె పేరుతో యూనివర్శిటీ నుంచి రూ.61 లక్షల రూపాయలు బిల్లులు పెట్టి వసూలు చేసుకోవడంపై అభ్యంతరాలు మొదలయ్యాయి. ఇటీవల వర్శిటీలో నిధుల దుర్వి నియోగం, అక్రమాలపై ప్రభుత్వం విచారణ జరిపిస్తోంది. ఈ విచారణలో స్మితా సభర్వాల్ కు రూ.61 లక్షలు చెల్లించినట్లు గుర్తించారు అధికారులు.వాహన అద్దె కింద తీసుకున్న రూ.61 లక్షల నిధులను తిరిగి చెల్లించాలని మరో రెండ్రోజుల్లో ఆమెకు అధికారులు నోటీసులు జారీ చేయనున్నట్లు తెలుస్తోంది.2016 నుంచి 2024 వరకు సీఎంవో అదనపు కార్యదర్శిగా పనిచేసిన స్మితా సబర్వాల్ 90 నెలలకు గాను వాహన అద్దె కింద రూ. 61 లక్షలు తీసుకున్నారు. ఈ నిధులపై అభ్యంతం వ్యక్తం చేసిన ఆడిట్ విభాగం...న్యాయ నిపుణుల సూచనల మేరకు ఆమెపై చర్యలు తీసుకోనున్నట్లు అధికారులు వెల్లడించారు. స్మితా సభర్వాల్ తీసుకున్న కారు టీఎస్ 08 ఈసీ 6345 వాహనం నాన్ టాక్స్ కాదు. ఎల్లో ప్లేట్ వాహనం కూడా కాదు. ఈ వాహనం ప్రైవేటు వ్యక్తిగత వాహనం. పవన్‌కుమార్ పేరిట ఉన్నట్లు ఆడిట్ విచారణలో తేలింది. సీఎంవో ఉన్న సమయంలో స్మితా సభర్వాల్ కార్యాలయం నుంచి ప్రతి నెలా వాహనం అద్దె రశీదులు రావడంతో వర్సిటీ యాజమాన్యం డబ్బులు చెల్లించినట్లు తేల్చింది.ప్రొఫెసర్ జయశంకర్ యూనివర్సిటీ పని తీరుపై తీవ్రమైన విమర్శలు వచ్చాయి. ఇటీవల జరిపిన విచారణలో కొన్ని అవకతవకలు జరిగినట్టు తేలాయి. అందులో స్మిత సబర్వాల్ అద్దె కారు వ్యవహారం కూడా ఉంది. స్మితా సభర్వాల్ వాహనం అద్దెపై ఆడిట్ అభ్యంతరం చేయడం నిజమేనని విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ తెలిపారు.ఏజీ ఆడిట్ ఆధారంగా అంతర్గత విచారణ జరిపించామని స్పష్టం చేశారు. ఈ వ్యవహారాన్ని విశ్వవిద్యాలయం పాలకవర్గం దృష్టికి వచ్చిందన్నారు. సమావేశంలో దీనిపై విస్తృతంగా చర్చించామని తెలిపారు. దీనిపై సమగ్ర నివేదిక ప్రభుత్వానికి సమర్పించనున్నామని వర్సిటీ వర్గాలు తెలిపాయి. ప్రభుత్వం, న్యాయ నిపుణుల సూచనల మేరకు తదుపరి చర్యలు ఉంటాయని పేర్కొన్నాయి.యూనివర్శిటీ అడిటింగ్ లో స్మితాసబర్వాల్ కు సంబంధించిన ఓ విషయం బయటపడింది. స్మితా సబర్వాల్ నెలకు రూ.63 వేలు వాహన అలెవెన్స్ తీసుకున్నట్లు అడిట్ అధికారులు గుర్తించారు. యూనివర్శిటీ నుంచి వెహికల్ అలవెన్స్ కింద మొత్తం 90 నెలలకు రూ.61 లక్షలు తీసుకోవడంపై ఆడిట్ అధికారుల అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ విషయంపై యూనివర్సిటీ బోర్డు మీటింగ్?లో అధికారులు చర్చించారు. స్మితా సబర్వాల్ వర్సిటీ నుంచి తీసుకున్న డబ్బులు తిరిగి రాబట్టాలని బోర్డు మీటింగ్ లో నిర్ణయించినట్లు సమాచారం.ఈ విషయంపై ప్రభుత్వానికి రెండు మూడు రోజుల్లో పూర్తి నివేదిక అందించనున్నారు. అనంతరం స్మితా సబర్వాల్? కు నోటీసులు జారీ చేసి నిధులు తిరిగి రాబట్టాలని వర్సిటీ అధికారులు యోచిస్తోన్నట్లు తెలుస్తోంది. బీఆర్ఎస్ హయాంలో కీలక పదవుల్లో ఉన్న స్మితా సబర్వాల్ ఇప్పటికే కాళేశ్వరం ప్రాజెక్ట్ అవకతవకలు విషయంలో విచారణ ఎదుర్కొంటున్నారు. తాజాగా యూనివర్శిటీ నిధుల వ్యవహారంలో స్మితా సబర్వాల్ పేరు వినిపిస్తుంది.

Printed, Published & Owned by **SIRIKONDA MARIA,** Printed at ASHISH PUBLICATIONS H.No. 1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020 and Published from H. No. 1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020, Telangana. **Editor : SIRIKONDA AUGUSTIN. RNI No.: APTEL/2000/00272. E-mail :** voodayam2007@gmail.com, Cell : 9247698676. Telefax: 040-27678676.